తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలుగు సాహిత్య పక్ష పత్రిక



డిసెంబర్ 16, 2020

సంపుటి 01 సంచిక 05

Complimentary Copy - 5



బహుజన హితుడు ... జ్యోతిరావు పూలే

*Printed and Published by :* ***TELANGANA JAGRUTHI***
Pasham Amruthaaram Residency,  H.No. 1-2-234/13/46/4, 3rd Floor,
Near NTR Stadium  Aravind Nagar, Domalguda,
Hyderabad - 500 029. Telangana State.
E-mail : editor@thangedu.co.in

# ఈ సంచికలో



సీతశోకాన్ని సార్వజనీనం చేసిన నాటి **హళక్కి భాస్కరుని** పద్యకవిత.... 16

**మహోన్నతమైన తెలంగాణా మహిళను** చిత్రించిన **సి.హెచ్. మధు కవిత...** 00



41

క్షీణిస్తున్న నాటి **పల్లె వాతావరణం** తెలుపుతున్న కటుకోజ్వల కథ...



37

**పాటపల్లి రామారావు** కథలలో నాటి తెలంగాణా గ్రామీణ వ్యవస్థ చూపించిన వ్యాసం...
**పాట్లపల్లి కథలో తెలంగాణ**



05

తెలంగాణలో ఎందరో పాట కవులున్నారు. మూసీ వరద సమయంలో దు:ఖాన్ని పాటగా ప్రవహింపజేసిన కొందరి **విస్మృతమైన పాట** గురించి **వెల్దండి శ్రీధర్** వ్యాసం



33

నాటి జమిందారీ వ్యవస్థలో లాలూచీ అధికారులు, గ్రామ పెద్దల మోసం, బక్క రైతుల ఆవేదన చిత్రించిన నాటి కథ **ఆవుల పిచ్చయ్య... దొర**



17

కరోనా కల్లోలానికి విలవిలలాడిన మధ్య తరగతి కుటుంబం కథ **ఐతా చంద్రయ్య.... సుడిగుండాలు**



09

ఉత్పత్తి కులాలని పరిరక్షించుకోవలసిన బాధ్యతను గుర్తు చేసిన **శిరం శెట్టి కాంతారావు** పరంపర నవలను పరిచయం చేసిన ఎస్. రఘు కంచర వృత్తి కళాకారుల భావోద్వేగాల **బ్రతుకు ప్రయాణం,** వ్యాసం...

---

చిరునామా పొరపాటుగా రాసి భంగపడ్డ యువకుని కథ **పిన్నం శెట్టి కిషన్** కలం నుండి... 29

**తొలినాటి తెలంగాణా కవిత్వం** ఆనవాళ్ళను మన ముందు పరచిన **సంగి శెట్టి** వ్యాసం... 23లో

నాటి కథకులు **గూడూరు సీతారాం** కథా కథన విధానాన్ని మనముందు ఆవిష్కరించిన **నిజాం వెంకటేశ్** వ్యాసం.. 13లో

కవి ప్రాకృతికానుభావాన్ని తెలిపిన వ్యాసం... ప్రకృతి కవి **జయరాజ్ "అవని"** పరిచయం... 28లో

ఈనాటి కవి ప్రచురణా వ్యవస్థను గురించి పడుతున్న ఆవేదన **చొప్పదండి సుధాకర్ సృజన రూప కలలు** కవిత.... 21లో

**రైతు శ్రామిక జీవన సౌందర్యం** చెప్పిన **కోటం చంద్ర శేఖర్** కవిత... 31లో

జీవితం ఆనందమయం చేసుకోవాలనే సందేశం ఇచ్చిన **సత్యవతి** కవిత.. **నవ్వుకుంట బతుకాలె... 21లో**

**హద్దు మీరితే** వచ్చే దుష్పరిణామాన్ని చెప్పే **కోట్ల** కవిత... 39లో

మనసు తెరమీద కదలే దృశ్య సంచయాన్ని చెప్పే కవిత **కళ్ళు ఆకాశాలై... సముద్రాలై 32లో**

ఇంకా శిఖరం, దృశ్యం, స్వీకారం, పుస్తక సమీక్ష... ఇంకా మరెన్నో

# తంగేడు సంచికకు స్పందన...




పత్రిక చాలా బాగుంది. నాకు పంపినందుకు ధన్యవాదాలు
- లక్ష్మీ కందమల్ల, రచయిత్రి

మీ పత్రిక అందుకొన్నాను. మూడవ సంచిక నాకు వచ్చింది. అద్భుతంగా ఉంది
- జూపాక సుభద్ర, (కవయిత్రి)

అద్భుతంగా ఉంది పత్రిక. విషయం, ముస్తాబు పోటీ పడ్డాయి. త్వరగా రేటు నిర్ణయించండి
- ఎస్.వి. రామారావు (సినీ విమర్శకులు)

ఇప్పుడే తంగేడు అందింది. తెలంగాణ నుండి ఇలాంటి సాహితీ పత్రిక రావాలన్న కల తీర్చినట్టుంది తంగేడు. కంగ్రాట్స్
- సుద్దాల అశోక్ తేజ, సినిమా కవి

ఎంత ముద్దొస్తుంది తంగేడు. అభినందనలు
- నోరి రాజేశ్వర రావు, విజిటింగ్ ప్రొఫెసర్, తెలుగు విశ్వవిద్యాలయం

మీ తంగేడు పత్రిక చక్కగా ఉంది.పేజీలు ఇంకా పెంచండి. మాస పత్రిక అయితే బాగుంటుంది. పేపరు ఇంత క్వాలిటీ ఎందుకు...?
- ఏటుకూరి ప్రసాద్, సంపాదకులు

తంగేడు విలక్షణంగా ఉంది. ఉత్తమాభిరుచి గలిగిన పాఠకులకు ఒక పసందు
- టి. గౌరీ శంకర్, రిటైర్డ్ ప్రొఫెసర్, రిజిస్ట్రార్, తెలుగు విశ్వవిద్యాలయం

తంగేడు అన్ని సంచికలు అందుతున్నాయి. మిమ్మల్ని ఎలా అభినందించాలో తెలియడం లేదు.
- అనంత పద్మనాభ రావు, సాహితీ వేత్త

కథలు, కవితలు పరిశోధక సాహిత్య వ్యాసాలతో ప్రముఖుల ఇంటర్వ్యూలతో తంగేడు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకొంది
- సంకెపల్లి నాగేంద్ర శర్మ, సీనియర్ హిస్టారియన్

చక్కటి సాంకేతిక విలువలు గల కవిత గారి ఆధ్వర్యం, అత్యుత్తమంగా పద్య ప్రక్రియను పోషిస్తూ, ఆధునిక ప్రక్రియను ఆదరిస్తూ చక్కని వ్యాసాలు, కథలతో ఆకట్టుకొంటున్న తంగేడు, పాఠకుల హృదయాలను చిరకాలం రంజింపజేయాలని కోరుకుంటూ
- పుట్టపర్తి నాగ పద్మినీ దేవి

తంగేడులో ప్రతి విషయం వెనుక కృషి కనబడుతోంది. అభినందనలు
- అష్టకాల రామ్మోహన్, సంపాదకులు, తెలంగాణ మాస పత్రిక

మీ మూడవ సంచిక అందుకొన్నాను. మిమ్మల్ని అభినందించకుండా ఉండలేకపోయాను. కొత్త వాళ్ళకు ఎక్కువ స్థానం ఇవ్వండి. కొనసాగించండి.
- నిఖిలేశ్వర్ (కవి)

సంపాదకీయం

తంగేడు

తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక

**16 డిసెంబర్, 2020**

సంపుటి 01 సంచిక 05



శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్



డా॥ కాంచనపల్లి గో.రా.
అసోసియేట్ ఎడిటర్
9676096614

# జాతి నిర్మాతలు సృజన కారులే...

జాతికి ఆత్మ గౌరవం ఉండాలె. అట్లాంటి జాతే కళలను అభిమానిస్తుంది. తమ జాతి నిర్మాణంలో స్వతంత్రేచ్ఛలో సృజన కారుని పాత్ర గుర్తిస్తుంది. గౌరవిస్తుంది.

నిజానికి సాహిత్యం అంటేనే ఒక ఉద్యమం. అది కొద్ది మందితోనే మొదలవుతుంది, క్రమంగా సమాజానికి సంక్రమిస్తుంది. నలుగురు విద్యావంతులు చేరినపుడు అదొక సాహిత్య గోష్ఠి కావాలి. కాకపోతే అట్లాంటి కలయిక కోసమైనా విద్యావంతులు ఒక చోట చేరాలి. కవులు తమ పద్యాలను సహకవులకు వినిపించుకోవడం, సహకవులు తమకు వినిపించడమే గాకుండా, అవి ప్రజలకు వినిపించాలె. ప్రజలు కవులు రాసిన పద్యాలతో మమేకం కావాలె.

సాహిత్యం తన సృజన కాలానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. అంతమాత్రాన అది ఆ కాలానికే పరిమితమైనది కాదు. కాలాతీతమైన సార్వజనీనత కూడా సృజనలో ఉంటుంది. చాలా మంది గ్లామరు కలిగిన వ్యక్తులవలె, సృజనకారుని వెనుక సామాన్య జనం ఉండకపోవచ్చు, ఒక పెద్ద గుంపు అతన్ని అనుసరించక పోవచ్చు. అధికార పటాటోపం లేని అతి సామాన్య వ్యక్తిగా అతను కనిపించవచ్చు.

కాని అతను ఒక జాతితో మనగలుగుతాడు. ఒక జాతికి వారసత్వ సంపద కాగలుగుతాడు. అతని వాక్యాలు ఒక్కోసారి ఒక జీవితకాలపు చమరింతగా నిలిచిపోతాయి.

ఈ ప్రతిభ వల్లే ఆ కాలానికి నాగలి దున్నైనా పోతన ఈ కాలంలో కూడా జీవిస్తున్నాడు. "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అన్నపుడు దేహం పులకాంకురం అయ్యేది ఈ సోయి వల్లనే. నిజానికి పోతన, నాటి ప్రభుత్వ నిరాదరణకు గురైన దాశరథి, "బాకున గ్రుమ్మినట్లగును" అని వేదన పడ్డ జాషువా, తన కలం తో నిప్పులు కురిపించిన కాళోజి లాంటి వాళ్ళంతా అతి సామాన్యంగా జీవించిన వాళ్ళే. కాని వాళ్ళంతా జాతి స్మరించుకోదగిన మహనీయులుగా తమ స్థానం నిలబెట్టుకొన్నారు.

సాహిత్యానికి కాలం చెల్లి పోయిందనే నిష్ప్రయోజన వాదులు మనకు కనిపిస్తారు. సృజనకారులను అవహేళన చేయడం వారి బాధ్యత అన్నట్టుంటుంది వారి వ్యవహారం. "ఈ రాతలు కోతలు తరువాత ,ముందు నీసంగతి చూసుకో" అని తమకు తామే పెద్దరికాన్ని ఆపాదించుకొని చిన్నబుచ్చేవాళ్ళుంటారు. మోకాలంత ఎత్తు లేనివారు వీపు తట్టడానికి ప్రయత్నిస్తారు.

నిజమైన ప్రజాక్షేత్రం ముందు ఇవేమీ నిలవవు. గాఢమైన సృజన తప్పక నిలుస్తుంది. అటువంటి అన్వేషణ, దానితోపాటు సామాజిక ప్రయోజనం, సృజనకారుని బాధ్యతలుగా మలచుకోవాలి.

ఏ జాతైతే జాతి నిర్మాతలైన కవుల్ని, గుర్తించదో, స్మరించుకోదో, ఆ జాతి నిర్వీర్యమౌతుంది. కాల యవనిక నుండి నిష్క్రమిస్తుంది.

సృజన-జాతీయత విడగొట్టలేని అంశాలు.

అందుకే సృజనకు మన నీరాజనం.

జై తెలంగాణ, జై జాగృతి

కవిత కల్వకుంట్ల

క వి త

# తెలంగాణ మహిళా నీకో వందనం

సి.హెచ్. మధు

పారుతున్న నది కంటే
స్వచ్ఛంగా కనిపిస్తున్న
తెలంగాణ మహిళా సంస్కారం
హిమాలయమంత ఉన్నతంగా
చరిత్ర పుట్టిన నుండి వుంది
తెలంగాణ నేల ఆత్మాభిమానాన్ని
ప్రపంచ జెండాగా నిలిపిన
తెలంగాణ మహిళకో సైల్యూట్
తెలంగాణ మహిళా సంస్కారం
హిమాలయాల కంటే ఉన్నతంగా వుంది
గులాబీల గంధం
మల్లెపూల సుగంధం
చల్లగాలి ఆనందం
తో బతుకంతా తన్మయత్వం
నా తెలంగాణ మహిళ ప్రతీక
కట్టు బొట్టు మాట మకరందం
హుందాగా వెన్నెల్లా వుంటాయి
తెలంగాణ సంస్కార నీతి జెండాగా ఎగురుతుంది
తెలంగాణ మహిళలో హింసాత్మక ఆలోచనలు లేవు
మనసు కరుణామయం
ఆత్మ తూర్పు సూర్యోదయం
నేటి టీవీ సీరియల్స్‌లో
మహిళ కనిపిస్తుంది
కత్తీ పిస్తోలు, కుట్రలు, కిడ్నాప్‌లు
అవేవీ మా తెలంగాణ మహిళలో లేవు
హింస కుట్రలు కుతంత్రాలు మోసం
స్త్రీలు నా తెలంగాణలో కనిపించరు
నా తెలంగాణ మహిళా ఆధునికత,
అందానికి దూరం
ఆమె మనసు ఒక ఆనందం
ప్రపంచంలో ఆకాశం ఎత్తు ఎదిగిన
తెలంగాణ మహిళ, అక్క, చెల్లెలు, తల్లి అమ్మకు
నా సైల్యూట్

## రచయితలకు సూచనలు

- సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి
- పత్రిక కోసం రచనలు పంపించే వారు యునిక్ కోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి
- మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి
- పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.

**తెలంగాణ జాగృతి**
పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర,
అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in

నాటి కథ

# తెలంగాణ విస్మృతమైన పాట

తెలంగాణలో మరుగునపడ్డ పాటను
వివరిస్తున్న వెల్దండి....



డా॥ వెల్దండి శ్రీధర్

తెలంగాణ పాట ప్రపంచ వ్యాప్తమై శతాబ్దాలు గడిచినా ఇంకా ఇక్కడి పాటపైన సమగ్ర పరిశోధన జరగలేదనే చెప్పాలి. ఆచార్య బిరుదురాజు రామరాజు జానపద గేయ సాహిత్యానికి, ఆచార్య యెల్దండ రఘుమారెడ్డి తెలుగు పల్లెపదాలలో ప్రజాజీవితానికి, ఆచార్య జయధీర్ తిరుమలరావు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట పాటలకు, డా॥ గోపు లింగారెడ్డి శ్రామికగేయాలకు, డా॥ కె. రుక్నుద్దీన్ జానపదసాహిత్యంలో అలంకార విధానానికి, ఆచార్య ఎస్వీ సత్యనారాయణ ఉద్యమ గీతాలకు, డా. పసునూరి రవీందర్ తెలంగాణ పాటలోని ప్రాదేశిక విమర్శకు పరిమితమైపోయారు. కాని తెలంగాణ పాట సమగ్ర స్వరూపాన్ని నిరూపించిన పరిశోధన ఇంకా పూర్తిస్థాయిలో జరగలేదు. తెలంగాణ పాటలోని ఒక్కో కోణాన్ని స్పృశిస్తూ అక్కడక్కడ వ్యాసాలైతే చాలానే వచ్చాయి.

తెలంగాణ నేల మీద అనేక సంస్కరణ ఉద్యమాలు జరిగాయి. శివకవియుగంలో పాల్కురికి సోమనాథుడు శివుని ముందు అందరూ సమానులే అని ప్రచారం చేసి ఆయన తన కాలం నాటి అనేకజానపద జావళీలను పేర్కొన్నాడు. శ్రీనాథుడు కూడా పల్నాటి వీరచరిత్రలో తెలంగాణలోని 'బవనీల పాటలు, ఎల్లమ్మ పాటల'ను పేర్కొన్నాడు. భక్త రామదాసు పాటలపై కూడా ఇంకా పూర్తిస్థాయిలో పరిశోధన జరగలేదనే చెప్పాలి. స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలకోసం, వెట్టిచాకిరి నిర్మూలన, మద్యపాన నిషేధం, పన్నులకు వ్యతిరేకంగా, గ్రంథాలయోద్యమం, అంటరానితనానికి, వ్యభిచారానికి, ఆడపాపల ఆచారానికి, జోగినీ, దేవదాసి ఆచారానికి వ్యతిరేకంగా, భూదానోద్యమ ప్రచారానికి, అక్షరాస్యత కోసం, ఖాదీ వస్త్రధారణ, స్టేట్ కాంగ్రెస్ ప్రచారానికి, ఆర్య సమాజ ప్రచారానికి, భూమి, భుక్తి, విముక్తి కోసం, సోషలిస్టు ఉద్యమాల ప్రచారానికి, హిందూ మహాసభల కోసం, శుద్ధి ఉద్యమ ప్రచారానికి, కూలీ జీతాల పెంపుకోసం, ఆంగ్లేయపాలనలో దేశభక్తి పెంపుదల కోసం, వందేమాతర ఉద్యమ సమయంలో, ఆంధ్రమహాసభల ప్రారంభ, ముగింపు సమయాల్లో, తెలంగాణ పోరాటవీరుల స్మృతి పాటలు, గణేశ్ ఉత్సవాల పాటలు, వివిధ పండుగల పాటలు, ప్రభాతభేరి పాటలు, పీరీలపాటలు, ఉర్సుపాటలు, భక్తిపాటలు, భజనపాటలు, తందనానపాటలు, తత్త్వగీతాలు అనేకం పురుడు పోసుకున్నాయి. సాహిత్య చరిత్ర పుటలకెక్కని ఎన్నో వేలజానపద పాటలు ప్రజల నోళ్లల్లో ఇప్పటికీ నానుతూనే ఉన్నాయి. కాని దురదృష్టవశాత్తు వాటిని మనం రికార్డు చేసుకోలేకపోయాం. అట్లా ఎంతో విలువైన గేయ సాహిత్యం కాలగర్భంలో కలిసిపోయింది. అయితే సురవరం ప్రతాపరెడ్డి, సీతారామ నాయుడు, గంగుల శాయిరెడ్డి, ఇల్లిందల సరస్వతీదేవి, అచ్యుతరాజు వంటి వారు కొన్ని తెలంగాణ స్త్రీల పాటలను సేకరించారు. సీమాంధ్రకు చెందిన వారైనా రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొనడమేగాకుండా అనేక తెలంగాణ జానపదగేయాలను సేకరించి సంపుటిగా తీసుకొచ్చిన వారు లక్ష్మీకాంతమోహన్. ఇవిగాక అంతగా ప్రచారంలేని పాటలు కొన్ని అక్కడక్కడ పేర్కొనబడ్డాయి. అలా విస్మృతికి గురైన 1956కు ముందటి తెలంగాణ పాటను రేఖా మాత్రంగా పరిచయం చేయడమే ఈ వ్యాస లక్ష్యం.

1908 సెప్టెంబర్ 28న హైదరాబాద్ నగరంలో 17 సెంటీమీటర్ల వర్షం కురవడంతో మూసీ (ముచికుంద) నది వరదలతో ఉప్పొంగింది. దీంతో నగరం సగానికి పైగా నీటిలో మునిగిపోయింది. కొన్ని వేల మంది నిరాశ్రయులయ్యారు. మరెన్నో వేల జంతువులు, మనుషులు మరణించారు. ఇండ్లన్నీ నీటిలో

మునిగిపోయాయి. వరద బాధితులకు ఉచిత భోజన, నివాస ప్రాంతములను ఆనాటి ప్రభుత్వం కల్పించింది. ఆనాటి నవాబు మహబూబ్ అలీఖాన్, ఆయన ప్రధాన మంత్రి మహారాజా సర్ కిషన్ పలుసార్లు స్వయంగా సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ వరదలను చూసి జగిత్యాల ఆదికవిగా పేరుపొందిన జైశెట్టి రాజయ్య (1842-1921) 'ముచికుంద ప్రళయతాండవము' శీర్షికన కొన్ని గేయాలను రాశాడు. ఈ గేయాలలో ఆనాటి నిజాం ప్రభువు ప్రజలను తన కన్నబిడ్డల్లాగా చూసుకున్నాడని చెప్పడం గమనించదగింది.

"ముచికుంద నది వచ్చెనయ్యయ్యో
పట్నమును ముంచి
చెడగొట్టెనయ్యయ్యో
ముచుకుంద నది వచ్చె మునిగె
పట్నము సగము
నశియించి జనులంత నదిలో
గొట్టుక పోయిరి ॥ముచి॥
కనబడ్డా పీనుగులా జూచిరీ
అడవికట్టె మండెల రీతి మోసిరీ
దినమూలు మూన్నాల్లు దినమూలు
మొయ్యంగ
పీనుగులు ఏడు వేలెనుబై
మూడె దొరికె ॥ముచి॥
రాజాధి మహబూబు రాజురా
మనల రక్షించే ధైర్యంబు రాజురా
యజమాని మనరాజు ఎంతో
ధర్మాత్ముడై
సుజనుడై పాలించి ప్రజలాకన్నము
బెట్టె" ॥ముచి॥

ఈ గేయంలో కవి మూసీ నది ఉగ్రరూపాన్ని కన్నులకు కట్టినట్టు వర్ణించాడు. దైవానుగ్రహం ఎలాంటిదో కాని అదే రోజు వివిధ గ్రామాల నుండి ఏదో పని పై వచ్చి మూసీనది వరదల్లో కొట్టుకుపోయినవారు వేలకొలది ఉన్నారని కవి ఆవేదన చెందాడు. లెక్క రాసిన దస్త్రాలు, చెట్లు విరిగి నగరమంతా అతలాకుతలమైందని బాధపడ్డాడు. మూడు నాలుగు రోజులు పీనుగులను మండెలా వేసి మోశారని, ఈ దృశ్యాలను చూసి నవాబు తీవ్రమైన ఫికర్‌తో తండ్లాడినాడని వర్ణించాడు. ఈ కవి రాసిన పాటలు కొన్ని 'మనస్సంబోధన కీర్తనలు' పేర 1933లో ముద్రణ పొందాయి.

1930లో జోగిపేట మొదలుకొని 1946 కంది సభదాకా మొత్తం 13 ఆంధ్రమహాసభలు జరిగాయి. ఈ సభల ప్రారంభంలో, ముగింపులో పలు ప్రార్థనాగీతాలు, జాతీయ గీతాలు, మంగళగీతాలు పాడేవారు. సుదర్శన్ రెడ్డి అనే గాయకుడు ఇలా చాలా పాటలు వినిపించేవాడు. 1936లో షాద్ నగర్ లో జరిగిన ఐదవ ఆంధ్రమహాసభలో మంత్రి ప్రగడ వెంకటేశ్వరరావు కింది 'తెలంగాణ గీతాన్ని పాడి వినిపించారు.

> **'అష్టకష్టములిట్లు పడనేలా!' అంటూ సాగిన ఈ పాట వెట్టిచాకిరికి వ్యతిరేకంగా రాసిన పాట. తెలంగాణలో తెలుగుదేశం ప్రభుత్వం రాకముందు దాకా ఈ వెట్టిచాకిరి అనధికారికంగా సాగిన మాట నిజం. ఈ సాంఘిక దురాచారానికి వ్యతిరేకంగా ఆనాడు అనేక మంది తెలంగాణ కవులు, రచయితలు, గాయక కవులు నిరసిస్తూ పాటలు రాసి, తిరగబడండే ఇది రూపుమాసిపోదని చైతన్యం కలిగించారు. అడగనిదే అమ్మయినా అన్నం పెట్టదు. ఇంకెన్నాళ్లు మనం కనీసం అన్న వస్త్రం లేక అల్లాడి చావడమని కవి ప్రశ్నిస్తాడీ పాటలో.**

"ఈ తేనె మాగాణి/నీ
తెలంగాణమ్ము/ నా తల్లియని పాడరా!
నీ జీవ మాతగా సేవింపరా!/ తమ్ముడా
నీ జీవ మాతగా సేవింపరా!! శ్రీరామ
చంద్రుడు/సీతా మహాదేవి/
కారాగృహమయ్యెరా!
ఈ భూమి ఆతిథ్యమ్ముల సీమరా!
తమ్ముడా! ఈ భూమి ఆతిథ్యమ్ముల
సీమరా!!"

తెలంగాణ వైభవాన్ని చాటుతూ సాగిన ఈ పాట ఆనాడు సభలో పాల్గొన్న ఎంతో మంది తెలంగాణ ప్రజల మన్ననలను పొందింది. ఉర్రూతలూగించింది. ప్రతి ఒక్కరూ తాను తెలంగాణ నేల మీద పుట్టినందుకు గర్వపడేలా చేసింది. తలెత్తుకొని తిరిగేలా, గుండెల నిండా ఆత్మవిశ్వాసం నిండేలా చేసిందీ పాట. ఐదు చరణాలుగా సాగిన ఈ పాటలో పోతన భాగవతము ద్వారా తెలంగాణ నేలలో తెలుగు భాష మిన్నంటిందని, కాకతీయ రుద్రమ్మదేవి రౌద్రం దశదిశలా పాకిందని తెలంగాణ ఔన్నత్యాన్ని కొనియాడడం కనిపిస్తుంది. వీరే రాసిన సుమారు 15 పాటలు 'జాతీయగీతములు' పేరిట 1939లో ప్రచురింపబడ్డాయి. ఈ పాటల పుస్తకం ఇటీవలి తెలంగాణ ప్రచురణ సంస్థ పునర్ముద్రించింది. ఇందులో భక్తి, దేశభక్తి, ఆర్యసమాజ ప్రచార గీతాలు, రైతుల, పేదల బాధల గురించిన గేయాలున్నాయి. వీరిని ప్రశంసిస్తూ సురవరం ప్రతాపరెడ్డి "పాటలు రచించుటలోవీరికి మంచి నేర్పు అలవడినది. అవిద్యాంధకారములో దిక్కు తెలియని ఈ నిజాం రాష్ట్రమునకు ఇట్టి విజ్ఞాన ప్రదములును, ప్రబోధకరములునగు భజనావళి వెలుగు నిచ్చునవైయున్నవి. మంచి గానముల వలన ప్రజలలో కలుగునట్టి జాగ్రత మరే విధమున కాజాలదని విశ్వసింతును" అని అభిప్రాయపడ్డారు.

"రండోయి ప్రజలారా రాజసౌధమునకు
రక్కసుల కృత్యములు తెలుపుకొనగ
రక్షకుడు మన రాజు రక్కసుల శిక్షించి
రక్షించు మన బీదప్రజల త్వరగ
॥రండోయి॥
పండ మంచము లేక తిండికన్నము లేక
ఎండి చచ్చేదిట్టు లెందాక
దండివారలు జేయు దుండగములకు తాళి
యుండజాలమటంచు తెలుపుకొనక
॥రండోయి॥
పొట్టకన్నము లేక వెట్టిచాకిరి చేసి
కొట్టుతిట్టులు మనము పడనేలా!

*వెట్టిజేయుటకేనా! పుట్టింది జగతిలో*
*ఇట్టులూరక చూచుచుండుటేలా!*
*॥రండోయి॥*

'అష్టకష్టములిట్లు పడనేలా!' అంటూ సాగిన ఈ పాట వెట్టిచాకిరికి వ్యతిరేకంగా రాసిన పాట. తెలంగాణలో తెలుగుదేశం ప్రభుత్వం రాకముందు దాకా ఈ వెట్టిచాకిరి అనధికారికంగా సాగిన మాట నిజం. ఈ సాంఘిక దురాచారానికి వ్యతిరేకంగా ఆనాడు అనేక మంది తెలంగాణ కవులు, రచయితలు, గాయక కవులు నిరసిస్తూ పాటలు రాసి, తిరగబడందే ఇది రూపుమాసిపోదని చైతన్యం కలిగించారు. అడగనిదే అమ్మయినా అన్నం పెట్టదు. ఇంకెన్నాళ్లు మనం కనీసం అన్న వస్త్రం లేక అల్లాడి చావడమని కవి ప్రశ్నిస్తాడీ పాటలో. ఈ పాటతోపాటు 'అయినదేమో ఆయె పోనీయండి', 'కర్షకా!', 'కష్టములెన్నేనియు రానిమ్ము' అనే పాటలు ఆనాడు చాలా ప్రజాదరణ పొంది ఈ కవికి చాలా పేరు తీసుకొచ్చాయి. ప్రజల్లో ఎంతో కదలికను తీసుకువచ్చాయి.

1943 - 44 లోనే జొన్నవాడ రాఘవమ్మ అనేక భక్తిపాటలు, భజన పాటలు, కీర్తనలు, దేశభక్తి పాటలు, జానపదగేయాలు రాసింది. ఈమె రాసిన అనేక పాటలు ఆకాశవాణిలో లలితగేయాలు శీర్షిక కింద

**జానపద కళారూపం నల్గొండ జిల్లాలో చాలా ప్రసిద్ధిగాంచింది. ప్రజలు కుల, మతాలకతీతంగా దోపిడికి వ్యతిరేకంగా ఒక్కటైపోయి ఈ 'చుట్టకాముడు' ఆటలో పాల్గొంటారు. ఈ ఆటలో పాడుకునే అనేక పాటల్లో బతుకమ్మ పాటల్ని పోలిన పాటలు కూడా ఉన్నాయి. ఇందులో భాగంగా మల్లు స్వరాజ్యం రాసిన ఉయ్యాలపాట నల్గొండ జిల్లాలో చాలా పేరుగాంచింది.**



ప్రసారమయ్యాయి. ఈమె రాసిన 159 పాటలతో 'రాధికా గీతాలు', 119 గేయాలతో 'భావతరంగాలు' ముద్రితమయ్యాయి.

"నడచిరారా కృష్ణయ్య నడచిరా
నా మనసు బాటలోకి నా పేద గూటిలోకి
తలచి తలచి తనువు మనసు అలసి సొలసి పోయినది
ఎన్నాళ్లో నిలవదు ఈ స్థిరము లేని జీవితం
కన్నులారా ఒక్కసారి కాంచెద నీ రూపం" ॥నడచిరారా॥

అచంచలమైన భక్తితత్త్వంతో శ్రీకృష్ణుని కీర్తించిందీ పాటలో. ఈ గేయంలో భక్తి ఒకవైపు జీవిత తాత్త్వికత మరోవైపు తొంగిచూస్తాయి. జీవితం క్షణభంగురం కాబట్టి జీవించియున్నప్పుడే ఆ దేవదేవుని కీర్తించాలంటుంది. ఇదేగాక మంచి భావనాత్మక గీతాలు కూడా అనేకం రాసిందీ కవయిత్రి. "ఆకసమ్మున అల్లిబిల్లిగ - అలికి చుక్కలు దిద్దిరెవ్వరు/ అందమగు ఆ చందమామను కందుకము వలె కదిపిరెవ్వరు" అని, భారత ప్రథమ ప్రధాని నెహ్రూను కీర్తిస్తూ "విరిసిన గులాబి ఎదపై నిలయం/త్యాగం ధైర్యం చెదరని హృదయం" అని పాడింది.

మరో కొన్ని గీతాల్లో. ఇవేగాక తెలంగాణ పోరాటగేయాలు కూడా కొన్ని రాసింది.

1939లో భద్రాచలం పుట్టిన డా॥ చక్రవర్తుల లక్ష్మీనరసమ్మ 1948లో మహాత్మాగాంధీ మరణవార్త విని 'భారత జనకుడు ఇక లేడు/గాంధీ తాత ఇక లేడు' అని తన గేయ యాత్ర ప్రారంభించింది. కావ్యగౌతమి, మాతృభూమి, తులసీ దళాలు, భక్తిగీతావళి, దివ్యగీతాంజలి... ఇలా దాదాపు పాతిక పుస్తకాలు వెలువరించింది. ఈమె పాడిన పాటలు కొన్ని ఆకాశవాణిలో ప్రసారమయ్యాయి.

"మేఘము నీవే అనుకొని ఆడెద నేనే నెమలినై
కలనైనా ఇది చాలు/తెలవార నీకురా"

రసజగత్తులో నిలయముండే ఆ దేవుడ్ని విషతుల్యమైన లోకంలో నివసించే మానవుడు చేరుకోవాలంటే చాలా కష్టం. మనం ఆయనను చేరుకోలేం అంటుంది లక్ష్మీనరసమ్మ. నైజాం వ్యతిరేకపోరాటంలో 'చుట్టకాముడు' అనే జానపద కళారూపం నల్గొండ జిల్లాలో చాలా ప్రసిద్ధిగాంచింది. ప్రజలు కుల, మతాలకతీతంగా దోపిడికి వ్యతిరేకంగా ఒక్కటైపోయి ఈ 'చుట్టకాముడు' ఆటలో పాల్గొంటారు. ఈ ఆటలో పాడుకునే అనేక పాటల్లో బతుకమ్మ పాటల్ని పోలిన పాటలు కూడా ఉన్నాయి. ఇందులో భాగంగా మల్లు స్వరాజ్యం రాసిన ఉయ్యాలపాట నల్గొండ జిల్లాలో చాలా పేరుగాంచింది.

"వీరమట్టారెడ్డి ఉయ్యాలో/ మీ వీరమరణమును ఉయ్యాలో
మీ వంటి వీరులు ఉయ్యాలో/మాకు వెల్గు చూప ఉయ్యాలో
ఆ దొంగ దోపిడులు ఉయ్యాలో/

**ఆణిముత్యాల్లాంటి పాటలెన్నో తెలంగాణ నేల చుట్టూ, తెలంగాణ మనుషుల చుట్టూ, తెలంగాణ పల్లెల చుట్టూ, ప్రకృతి చుట్టూ అల్లుకుని ఉన్నాయి. కాలం కత్తెరలో పడి నశించిపోయినవి పోగా కనీసం మిగిలిన వాటినైనా మనం సేకరించి భద్రపరుచుకోవాలి. పరిశోధకులు వాటి విశిష్టతను భవిష్యత్తు తరాలవారికి విశ్లేషించి చెప్పాలి. అయితే ఇదంత సులభమైన పనికాదు. విశ్వవిద్యాలయాలు కాని, సాహిత్య సంస్థలు కాని ఆ బాధ్యత తీసుకొని చాలా అంకిత భావంతో, బాధ్యతగా చేయాల్సిన పని.**

*ఆంధ్రమహాసభ ఉయ్యాలో*
*హడలెత్తి సంఘాన్ని ఉయ్యాలో/పాత సూర్యాపేట ఉయ్యాలో*
*ధీర అనంతారెడ్డి ఉయ్యాలో*
*మరువమెన్నటికైనా ఉయ్యాలో"*

ఈ పాటలో నైజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన వీరయోధుల త్యాగాలు, వారిని ప్రజలు కీర్తించిన విధానాన్ని చిత్రించింది మల్లు స్వరాజ్యం. 1951 ఆగష్టు 15న భువనగిరిలో నక్క ఆండాళమ్మ (డా.ఎన్. గోపి అక్క) అనే యువతి అక్కడి ఒక దర్గాలో కొంత మంది దుండగుల చేతిలో అఘాయిత్యానికి గురై వాళ్ల చేతిలోనే చంపబడింది. ఈ ఘోరమైన దృశ్యాన్ని ఆనాడు బల్ల గౌతమయ్య అనే కవి బతుకమ్మ పాటగా మలిచాడు. ఈ పాట ఇప్పటికీ తెలంగాణ పల్లెల్లో మారుమ్రోగుతుంది. "కారుమూకలు నన్ను ఉయ్యాలో/ కాల్చుచున్నారమ్మా ఉయ్యాలో జాలిగా ఈ రీతి ఉయ్యాలో తలపోసి ఆయమ్మ ఉయ్యాలో పాడు దరగలోన ఉయ్యాలో/ప్రాణాలు విడిచింది ఉయ్యాలో..." ఇలా సాగుతుందా బతుకమ్మ పాట. ఈ వరుసలోనే కొమురం భీము, దొడ్డి కొంరయ్య, సీమ గురువయ్య లాంటి పోరాట వీరుల మీద చాలా స్మృతి గీతాలు వచ్చాయి. ఆర్. కమల అనే గాయకురాలు కూడా చాలా బతుకమ్మ, బొడ్డెమ్మ పాటల్ని రాసింది. ఆంధ్రసారస్వత పరిషత్తు నల్గొండ జిల్లా శాఖ ప్రచురణగా 1946లో మూటుపూరు వెంకటేశ్వరరావు సంపాదకత్వంలో 'తొలిసంజ' పేరుతో నల్గొండ జిల్లా ఆధునిక కవితా సంకలనం ఒకటి వెలువడింది. ఇటీవల ఇది డా. సుంకిరెడ్డి నారాయణరెడ్డి సంపాదకత్వంలో పునర్ముద్రణ పొందింది. దీని ప్రత్యేకతేమిటంటే ఇది భావకవిత్వం ముగిసి అభ్యుదయ కవిత్వం మొదలవుతోన్న సంధి దశలో వచ్చింది. ఇందులో మూడు పాటలున్నాయి.

*"వెలిగించరా జ్యోతి వెలిగించరా*
*కటిక చీకటులెల్ల మటుమాయమై తొలగ ॥వెలి॥*
*పగలెల్ల శ్రమజేసి పరుగుపరుగున వచ్చి*
*పూరిండ్లలో జెలగు కారుచీకటి నడుమ*
*జీననాశారిరణ చిహ్నల తడవికొని*
*యేడ్చు తమ్ముని బరువు టెదలోని సొదదీర ॥వెలి॥*

అధికారమనే చీకటి ఆవరించిన కుటిల విశ్వమానవ శాంతి అనే వైభవోపేతమైన సభలలో చినిగిపోయిన పేలికలను ధరించి ఎముకలన్నింట మృత్యువు ఎగసి తాండవమాడుతుంటే కడుపు మంటకు గంజి నీళ్లు కూడా దొరకని ఈ వెర్రి రైతును చూసి విసుక్కునే వారిని చూసి ఒకమారు జ్యోతిని వెలిగించు అని కవి విన్నవించుకుంటాడు. రైతు జీవితంలో వెలుగే లేదు. ఆరుగాలం కష్టపడి పంటతీసినా అధికారులు నిర్ణయించిన ధరకే పంటను అమ్ముకోవాలి. ఇలా లోలోన కుమిలిపోతున్నరైతు సోదరుల బెంగను తీర్చడానికి కవి జ్యోతిని వెలిగించమంటాడు.

*"నీ శక్తి చూపించు కవిలేఖినీ!*
*రక్తి కట్టింపుమో కవి లేఖినీ!!*
*నిఖిలాంధ్ర జగమునకు నీ వెలుగు లుండాలె*
*నీవు నడిచిన బాట పూదోట కావాలె*
*నిశ్చలంబగు కీర్తి నిలిచిపోవాలె ?*
*॥నీ శక్తి॥*
*కష్టజీవుల పాట కర్షకావళి మాట*
*నీ మాటలన్నిటిలో నిండిపోవాలె*
*కఠినంపు గుండెలే కరిగిపోవాలె"*
*॥నీ శక్తి॥*

కవిలేఖిని కర్షకుని వైపు నిలబడాలని ఆకాంక్షిస్తూ రాసిన పాట ఇది. కవి కలం నుండి కష్టజీవుల,కర్షకుల పాటలు జాలువారాలని, ఆ పాటకు ఎంతటి కఠినమైన గుండెలైనా కరిగి పారాలని కోరుకుంటాడు కవి. అంతేకాదు కవి కలం దుండగుల పాలిట దండంగా మారి దు:ఖ జీవుల దు:ఖాన్ని పారద్రోలాలని, మత, వర్గ భేదాలను రూపుమాపాలని కవి ఆకాంక్ష.

ఆణిముత్యాల్లాంటి పాటలెన్నో తెలంగాణ నేల చుట్టూ, తెలంగాణ మనుషుల చుట్టూ, తెలంగాణ పల్లెల చుట్టూ, ప్రకృతి చుట్టూ అల్లుకుని ఉన్నాయి. కాలం కత్తెరలో పడి నశించిపోయినవి పోగా కనీసం మిగిలిన వాటినైనా మనం సేకరించి భద్రపరుచుకోవాలి. పరిశోధకులు వాటి విశిష్టతను భవిష్యత్తు తరాలవారికి విశ్లేషించి చెప్పాలి. అయితే ఇదంత సులభమైన పనికాదు. విశ్వవిద్యాలయాలు కాని, సాహిత్య సంస్థలు కాని ఆ బాధ్యత తీసుకొని చాలా అంకిత భావంతో, బాధ్యతగా చేయాల్సిన పని. నిఘంటు నిర్మాణాల పట్ల, పాటల సేకరణ పట్ల ప్రభుత్వాలకు కూడా ఒక దూరదృష్టి ఉండాలి. దీనికి బృహత్తరమైన దీర్ఘకాలిక ప్రణాళిక కావాలి. ఎంతో ధన వ్యయం కూడా అవసరమే. తరతరాల మానవుని సాంఘిక చరిత్రని నిర్మించాలంటే ప్రజల హృదయాల్లో కొలువై ఉన్న పాటలను ఆశ్రయించక తప్పదు. భాషా మూలాలు, సంగీత మూలాలు, ఎంతో శాస్త్ర విజ్ఞానంతో పాటు ఎన్నో అమూల్యమైన బాణీలను అధ్యయనం చేయాలంటే పాటలే తరగని ముడిసరుకు అనేది మరిచిపోవద్దు.

వ్యాసం

# కంచరవృత్తికారుల భావోద్వేగ బతుకు ప్రయాణం

**మట్టిపొరల్లో దాగిన మనిషి గుండె సప్పుళ్లని ధ్వనిముద్రితం చేసే ఈ 'పరంపర' నవలను వివరించిన డా॥ రఘు వ్యాసం...**



డా॥ ఎస్.రఘు

మట్టిపొరల్లో దాగిన మనిషి గుండె సప్పుల్లని ధ్వనిముద్రితం చేస్తే ఎలావుంటుందో ఈ 'పరంపర' నవలలో వినవచ్చు. కాలంపొడుగూతా కదిలిపోయిన జీవనసౌందర్యాన్ని మరొకసారి కళ్లారా చూడాలంటే ఈ నవలలోకి హృదయం పెట్టి చూడాలి.

గ్రామీణ ప్రజల మానవసంబంధాల్లో వృత్తులు ఎంత గాఢంగా పెనవేసుకుని పోయావనేది తెలుసుకోవాలంటే ఈ నవలలోని తిప్పర్తి గ్రామాన్ని సందర్శించాలి. మనిషికి అవసరమైన, నిత్యావసరమైన లోహపాత్రల నుంచి రసోల్లాసం కలిగించే శిల్పాలవరకు అద్భుత నైపుణ్యంతో కళాత్మకంగా తయారుచేసే కంచరవృత్తికారుల చారిత్రక జీవన గమనాన్ని ఆవిష్కరించిన 'పరంపర'ను చదవడం ఒక సృజనాత్మక అధ్యయన అనుభవం. రచయిత శిరంశెట్టి కాంతారావు కొలిమిలో నిప్పుకణికగా మారి అక్షరాలకు పుటం పెట్టి కంచర వృత్తికారుల ఔన్నత్యాన్ని ఉన్నతంగా చిత్రించారు.

విరాట్ విశ్వకర్మ పంచాననులలో తృతీయులు 'త్వష్ఠ బ్రహ్మవంశీయులు. వీరు కంచరం వృత్తిచేసే కాంస్యకారులు. 'త్వష్ఠ' అంటే రూపంలేనిదానికి రూపాన్ని ఇచ్చేవాడని అర్థం. ప్రాచీన సాహిత్యంలో విశ్వకర్మకు విశిష్టమైన స్థానం ఉంది. దేవతలకు పురోహితుడుగా విశ్వకర్మ ప్రవర్ధిల్లాడంటారు.యజ్ఞయాగాదులలో ఉపయోగించే ప్రత్యేక పాత్రలను తొలిసారిగా రూపకల్పన చేసిన సృజన కారులు కంచర కళాకారులు. అటువంటి ప్రాచీన మూలాలున్న వృత్తికళాకారుల జీవితాలను కేంద్రంగా మల్చుకుని మనకు తెలియని గొప్ప సామాజిక, సాంస్కృతిక గాథలను నవలగా రూపొందించి ఒక కొత్త ప్రపంచంలోకి తీసుకెళతారు శిరంశెట్టివారు.

కాలచక్రం ఒక క్రమపద్ధతిలో ఎలా తిరుగుతుందో, ప్రకృతి ప్రణాళిక ప్రకారం తన పరిణామాలను చూపిస్తుందో రచయిత ఈ నవల ఇతివృత్తాన్ని కూడా అంత వ్యూహాత్మకంగా అల్లుకుని తన వెంట నడిపించుకుంటూ వెళ్ళిపోతాడు. నవల స్వాతంత్ర్యానికి పూర్వం నిజాం రాజ్యపాలనాకాలంనాటి నుంచి ప్రారంభమవుతుంది. ఆనాటి బ్రిటీష్ రెసిడెంట్ కిర్క్ ప్యాట్రిక్, నిజాం సంస్థానపు దివాన్ మనుమరాలు ఖైరున్నిసాబేగంల ప్రేమ ప్రతీకైన రెసిడెంట్ భవన సందర్శనలోంచే నవలకు మూలాంశమైన కంచరవృత్తి వైభవానికి బలమైన బీజం పడుతుంది. రెసిడెంట్ కిర్క్ దంపతులు భవనంలోని కళాత్మకమైన నగిషీలు చెక్కిన ఇత్తడి వస్తువులను చూసి ఆశ్చర్యపడడంతోనే కథంతా తిప్పర్తి గ్రామంలోకి ప్రయాణమవుతుంది. కంచర కళాకారుల అద్భుత నైపుణ్య విశేషాలపై ఆసక్తి ఏర్పడుతుంది.కంచరవృత్తి జనుల మనస్తత్వాలపై దృష్టి ప్రసారితమవుతుంది. ఒక యుగసంధిలో జరిగే పరిణామాలను తెలుసుకోవడానికి భూమిక ఏర్పడుతుంది.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. నిరంకుశ నిజాం ప్రభుత్వం కుప్పగూలి పోయింది. దాంతోపాటు కంచరవృత్తి కూడా కునారిల్లిపోయింది. రాజకీయ మార్పులు ప్రజల జీవితాలను ఎంత తీవ్రంగా ప్రభావితం చేస్తాయనే విషయాన్ని ఈ నవల రేఖామాత్రంగా నైనా బలంగా స్పృశించింది. ఏ వృత్తివారికైనా పది పదిహేనేండ్లకోసారి వచ్చే వృత్తిగత సంక్షోభాల్ని చెప్పకనే చెబుతుంది. ఈ నవల. ఇలాంటి ప్రమాదాలు, సమస్యలను అధిగమిస్తూ కంచరవృత్తి కళాకారులు ఏవిధంగా జీవనపోరాటాన్ని చేశారో సమగ్రంగా చిత్రించింది ఈ రచన. ఒక

శతాబ్దికాలంలో జరిగిన కీలకమైన వృత్తిగత మలుపులను చాలా సహజంగా వివరిస్తాడు రచయిత. ఇందులో ప్రధానపాత్రగా, కుల పెద్దగా 'పైలా విశ్వరూపాచారి' ఆలోచనాపథంలోంచి, ఆచరణాత్మక దృక్పథంతో, ఆదర్శవంతంగా కథ నడుస్తుంది. ఈ నడక కంచరవృత్తికారుల నైపుణ్యపు దారిలోనే నడవడం రచయిత ప్రతిభకు నిదర్శనం.

పరంపర నవలలో విశ్వరూపాచారి విశిష్టవ్యక్తిత్వం మనల్ని ఆకట్టుకుంటుంది. అతడి నేపథ్యం కూడా ప్రత్యేకమైంది. చిన్నవయసులోనే కమ్యూనిస్ట్ పార్టీ లో చేరి సాయుధ పోరాటం చేశాడు. అజ్ఞాత వీరుడుగా రజాకార్లతో, యూనియన్ సైనికులతో పోరాడిన ఉద్యమకారుడు. ప్రగతిశీల భావాలతో ఉద్యమానంతర కాలంలో తమ గ్రామంలోని కంచర కుటుంబీకుల జీవనోపాధికోసం తపించి పోయాడు. అంతేకాదు తను స్వయంగా తయారుచేసిన కళాత్మకమైన వృత్తి పనుల ద్వారా రాష్ట్రానికి, తెలుగు వారికి గ్రామానికి, కంచర వృత్తికారులకు దేశవ్యాప్తంగా పేరుప్రతిష్టలను తీసుకొచ్చాడు. ఈ క్రమంలో విశ్వరూపాచారి ఆలోచనాస్థాయి మేధస్సు, నైపుణ్యం, పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే విధానాలు, ఉత్తేజాన్ని అందిస్తాయి.

కులవృత్తులు దెబ్బతిన్న సంధికాలంలో బతుకుతెరువు ఎట్లానో అర్థంకాని సమయంలో విశ్వరూపాచారి తీసుకున్న నిర్ణయాలు ఈ కథకు పరిమితమైనవికావు. "పని చేసుకునేవాడికి ఎప్పుడూ పని వుంటనే వుంటది. కాకుంటే ఆ పని కాలానికి తగ్గట్టు చేసుకుంటూ పావ్వాల గంతే" అంటూ వృత్తికారుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతాడు విశ్వరూపాచారి. కేవలం మాటలతోనే సరిపుచ్చుకుండా హైదరాబాద్ తీసుకెళ్ళి మిత్రుడు, వ్యాపారి మూల్‌చంద్ శారడా ద్వారా సహాయాన్ని ఇప్పించి బతుకుపై నమ్మకాన్ని కలిగిస్తాడు. కాలానుగుణంగా వ్యాపారాన్ని విస్తృతం చేసుకునే ఆలోచనలు చేస్తాడు. మనం తయారుచేసే వస్తువులను మన దుకాణంలోనే అమ్మడంకాదు, మనమే కొనుగోలు దారుడు దగ్గరకు వెళ్ళాలనే కొత్త ఆలోచనలు, ప్రయత్నాలు సఫలీకృతం కావడం పఠితలకు సైతం ఆనందాన్ని ఇస్తుంది.

జాతరలో దుకాణాలు పెట్టుకోవడం, గ్రామాలకు వెళ్ళి ఉద్దెరకు సామాన్లు అమ్మి, పంటచేతికొచ్చాక తీసుకోవడం, సంతలోను అమ్మకాలు చేయడం, సంచారవాసిగా బేరాలు సాగించడాలు వృత్తికారుల బతుకుపోరును తెలుపు

> **ఒక శతాబ్దికాలంలో జరిగిన కీలకమైన వృత్తిగత మలుపులను చాలా సహజంగావివరిస్తాడు రచయిత. ఇందులో ప్రధానపాత్రగా, కుల పెద్దగా 'పైలా విశ్వరూపాచారి' ఆలోచనాపథంలోంచి, ఆచరణాత్మక దృక్పథంతో, ఆదర్శవంతంగా కథ నడుస్తుంది. ఈ నడక కంచరవృత్తికారుల నైపుణ్యపుదారిలోనే నడవడం రచయిత ప్రతిభకు నిదర్శనం. పరంపర నవలలో విశ్వరూపాచారి విశిష్టవ్యక్తిత్వం మనల్ని ఆకట్టుకుంటుంది. అతడి నేపథ్యంకూడా ప్రత్యేకమైంది.**

తుంది. ఈ వృత్తికారుల పాత్రలన్నీ జీవితంలో మన ఇంటిముందుకు వచ్చిన ఆత్మీయ పాత్రలుగా పలకరిస్తాయి. పాత్రల భావోద్వేగాలు నవలాపరిధిని దాటి పఠితలవిగా పరివర్తన చెందుతాయి.

ఈనవలలో విశ్వరూపాచారి అద్భుత కళానైపుణ్యం, సృజనాత్మక ప్రతిభ, సాధించిన విజయాలు అసామాన్యమైనవి. ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్లో ప్రదర్శించిన శకటానికి ప్రథమ బహుమతి రావడం, జాతీయస్థాయి పోటీల్లో తను తయారుచేసినఇంజన్ లోగో ఎంపిక కావడం, ప్రపంచమహాసభల మెమెంటో రూపకల్పన చేయడం, అంతర్జాతీయ హస్తకళల ప్రదర్శనలో ఉత్తమ కళాకారుడుగా ప్రధానమంత్రితో సత్కరించబడటం, రాష్ట్రపతి, ముఖ్యమంత్రి ప్రశంసలను పొందడం, విదేశీ ఆలయాల్లో దేవతామూర్తుల ఆభరణాలు, ధ్వజస్తంభాలు చేసే అవకాశం రావడం



మొదలైనవన్నీ సహజమైన విజయాలుగా, అర్ధవంతంగా అనిపిస్తాయి. దాంతోపాటు పనిపట్ల అంకితభావం, ఏకాగ్రత, నిరంతరసాధన, అధ్యయనం, పరిశీలనవల్ల ఒక కళాకారుడు ఎంతటి ఉన్నతస్థాయికైనా ఎదగవచ్చనే స్ఫూర్తిని, సందేశాన్ని విశ్వరూపాచారి పాత్ర ఇస్తుంది. ఎంతగా పేరుప్రతిష్టలు వచ్చినా గర్వం తలకెక్కకుండా మునుపటిలా అందరితో కలిసిపోయి మెలగడం అనే సుగుణాలను నేర్పుతుంది. ఈ పాత్ర.మనుషులమధ్య స్నేహం ఎంత నిష్కల్మషంగా, గాఢంగా వుండాలో విశ్వరూపాచారి, మూల్ చంద్ శారదాల స్నేహానుబంధం తెలుపుతుంది. జీవితంలో స్నేహానికున్న విలువ, ప్రయోజనమేమిటో రచయిత నవలలో ఆర్ద్రంగా ఆవిష్కరించారు.

పరంపరలో విశ్వరూపాచారి పాత్ర పలుకార్య నిర్వహణల భారాన్ని మోస్తూ కథాగమనానికి దిశానిర్దేశాన్ని చూపిస్తుంది. ప్రతిసంఘటనలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సంబంధాన్ని కలిగివుంటూ జీవితానికి అవసరమైన విషయాన్ని వ్యక్తీకరిస్తుంది. ఈ నవలలో విశ్వరూపాచారి పాత్ర ద్వారా వ్యక్తపరిచిన అభిప్రాయాలుకూడా విలువైనవి. విశ్వరూపాచారి వృత్తికారుడిగా దేవుళ్ళ నగలను తయారు చేస్తున్నా ,వ్యక్తిగతంగా దేవుళ్ళను, గుళ్లను, పూజలను నమ్మనివాడు.మనిషి శ్రమకు, ఆలోచనకు మాత్రమే ప్రాధాన్యమిచ్చే వ్యక్తిత్వంతో కొత్త చూపును ఆవిష్కరిస్తాడు. గ్రామంలో తమకులం యువకులు ఎన్నికల్లో నిలబడతాం అన్నప్పుడు ఒప్పుకోవడం, వారిని ప్రోత్సహించడం మారుతున్న తరాల దృక్పథంగా గుర్తించవచ్చు. దాంతో పాటు పూర్వ ఉద్యమ చైతన్యంతో బతుకులో రాజకీయాల ప్రభావాన్ని, వాటి అనివార్యతను అర్ధంచేసుకున్న పరిణామవాదిగాను చూడవచ్చు.

ఈ నవల గ్రామరాజకీయాలను కూడా ఒకింత తీవ్రతతోనే చర్చించింది. విశ్వరూపాచారికి జాతీయస్థాయిలో పేరు ప్రతిష్టలు రావడం, ఊళ్ళో పరపతి పెరిగిపోవడం, కంచరకులస్తుడు సర్పంచ్‌గా ఎన్నిక కావడం, కంచరకుల ఆధ్వర్యంలో మొట్టమొదటి సహకార పరపతి సంఘం ఏర్పడడం గ్రామంలోని అగ్రవర్ణాలవారికి మింగుడు పడడం లేదు. తమ దొరతనం, ఆధిపత్యం, రాజకీయ అధికారం కోల్పోవడం భూస్వామి రంగారెడ్డి, కరణం రాఘవరావు పంతులు అవమానంగా భావించారు. కంచరకులం వాళ్ళకు, కంచరపనులుచేస్తున్న ఇతర కులాల మధ్య నున్న అవగాహనను, ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నంచేసి సఫలీకృతులయ్యారు. గ్రామంలో విభిన్న బలహీన, బడుగువర్గాల వారు పరస్పర సహకారంతో అన్యోన్యంగా మెలగడం ఆధిపత్యవర్ణాలవారు సహించలేరనడానికి ఈ నవలలో రచయిత చిత్రించిన సంఘటనలు స్వాభావికంగా ఉన్నాయి. దొరల కుట్రలు, ఎత్తుగడలు, మాటలను శక్తివంతంగా చూపుతాడు నవలాకర్త. “కూసం విడిచిన పాము బుస కొడుతున్నట్టుగా శ్వాసతీసుకుంటూ” కరణం రాఘవరావుపంతులు మాట్లాడుతున్నాడని గ్రామరాజకీయాల్లోని విషపూరిత మనస్తత్వాలను వర్ణిస్తాడు. ఇట్లాంటి సందర్భాలను ఊహించే విశ్వరూపాచారి ఒక సందర్భంలో

**బడుగు బలహీనవర్గాల ప్రజలు తమ ఉపాధికోసం ఏపనైనా అలవోకగా నేర్చుకుంటారన డానికి ఈ నవలలో అనేక ఉదాహరణలు న్నాయి. ‘బంటోల్ల ఉప్పన్న రెండు మూడు రోజులు చూడగానే సుత్తిపట్టుకుని బిందెల తయారీలో చక్కగా పనిచేయడం కంచరకులస్తులే ఆశ్చర్యపోతారు. మరోవైపు ఒకవృత్తికి అనుబంధంగా మరికొన్ని రకాల పనులు చేసుకునే ఇతరకులాలవారు ఉండడం విశేషం.**

రాజకీయాలు తమ కులవృత్తికి ఆటంకం అవుతాయన్న భయంతో రాజకీయ విషయంలో వెనకడుగు వేస్తాడు. రాజకీయాలకు దూరంగా ఉండాలనే అసంబద్ధ నిర్ణయం తీసుకుంటాడు. బడుగు బలహీన వర్గాలవాళ్ళు రాజకీయంగా ఎందుకు ఎదగలేక పోతున్నారో ఓటరుగానే ఎందుకు ఉండి పోతున్నారనడానికి ఈ సన్నివేశం సమాధానమిస్తుంది. విశ్వరూపాచారి ఆలోచనా విధానాన్ని, ఇప్పటికీ ఈతరం వారు అనుసరిస్తున్నారని చెప్పకనే చెపుతాడు రచయిత.

ఒకరి కులవృత్తిలోకి మరొక కులానికి చెందినవారు ఏవిధంగా ప్రవేశించవలసిన పరిస్థితులు ఉత్పన్నమవుతాయో ఈ నవల స్పష్టంగా తెలుపుతుంది. చేతినిండా పనివుండి, చేతికింద పనిముట్లు అందించే పనివాళ్ళులేని స్థితిలో ఇతర వృత్తులవారిని

పనిలోకి తీసుకురావడమనే సహజమైన చారిత్రక పరిణామాన్ని శక్తివంతంగా చిత్రీకరించారు శిరంశెట్టి కాంతారావు. బడుగు బలహీనవర్గాల ప్రజలు తమ ఉపాధికోసం ఏపనైనా అలవోకగా నేర్చుకుంటారనడానికి ఈ నవలలో అనేక ఉదాహరణలున్నాయి. ‘బంటోల్ల ఉప్పన్న రెండు మూడు రోజులు చూడగానే సుత్తిపట్టుకుని బిందెల తయారీలో చక్కగా పనిచేయడం కంచరకులస్తులే ఆశ్చర్యపోతారు. మరోవైపు ఒకవృత్తికి అనుబంధంగా మరికొన్ని రకాల పనులు చేసుకునే ఇతరకులాలవారు ఉండడం విశేషం. నవలలోని తిప్పర్తి గ్రామంలో కూడా కంచరోళ్ల చేతుల్లో తయారైన ఇత్తడి పాత్రలకు కళాయిపోస్తూ జీవించే నిరుపేద ముస్లిం కుటుంబాలు ఉంటాయి. కాలక్రమేణా ఇతర కులాలవారే అసలు వృత్తికులాల వారికి వ్యాపారపోటీ నివ్వడం మరో ఊహించని పరిణామం. ఈ విషయాన్నే కంచర పుల్లాచారి ఆవేదన చెందుతూ ఆత్మవిమర్శకు గురిచేస్తాడు. చివరకు ఎదురెదురుగా, పక్కపక్కనే ఇత్తడి

దుకాణాలు పెట్టుకుని శత్రువులుగా మారిపోయిన స్థితిని రచయిత చర్చిస్తాడు. కాలం తీసుకువచ్చే అనివార్యపరిణామాల ఫలితాలను వాస్తవికంగా కళ్ళముందు దృశ్యీకరిస్తాడు.

గ్రామాల్లోని ఆత్మీయ మానవ సంబంధాలు, మానవీయ విలువలను సహజమైన సన్నివేశాలతో సంభాషణలతో హృదయాన్ని సుతిమెత్తగా కదిలిస్తాడు. జాతరలో సామాన్లు అమ్ముకుని తొందరగా వెళ్లిపోతున్న ఆనందాచారి, ముత్తయా చారీలకు వీడ్కోలు చెబుతూ ఇతర దుకాణదారులు ఆప్యాయంగా మాట్లాడుతారు. తమ దుకాణాల్లోని బొమ్మలను ఇంట్లో వాళ్ళకి బహుమతిగా ఇస్తారు. దారిలో ఆకలేస్తే తినడానికి పకోడిపొట్లం ఇస్తారొకరు. ఆ సందర్భంగా "నిండా నాలుగు రోజులుగూడాలేని తమపరిచయానికి గుర్తుగా వాళ్ళు చూపిస్తున్న ప్రేమాప్యాయతలకు, చారీలిద్దరూ నిలువునా కదిలిపోయారు. వాళ్ళ ప్రమేయం లేకుండానే గుండెల్లో నుండి పుట్టుకొచ్చిన సంతోషపు దు:ఖం ఊటలు ఊటలుగా కనుకొలుకులగుండా వెలుపలికి దూసుకొచ్చి ఎదలను తడుపుతుంటే ఒక్కొక్కరిని గుచ్చి గుచ్చి కౌగిలించుకుంటూ అప్పటివరకూ తమ జీవితాల్లో ఎరుగని నిజమైన మానవతా స్పర్శను, వాసనను, మనసు తనువుల నిండుగా అనుభవించారు" అని రచయిత వాళ్ల స్పందనను వర్ణిస్తాడు. పఠితలు సైతం ఆ ఇద్దరు చారీలుగా మారి తాదాత్మ్యతను అనుభవిస్తారు. ఆ దారిలోనే రైతు దంపతుల ఆదరణకు ముద్దుగ్గైన ముత్తయాచారి ఒక గుండుచెంబును రైతమ్మకు ఇస్తూ "ఇగో చెల్లే నీ పెద్దబిడ్డకు మేనమామలెక్క ఇస్తున్న. దాసిపెట్టి దానిపెళ్ళినాటికియ్యి" అంటాడు. ఆప్యాయతతో ఊహించని కానుక నివ్వడంలో అవతలివారు పొందే ఆనందాన్ని తెలుసుకున్నవారు కాబట్టే ముత్తయాచారి ఆవిధంగా స్పందించాడు. "మనుషుల మధ్య బంధాలు అనుబంధాలు ఎప్పుడు? ఎందుకు? ఏవిధంగా? కలుస్తుంటయో, విడిపోతుంటాయో కాలం తప్ప అన్యులెవ్వరూ ఎరుగరన్న నిజాన్ని" రచయిత తాత్వికంగా స్పందిస్తాడు. ఈ నవలనిండా ఆయా సందర్భాలకను గుణంగా శిరంశెట్టి కాంతారావు చేసే వ్యాఖ్యానాలు వారి అనుభవసారాన్ని వ్యక్తపరుస్తూ ఉద్వేగానికి గురిచేస్తాయి. చెరువుకట్టమీద టెంపో హారన్ చప్పుడుకు ఎడ్లు బెదిరిపోయి చెరువులోకి బండిని లాక్కెళ్ళడంతో ఎడ్లబండి వీరన్న, కంచర ఆనందాచారి చనిపోతారు. కేస్ పోలీస్ స్టేషన్ కి చేరుతుంది. టెంపో డ్రైవర్ పేదవాడు. ఏ విధమైన నష్టపరిహారం ఇవ్వలేని నిస్సహాయుడు. ఆనందాచారి కుటుంబసభ్యులు ధర్మబుద్ధితో డ్రైవర్ నర్సిమ్మపై కేస్ వెనక్కి తీసుకుంటారు. ఇక ఎడ్లబండి వీరన్న కుటుంబానిది మరీ దయనీయమైన పరిస్థితి. సంపాదించే వీరన్న చనిపోయాడు. తన ముగ్గురు ఆడపిల్లలను చూస్తూ వీరన్న భార్య రోదిస్తుంది. ఈ సందర్భంలోనూ గ్రామప్రజల మానవీయ స్పందన ఎంత ఉదాత్తంగా ఉంటుందో తెలుపుతాడు రచయిత. 'చనిపోయిన వీరన్న కుటుంబానికి ఒక ఎద్దును, కోడెదూడను కొనిస్తాను, వ్యవసాయం చేసుకోమని' డ్రైవర్ నర్సిమ్మ తనవంతు సహాయాన్ని ప్రకటిస్తాడు. ఇక నర్సిమ్మ భార్య గంగమ్మయితే "వీరన్న ముగ్గురు బిడ్డల్లో ఒక బిడ్డను పైసా కట్నం తీస్కోకుంట పెండ్లి ఖర్చులు పెట్టుకొని పిల్లని మాకొడుక్కు జేస్కుంటం" అని తన మనసులోని ఆలోచనను తెలుపుతుంది. గంగమ్మమాటలతో పోలీస్ స్టేషన్లోని ఎస్సై, విశ్వరూపాచారితోపాటు మిగతా అందరూ నిశ్చేష్టులవుతారు. "గంగవ్వ మాటలు ఆ పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుద్ధం చెయ్యసాగాయి" అన్న రచయిత వ్యంగ్య వ్యాఖ్య విస్తృతార్థాన్నిస్తుంది. ఆమాటలు స్వార్థపూరిత సమాజాన్నిగూడా పరిశుభ్రం చేస్తాయి.రచయిత చిన్న చిన్న మాటలతోనే మనల్ని ఇలా అనేకసార్లు కుదిపేస్తాడు. మానవ జీవితంలోని సున్నితమైన విషయాలలోని తీవ్రతను పట్టుకుని పాఠకుల నైతికతకు కొత్త అనుభవాన్ని పొదుగుతాడు.

'పరంపర' లాంటి వృత్తికులాల నేపథ్యంలో నవల రాస్తున్నప్పుడు రచయిత తాత్కాలికంగానైనా ఆ కులవృత్తికారుడిగా మారిపోవాల్సిందే. ఆయా కులాలకు సంబంధించిన పనిముట్లు, వాటి వినియోగం తీరుతెన్నులు, వారి సాంస్కృతిక విశేషాలు, వారి వృత్తిరహస్యాలను తెలుసుకోవడం తప్పనిసరి. శిరంశెట్టి కాంతారావు ఈ విషయంలో చాలా లోతుగానే అధ్యయనం, పరిశోధన చేసినట్లుగా అర్థమవుతుంది. నవల ప్రారంభంనుంచే కంచరవృత్తికారుల వాతావరణ చిత్రణతోపాటు, ఆయాకాలాలనాటి పరిసరాల వర్ణనలో వాస్తవికత ఉట్టిపడేటట్లుగా రచించారు. తిప్పర్తి గ్రామంలోని కంఠయాచారి ఛత్రశాల భవంతిని కళ్ళముందుకట్టి చూపిస్తాడు. ఆ కాలంనాటి కంఠయాచారి దంపతుల ఆహార్యాన్ని వర్ణిస్తూ ఫొటోతీసినట్లుగా చూపుతాడు. పొద్దున్నే లేచిన ఆడవాళ్ళు ఇంటిముందు ఊడ్చి వాకిలిని ఏవిధంగా ఎర్రమట్టితో అలికి అలంకరణలు చేస్తారో వివరంగా తెలుపుతారు. కంచరకారులు రెండేండ్ల నుండి మూలకుపడేసిన పనిముట్లను బయటకు తీసి తూడుస్తున్నప్పుడు వాటి పేర్లన్నిటినీ ప్రస్తావిస్తాడు. ఈ తరంవారు వినని కొత్తగా చిత్రమైన పేర్లు ఆ సామాన్లకు ఉన్నాయనేది తెలుస్తుంది. విశ్వబ్రాహ్మణులంతా ప్రతిఏటా మాఘమాసంలో విశ్వకర్మ జయంతి ఉత్సవాన్ని జరుపుతుంటారు. ఆ సమయంలో వీరి ఆశ్రితకులమైన రుంజోల్లు గ్రామంలోకి వస్తారు. ఊర్లోని సబ్బండవర్ణాలవారు కంచరోల్ల పండుగ గురించి మాట్లాడు కోవడాలు, రైతులు సైతం ఈ పండుగకు చందాలు ఇవ్వడం, విశ్వకర్మపూజా విధానాలు, రుంజకారుల ప్రదర్శనలు మొదలైనవన్నీ శ్రద్ధగా ఈ నవల వివరిస్తుంది.

వ్యాసం

# గూడూరి సీతారాం కథలు - ఒక పరిశీలన

గూడూరి సీతారాం గారికి తెలంగాణ తొలితరం కథకుల్లో ప్రత్యేక స్థానం ఉంది. ఆయన గురించి నిజాం వెంకటేశం పరిశీలన...



నిజాం వెంకటేశం

18 జూలై 1936వ సంవత్సరంలో కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్లా తాలుకాలోని హనుమాజీపేట గ్రామంలో జన్మించిన గూడూరి సీతారాం గారికి తెలంగాణ తొలితరం కథకుల్లో ప్రత్యేక స్థానం ఉంది. సి. నారాయణ రెడ్డి గారు పుట్టిన హనుమాజీపేటలోనే వారి పక్క ఇంటిలోనే పుట్టారు సీతారాం. సెలవులు వచ్చినాయంటే, వూరి పక్కనుండి పారే మూలవాగు ఇసుకలో కూర్చొని సీతారాం, కనపర్తి లక్ష్మీ నర్సయ్య, ఆది రెడ్డి లాంటి 10 మంది సాహిత్యాభిమానులు కలిసి, నారాయణ రెడ్డితో సాహితీ కాలక్షేపం చేసేవారు. కనపర్తి కవిగా మారితే నారాయణరెడ్డి గారి సలహాపై సీతారాం కథకుడిగా మారారు. వేంకట లక్ష్మీ, లక్ష్మయ్య ఈయన తల్లిదండ్రులు. కచ్చురాలపై సిరిసిల్లకు వచ్చిన సీతారాం కుటుంబం, చేనేత కేంద్రమైన సిరిసిల్లలోనే స్థిరపడింది. హైస్కూల్ సిరిసిల్లలోను, కాలేజీ చదువు నిజాం కాలేజీలోనూ పూర్తి చేశాడు సీతారాం. హైస్కూల్ మేగజైన్ "తరంగిణి"కి, నిజాం కాలేజీ మేగజైన్ "విద్యార్థి"కి , రెడ్డి హాస్టల్ మేగజైన్ "ఉష" కుతాను చదివేటప్పుడు సంపాదకుడిగా వ్యవహరించాడు సీతారాం. 1952 లో స్థాపించబడ్డ "తెలంగాణ రచయితల సంఘం" సిరిసిల్ల శాఖకు స్థాపకుడు. ఈ శాఖ ద్వారా వెలువరించిన "వివాదం" అనే పత్రికలో "స్త్రీ స్వాతంత్ర్యం" అనే సీతారాం కథ అచ్చయింది. 1953లో కథా రచయితగా సీతారాం ప్రవేశం అలా జరిగింది.

మానేరు రచయితల సంఘం, ముఖ్యంగా పత్తిపాక మోహన్ పూనుకొని, ప్రయత్నించి, 14 కథలు లభించగానే, "గూడూరి సీతారాం కథలు" పేరుతో అచ్చు వేయగా మనం సీతారాం కథలు మళ్ళీ చూడగల్గుతున్నాం. మరో రెండు, మూడు కథలు తరువాత లభించాయి.

2005 లో సీతారాం జీవిత విశేషాలను, సాహిత్య కృషిని వివరిస్తూ, మంచి ఆలోచనాత్మక వ్యాసాలతో "కానుగు చెట్టు" పేరుతో 2005లో వ్యాసాల సంకలనం వచ్చింది. సీతారాం గురించి ఈ తరం రచయితలు తెలుసుకోవడం, కలుసుకోవడం, సాహిత్య చర్చలు మొదలైయ్యాయి. 1997 నుండి 2011 దాకా, హైదరాబాద్ లో కొడుకు వద్ద ఉంటున్న సీతారాం గారు, బీఎస్ రాములుతోనూ, నాతోనూ సాయంత్రం పూట సాహిత్య సమావేశాలలో సినారెను కలుసుకోవడానికి, సారస్వత పరిషత్తుకు పోవడమూ సర్వసాధారణమై పోయింది. మిగతా సమయంలో తెలుగు సాహిత్య అకాడెమీలో కొత్త పుస్తకాలతో, కొత్త రచయితలతో గడపడం అలవాటై పోయింది.

ఇప్పుడు అచ్చులో లభిస్తున్న సీతారాం 16 కథల్లో "మారాజు", "రంగడు", "రాజమ్మ రాజరికం", "నారిగాని బతుకు", "పిచ్చోడు", "లచ్చి కథలు" తెలంగాణ మాండలికంలో రాసినవి.మిగతా కథలు ప్రామాణిక భాషలో ఉన్నాయి. పల్లెటూరులో పుట్టి పెరిగిన సీతారాం 1950, 60లలో పల్లెల్లో మెల్ల మెల్లగా వస్తున్న మార్పుల్ని, పట్టణ నాగరికత పల్లెల్లో ప్రవేశించడాన్ని, పల్లె జనం పట్టణాల్లోని సినిమాలను, రంగుల జీవితానికి ఆకర్షితులవడం గమనించాడు. జీవితంలో వస్తున్న మార్పుల్ని తన కథల్లో చిత్రించాడు. ఈయన కథల్లో నాటకీయత కంటే సూటిగా చెప్పె కథనమే ఎక్కువ. ఈయన మన పక్కన కూర్చుండి చెప్తున్నట్టుగా కథ, కథనం నడుస్తుంది. వాస్తవిక జీవిత చిత్రణ ఉంటుంది. నిరాడంబరంగా, నిసర్గ సరళంగా ఉంటాయి కథలు. తెలంగాణలో అప్పటికీ మధ్య తరగతి ఆవిర్భవించనందున, ఆయన కథల్లో పల్లె పడుచులు, సామాన్యులే ఎక్కువ.

"మారాజు" బొంబాయి వలసలకు సంబంధించిన కథ. కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల నుంచి అప్పుడు బొంబాయికి బతుకు దెరువు కోసమై వలసలు సాగేవి. "మారాజు" కథలో రంగడు, బొంబాయి పోయి, భాష తెలియక, దిక్కు తోచక, అక్కడ ఇమడలేక మళ్ళీ పల్లెకు తిరిగి వస్తాడు.

"పిచ్చోడు" కథలో రంగడు

వ్యాసం

**అపుడు రంగన్ని దొరసాని చూచి, ఇడిపిచ్చి, అన్నం పెట్టి, పాలేరుతో రంగన్ని ఇంట్ల విడిచిపెట్టి రమ్మని పంపుతది. అట్ల రంగన్ని పాలేరు దౌష్ట్యం నుంచి కాపాడుతది దొరసాని. దొరసానిని ఎట్లన్న కలువాలని, చిన్నాయన కొడుకుని తీసుకుని బయలుదేరుతడు రంగడు. కానీ దొరసాని చచ్చిపోయి ఎన్నో యేండ్లు అయిందని తెలిసి, దొరసాని కుటుంబం ఆర్థికంగా చితికిపోయిందని తెలిసి, బాధతో తిరిగి ప్రయాణమవుతడు రంగడు**

బొంబాయి వెళ్ళాలని మూడు సార్లు ప్రయత్నిస్తాడు. ఒకసారి పోలీసుల భయంతో, మరోసారి రైలుకు భయపడి ప్రయాణం మానుకుంటాడు. ఎలాగైనా బొంబాయికి వెళ్ళి, డబ్బు సంపాదించాలని, ధృడ నిశ్చయంతో మూడోసారి టికెట్టు కొని కూడా, రైలు ఎక్కలేక చతికిలపడతాడు. పల్లెటూరి జనం అమాయకత్వాన్ని, పేదరికాన్ని, సంపాదన కోసం వాళ్ళు బొంబాయికి వెళ్లే ప్రయత్నాన్ని సీతారాంగారు చాలా బాగా చిత్రించారు ఈ కథలో.

కానీ "మారాజు" కథలో రంగడు పేదరికాన్ని తట్టుకోలేక, ఎలాగైనా బొంబాయి వెళ్ళి, అక్కడ పనిచేసి డబ్బు సంపాదించాలనే ఆలోచనతో ఇంట్లో వాళ్లకు తెలియకుండా డబ్బులు తీసుకుని, భార్యకు, తల్లికి చెప్పకుండా బొంబాయి వెళతాడు. మొదటిసారిగా రైలు ప్రయాణంలో ఇబ్బందులు ఎదుర్కొంటాడు. బొంబాయికి చేరాక, అక్కడి భాష తెలియక ఇబ్బందులు పడతాడు. దొంగలు ఇతడ్ని మోసం చేసి డబ్బు లాక్కుంటారు. చిన్నాయన కొడుకు కనిపించి, పోలీసుల సహాయం అంది, రంగడు తేరుకుంటాడు. కానీ, ఏ ఆధారం లేనందున, విధి లేక ఊరికి తిరిగి వస్తాడు.

"రంగడు"కథలో బతుకు దెరువు కోసం బిలాయి వెళ్లిన రంగడు అనే పశు వుల కాపరి, ఏండ్ల తరువాత గ్రామాన్ని చూడటానికి వస్తాడు. ఊర్లో ఎవ్వరూ అతడిని గుర్తుపట్టరు. ఆఖరకు, చిన్నాయన ఇంట్లో కూడా, 20 ఏండ్ల కథ చెప్పినంక గుర్తు పడుతరు. రంగనికి ఆరేండ్ల వయసు ఉన్నప్పుడు, కాస్తున్న బర్లు దొరగాని చేన్ల పడ్డాయని, దొరగాని పాలేరు రంగన్ని గుంజకు కట్టి, రక్తం వచ్చేటట్లు కొడతాడు. అపుడు రంగన్ని దొరసాని చూచి, ఇడిపిచ్చి, అన్నం పెట్టి, పాలేరుతో రంగన్ని ఇంట్ల విడిచిపెట్టి రమ్మని పంపుతది. అట్ల రంగన్ని పాలేరు దౌష్ట్యం నుంచి కాపాడుతది దొరసాని. దొరసానిని ఎట్లన్న కలువాలని, చిన్నాయన కొడుకుని తీసుకుని బయలుదేరుతడు రంగడు. కానీ దొరసాని చచ్చిపోయి ఎన్నో యేండ్లు అయిందని తెలిసి, దొరసాని కుటుంబం ఆర్థికంగా చితికిపోయిందని తెలిసి, బాధతో తిరిగి ప్రయాణమవుతడు రంగడు భిలాయికి.



అప్పటి వలసలు ఇప్పుడు బొంబయి, బొగ్గు బాయి, దుబాయికి వలసలుగా మారి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల నుండే లక్షల మంది గల్ఫ్ దేశాలకు వలస వెళ్లడం నేటి విషాదం. షోలాపూర్, సూరత్ లకు వెళ్లి అక్కడే స్థిరపడ్డ వారి సంఖ్య కూడా తక్కువేమీ కాదు.

"లచ్చి" కథలో పిచ్చుకుంట్ల అనే బిచ్చగాండ్ల ఊరిలో పరిస్థితులు తట్టుకోలేక, పట్టణానికి పోయి బతుకుదామని లచ్చి... దాని భర్త రంగడు అక్కడ రంగడు దుర్వ్యసనాలకు అలవాటు పడి భార్యను రోజూ తాగి వచ్చి కొట్టడం చేస్తాడు. ఆక్సిడెంటులో దెబ్బలు తిని చావు తప్పి పాత జీవితానికి మరలడం కథా వస్తువు.

ఈ నాలుగు కథల్లో కథా నాయకుని

**సీతారాం కథల్లో తెలంగాణ భాష....**

1. సీతారాం తన కథల్లో ధ్వని ప్రధానమైన పదాలు, చక్కని పదబంధాలు వాడుతాడు. ఉదాహరణకు తినబోయిండు, తేకపోయిండు, తీసుకురాకపోయిండు.
2. గజ్జ గజ్జ, బుగులు బుగులు, దబదబ, గప్పు గప్పు, జెప్ప జెప్ప
3. నాలుగుతికిండు, కుదువబెట్టిండు, బుదురకిచ్చిండు, సంపాయించిండు, రానిస్తుండు, పటాయించిండు
4. పెయ్యి, నెత్తి, బువ్వ, దీపంత, సమరు, కొట్టము, పోరి, సోపతి, పైసలు లాంటివి.

**నుడికారపు సొంపులు...**

1. ఆకాశానికి, భూమికి ఉన్నంత ఎడం కనబడ్డది
2. గట్టు మీదేసిన సామానే కొట్టుకున్నడు
3. రాచ్చసంటోళ్లు నిండా నూరెళ్లు బతుకుతరు. గోవసోంటోళ్లు మాయిల్లనే జత్తరు
4. దినాలు ఎడ్ల కచ్చరం గిరలోలె తిరుగుతున్నయ్
5. కండ్లకెళ్లి ఊటూరినట్టు నీళ్లు కారినయ్
6. మంచోళ్ళకే సావు జెప్పనత్తది
7. పొద్దంతనేమో అప్పులోల్ల బాధ. రాత్రంతనేమో మొగనితో బాధ
8. తోటంత మొఖం మోటంత అయింది
9. నూతిలో పడ్డోని మీద నూరు రాళ్లన్నట్లు
10. కచ్చురం మంచిగ పోయినట్లే పోయి పోయి బొందల పడేదాక తెలువది

పేరు రంగడు అని పెట్టడం పల్లె మనుషులు అందరూ అమాయకులే అని సీతారాం చెప్పడంగా భావించవచ్చు.

"రాజమ్మ రాజసం" కథలో రాజమ్మ పల్లెటూరు యువతి. కొత్తగా వస్తున్న అలంకార వస్తువుల మోజులో, వ్యామోహంలో రైతుగా ఉన్న భర్తపై వైముఖ్యంతో పట్టణ సంస్కృతికి అలవాటు పడి, సేరుదారు కొడుకు ఇచ్చే స్నో, పౌడర్ లకు ఆశపడి అతనితో వివాహేతర సంబంధం పెట్టుకుంటుంది. ఊరి వారు అసహ్యించుకుంటారు. భర్త ఇంకొకరిని పెళ్లి చేసుకుంటాడు. రాజమ్మ కొన్ని రోజులు ఊరి నుండి మాయమై మళ్ళీ ఊరు చేరుతుంది.

తెలంగాణ పల్లెలకు, పాకుతున్న సినిమా ప్రభావం అలంకరణ వస్తువుల ప్రభావం, ఆశల్లో చిక్కుకున్న స్త్రీ పతనం ఈ కథల్లో వివరిస్తాడు రచయిత. రాజమ్మ మీద సానుభూతితో, జాలితో కథ ముగుస్తుంది.

"నారిగాని బతుకు" కథలో గీత కార్మికుని జీవితంలోని సాధక బాధకాలు, చిత్రితమయ్యాయి. గ్రామీణ వృత్తి కులాలు దిగజారిపోవడం,కుల వృత్తిలో నిలదొక్కుకోవడానికి పడే పాట్లు చిత్రితమయ్యాయి. ఈ వృత్తిలో స్త్రీ కల్లు అమ్మడం, భర్తకు చేదోడు వాదోడుగా ఉండటం కనిపిస్తుంది.

మొదటి భార్య లసుము భర్తకు వృత్తిలో సహకరిస్తూ, చేదోడు వాదోడుగా వుంటుంది. రెండో భార్య ఎల్లి నారిగాన్ని మోసం చేసి వెళ్లిపోతుంది. ఒక వృత్తి ధర్మంగా కల్లు వంచుతున్న మూడో భార్యను కల్లు తాగుతున్న వ్యక్తి కొంగు పట్టి గుంజగా, నారిగాడు వాణ్ని కొట్టి, భార్యను కల్లు పోయవద్దంటాడు.

కానీ చివరికి తన వయస్సు మీద పడి, కొడుకుకు వృత్తి అప్పచెప్పినాక, కోడలు అలాగే కల్లు వంచడం చూసి బాధపడు

**హో**యిగా కొనసాగుతున్న ఆయన జీవితంలో క్యాన్సర్ ప్రవేశించి, అకస్మాత్తుగా ఆయనను 25-09-2011 రోజు ఆయనను మన నుండి వేరు చేసింది.

**గూడూరి సీతారాం కథన రీతులు...**

1. ప్రథమ పురుష కథనం
   లచ్చి, మారాజు, పిచ్చోడు, అంబోతు, అమ్మాయి, అందని ఆకాశం, దెబ్బ తిన్న అహంభావం, మేడిపండు, ఏకాంతం.
2. ఉత్తమ పురుషలో రాసిన కథలు
   ఎవని పువ్వు
3. ఫ్లాష్ బ్యాక్ లో రాసిన కథలు
   నారిగాని బతుకు, రాజమ్మ రాజరికం, రంగడు

తాడు. పల్లె జీవనం, వృత్తిలపై మంచిగా చిత్రించిన కథ నారిగాని బతుకు.

పాత్రోచిత సంభాషణలు, వర్ణనలు, ఎత్తుగడ, ముగింపుల విషయంలో సీతారాం చాలా శ్రద్ధ తీసుకున్నాడు. గూడూరి సీతారాం 1965 అనంతరం ఉద్యోగంలోకి ప్రవేశించాక కథా రచన పూర్తిగా వదులుకున్నాడు. ఉద్యోగం కూడా కొంతకాలం చేసి రాజకీయం రంగంలోకి వెళ్లాడు. దానిని వదిలి పెట్టి వ్యాపార రంగంలోకి వెళ్లాడు.

1997 నుండి అన్ని వ్యవహారాలు బందు పెట్టి హైదరాబాద్ లోని బర్కత్ పురలో పెద్ద కొడుకు కుటుంబంతో ఉన్నాడు.

1999 నుండి 25-09-2011 వరకు విశాల సాహిత్య సదస్సు వేదికగా సీతారాం గారు సాహిత్య కార్యక్రమాల్లో మునిగి తేలారు. యువ రచయితలతో చర్చలు, కొత్త రచయితలను ప్రోత్సహించడం, పాతకాలపు సాహిత్య విషయాలను అడిగి తెలుసుకుంటున్న ఔత్సాహిక రచయితలతో చర్చలు జరపడం, పుస్తకాలు సంపాదకత్వ బాధ్యతలు ఎత్తుకోవడం అప్పుడప్పుడూ సినారెను సారస్వత పరిషత్తు కార్యాలయంలో కలవడం, రచయితలతో సమావేశ మవడమనేవే వ్యాపకాలు. సాయంకాలాల్లో రవీంద్ర భారతి, సిటీ సెంట్రల్ లైబ్రరీ, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, త్యాగరాయ గాన సభ ఎక్కడో ఒక చోట సాహిత్య కార్యక్రమాలకు బీఎస్ రాములు గారితో వెళ్లడం ఆయనకు అలవాటయింది.

ఇలా హాయిగా కొనసాగుతున్న ఆయన జీవితంలో క్యాన్సర్ ప్రవేశించి, అకస్మాత్తుగా ఆయనను 25-09-2011 రోజు మన నుండి వేరు చేసింది. మరణం తప్పించలేనిది. ఆయన మరణంలో ఏర్పడ్డ చీకటిలో, స్పష్టతతో ఆయన రాసిన కథలు, కథా సాహిత్యానికి ఒక మూల మలుపుగా, ముందు మార్గం చూపూ ఒక దివిటిగా ధైర్యం చెప్పే ఒక్క వెన్నుతట్టడంగా మనల్ని ముందుకు నడిపిస్తూనే ఉంటాయి.

# సీత కోపము

(భాస్కర రామాయణం - హుళక్కి భాస్కరుడు)



భాస్కరరామాయణ కవులు నలుగురు. వారిలో హుళక్కి భాస్కరుని పేరుతోనే భాస్కరరామాయణం అనే పేరువచ్చింది. క్రీ.శ. 13వ శతాబ్దం. ప్రతాపరుద్రుని ఆస్థానంలో ఉన్న హుళక్కి భాస్కరుడు తన కుమారుడు మల్లికార్జునుడు, శిష్యుడు కుమారరుద్రదేవుడు, మిత్రుడు అయ్యలార్యుడు అనువారితో రామాయణం పూర్తిచేశారు. భాస్కరుడు సాహిణిమారనకు అంకితం చేశాడు. ప్రేమ కవి. పాత్రపోషణ, రసపోషణల నిర్వహణలో భాస్కరుడు సిద్ధహస్తుడు.

రావణాసురుడు అశోకవనంలో సీతను ఆశించి మాట్లాడినపుడు సీత రావణుని తిరస్కరించిన సందర్భంలోని పద్యాలు.

కం. జనకుని తనయను దశరథ
జనపతి కోడల, నరేంద్రుండగు రా
ముని భార్య నన్ను, గనిసెద
నను చిత్తము విడువు, నీకనర్థంబగుటన్

ఉ. కందినయన్యకాంతయెడ కామము దక్కుము, నన్ను జేరరా
దందని ప్రమానిపండులకు నల్లులు సాతురె, నీదుకోర్కి, నీ
సుందరులందు దీర్చికొను చొప్పును బోక ఖలుండ పాపముం
బొందెడు త్రోవ బోయి తుద బోదు మదంబటి కాలు ప్రాలికిన్

ఉ. నాపతి డాగురించి కుహనాగతి నన్నిట దెచ్చి, బంటవై
పాపములేలయాడెదు, నృపాలుడు సన్నిధి నున్న నా నమ
చ్చాపవిముక్త శాతశరజాలములన్ నిను నీకులంబు ను
ద్దీపిత శక్తితో దలలు ట్రెంపక జంపక పోవనిచ్చునే

కం. సిరిజూపి నన్ను లోబడ
మరిపెదనని చూచెదేల? మనుజేశుని పై
దిరమగు నామది వాయదు
తరణింబాయని తదంచిత ప్రభ భంగిన్

శా. ప్రాణంబుల్ వలతేని రామునకు నేర్పారంగ నన్నిచ్చి, స
త్రాణుండైమను, మట్లుగాక మదిలో దర్పించినం దద్రణ
క్షోణీయుక్త ఖరాగ్రసిక్త పటుదో స్స్ఫాణోగ్రబాణాసనా
క్షీణస్ఫార కఠోర ఘోరశరముల్ చెండాడు నీ కంఠముల్

ఉ. వినయముతోడ నన్ను రఘువీరునకిచ్చి వినమ్రుడైన నొం
డనియెడువాడుగాడు, శరణాగత వత్సలు, డాదయాళుతో
ననువుగసంధిచేసుకొని యాదటమై బ్రతుకుండు నీవు నీ
జనములు, క్రొవ్వి చచ్చుట విచారము గాదటుగాక తక్కినన్

శా. పంకేజాసను జొచ్చినన్ జవమునన్ పాతాళమున్ దూరినన్
లంకారాక్షస వంశవారధి కరాళజ్వాలజిహ్వాల మై
సంకీర్ణస్ఫుట విస్ఫులింగపటలీ సంతానమై ఘోరమై
కింకన్ రాఘవ బాణబాడబముఖక్షీణాగ్ని గ్రోలుంజు మీ.

కథ

# సుడి గుండాలు

కరోనా కాటుతో విలవిల లాడిన మధ్యతరగతి కుటుంబం. ఐతా చంద్రయ్య కలం నుండి జాలు వారిన కథ....



ఐతా చంద్రయ్య

"వారెవ్వా! ఇయ్యాల అయ్యగారి మొకం పున్నమి చందమామ లెక్క వెలిగిపోతుంది, ఎందుకో? మన పల్లవి పుట్టిన రోజు సంబరమా?" భర్త చేతులున్న పాకెట్ అందుకుంటుంటే మాధవి కళ్లల్లో నూతన కాంతి తొంగి చూసింది. సతీశ్ ను కింది నుంచి మీద్దాకా చూపులతో తడిమింది.

"మన వరాల మూట పుట్టిన రోజు పండగ పొద్దున్నే చేసినం గదా! ఇది మొదటి పుట్టిన రోజు... వార్షికోత్సవ మాయె. ఇంకో శుభవార్త గూడా వుంది మాధవీ! అదో..వస్తుంది బుడి బుడి నడకల పల్లవి. ఇది నా జీవన రాగానికి పల్లవి లాంటిది..నా బంగారు కొండా!" మురిసిపోతూ కూతురు నెత్తుకుని లేత చెంపలు ముద్దాడిండు సతీశ్.

"అమ్మా..నాన్న...!" పాప కేరింతలు.

" నువు ఇయ్యాల్ల మా రాజు లెక్కున్నవయ్యా!" మాధవి తృప్తి.

"నువు దేవ కన్యలాగున్నవ్ మాధవీ! ఆ కళ్లు, పొట్లకాయ ముక్కు, ఎర్రని కుంకుమ బొట్టు.." చెంపలందుకోబోయి మానుకున్నడు.

సిగ్గుల బుగ్గల్ని అరచేతుల్లో దాచుకుంది. కళ్లు కమ్మగా తిప్పింది. "చాల్చాలు. మునగ చెట్టు ఎక్కియ్యొద్దు. మీ బట్టల దుకాండ్ల గుమాస్తాలకు డబుల్ బోనసిచ్చిండ్రా..?" కను రెప్పలు టపటపలాడిన్నై. కూతురునందుకుని కిందికి దింపింది. ఆ రోజు ఉదయమే పల్లవికి కొత్త గౌను వేసి, గుడికెళ్లి అర్చన చేయించిండ్రు.

చిన్నారి పల్లవి కీ యిచ్చిన బొమ్మలా వెళ్లి బొమ్మలతో ఆడుకుంది. సతీష్ సంతోషాన్నాపుకోలేక భార్య సన్నని నడుం చుట్టూ చేతులు బిగించిండు. మాధవి కపోలాలు సిగ్గులు సింగారించుకున్నై. "అయ్యో! యాల్లగాని యాల్ల గిదేం పనీ..?" కౌగిలి ఇష్టంగానే వున్నా, ఎవరన్నా చూస్తారు బాబూ! సందెవేళ సరసాలేందీ..? ముందా శుభవార్త ఏందో చెప్పాలె గదా..!" విడిపించుకుంది. చెరో కుర్చీలో కూర్చున్నరు.

"నేను బట్టల షాపుల ఉద్యోగం మానేసిన" చిరునవ్వు. ముక్కు మీద వేలేసుకుంది. శుభం పలుకరా పెళ్లి కొడుకా అంటే పెళ్లి కూతురు ఎక్కడుందని అడిగిండట. అదేమన్నా ఘన కార్యమా..? ఉద్యోగం మానేస్తే బతుకుబాట సంగతేందీ..? మాధవి అయోమయం.

భార్య చేతుల్ని అందుకుని నాజూగ్గా చెంపలద్దుకుంటూ " నాకు కిరణ్ క్లాత్ షాపింగ్ మాల్ ల సేల్సుమేన్ ఉద్యోగం దొరికింది. అదే షాపింగ్ మాల్లో నీకో చీరకొందామని వెళ్లిన. అక్కడి మానేజర్ నా బాల్య స్నేహితుడు. చీరకొని అతని ముందు కెళ్లిన. నవ్వుతూ పిలిచి కూచోబెట్టుకున్నడు. ఆ మాట, ఈ మాట మాట్లాడి 'గా చిన్న బట్టల దుకాండ్ల జీతం నీకేం సరిపోతుంది..? మా షాపింగ్ మాల్ ల సేల్స్ మేన్ ఉద్యోగం ఖాళీ వుంది. చేరిపో. ఇక్కడ జీతమెక్కువ'. పి.యఫ్. సౌకర్యము, రోజుకెనిమిది గంటల వరకే డ్యూటీ. నీకిష్టమైతే ఇప్పుడు దరఖాస్తు ఇచ్చి రేపట్నుంచి డ్యూటికి రా. నేను మా యాజమాన్యంతో మాట్లాడ్తా. సొంత సోదరుడిలా అడిగిండు.

వెంటనే దరఖాస్తు రాసిచ్చిన. రేపు ఉదయం పదింటికి డ్యూటీకి రా. మందహాసం చిందించిండు. నాకు తిరుపతి లడ్డూ తిన్నంత సంతోషమైంది. థాంక్స్ చెప్పిన. మా బట్టల దుకాణం కెళ్లి సేటుకీ సంగతి చెప్పిన. నాకు రావాల్సిన జీతమిచ్చి ఆయన అభినందనలు చెప్పిండు."

మొదటి నెల జీతం తీసుకుంటూంటే కొత్తగా విమానమెక్కినంత ఖుషీ అయింది. పాప కాళ్లకు మువ్వల పట్టీలు కొన్నడు. సతీశ్ తల్లిదండ్రులు అతని పసిప్రాయములోనే స్వర్గవాసముకెళ్లిండ్రు. దూర బంధువొకాయన పట్నం తీసుకొచ్చి సోషల్ వెల్ఫేర్ హాస్టల్ల, బడిల చేర్పించిండు. తల్లి లాంటి హాస్టల్ బడిలో ఒడిదుడుకులను దాటవేస్తూ డిగ్రీ వరకు చదువు పూర్తి చేసిండు. లోకం పోకడ

కథ



వచ్చే నెల జీతంలోంచి కొంత పొదుపు చేయాలనుకున్నరు. తనకుద్యోగమిచ్చిన మానేజర్, ప్రమోషన్ మీద హైద్రాబాదుకెళ్లిండు. కొత్తగా వచ్చిన మానేజర్ చిర్రు బుర్రులకు చిరునామా. అయినా సతీశ్ అతనికేమీ అవకాశమివ్వలేదు. అందుకే అతనంటే మానేజర్ కు సదభిప్రాయముంది. కలలో కూడా ఊహించని విధంగా కరోనా రోగం వైరస్ చైనాలో ఊపిరిపోసుకుని ప్రపంచదేశాలకు వ్యాపిస్తోంది. అదో గాలి పురుగు. కనబడదు, వినబడదు. సోకిందంటే ముప్పు తిప్పలు పెట్టి మూడు చెర్ల నీరు తాగిస్తుందని, ప్రాణాలను తీస్తుందని పత్రికలో చదివిండు సతీశ్.

బయటకు రాగానే తెలిసొచ్చింది. హాస్టల్లుండి చదివినా ప్రభుత్వోద్యగమేదీ దొరకలేదు. బట్టల దుకాణముల గుమాస్తాగా చేరిండు. మాధవి వాళ్ల ఊరిలోనే పుట్టి పెరిగి పదో తరగతి పాసైంది. పై చదువులకు పట్నం వెళ్లే తాహతు లేదు. రెండేళ్ల తర్వాత ఆమె తండ్రికి సతీశ్ గుర్తుకొచ్చిండు. సతీశ్‌తో మాట్లాడి తల్లిలేని మాధవినిచ్చి పెళ్లి చేసిండు. బాధ్యత బరువు దించుకుని పైలోకానికెళ్లిపోయిండు.

పట్నం అంచుల్లో రెండు గదుల చిన్న పోర్షన్‌ల అద్దింట్లో కాలం నడిపిస్తుంది. రెండేళ్ల తర్వాత పల్లవి జన్మించి మురిపాల మూట అందించింది.

పనిభారమెంతున్నా సతీశ్ వెనకా ముందాడడు. నల్లని మీసం కట్టు కింది ముత్యాల్లాంటి చిరునవ్వుతో మాట్లాడ్డం, ఆత్మీయంగా మెదుల్తూ చిరాకులను సంతృప్తి పరచడం అలవాటైంది. పల్లవికి మూడేళ్ల వయసు దాటింది. మాధవి మళ్లీ తల్లి కాబోతుంది. వాళ్ల కదో తీయ్యని అనుభూతి. కిరణ్ షాపింగ్ మాల్ జీతంలోంచి కూడబెట్టిందేమీ లేదు గాని అంతకుముందు తలకు అందితే పాదానికందదు. పాదానికందితే కాలుకందని దుప్పటి లాగున్న పరిస్థితి మెరుగైంది. చేబదుళ్ళు, చిన్న చిన్న అప్పులు తీరిపోయినై.

వచ్చే నెల జీతంలోంచి కొంత పొదుపు చేయాలనుకున్నరు. తనకుద్యోగమిచ్చిన మానేజర్, ప్రమోషన్ మీద హైద్రాబాదు కెళ్లిండు. కొత్తగా వచ్చిన మానేజర్ చిర్రు బుర్రులకు చిరునామా. అయినా సతీశ్ అతనికేమీ అవకాశ మివ్వలేదు. అందుకే అతనంటే మానేజర్‌కు సదభిప్రాయముంది.

కలలో కూడా ఊహించని విధంగా కరోనా రోగం వైరస్ చైనాలో ఊపిరిపోసుకుని ప్రపంచ దేశాలకు వ్యాపిస్తోంది. అదో గాలి పురుగు. కనబడదు, వినబడదు. సోకిందంటే ముప్పు తిప్పలు పెట్టి మూడు చెర్ల నీరు తాగిస్తుందని, ప్రాణాలను తీస్తుందని పత్రికలో చదివిండు సతీశ్. ఆ కొత్త రోగానికి సరియైన విరుగుడు మందు లేదట. అది సోకకుండనే జాగ్రత్త పడాలి. అనుమానమొస్తే వెంటనే హాస్పిటల్ కెళ్లాలి. ప్రాథమిక పరీక్ష చేసింతర్వాత క్వారంటైన్ లో పద్నాలుగు రోజులుండాలి. ముక్కు, నోటి సాంద్రాల పరీక్షలో అది కరోనా రోగమేనని తేలితే హైద్రాబాదు పెద్ద హాస్పిటల్ కు పంపి వైద్యం చేయిస్తరు. అది కరోనా కాదని తేలితే హాస్పిటల్ లేదా ఇంటి క్వారంటైన్‌లో పద్నాలుగు రోజులుండాలి. అయినా రోగ తీవ్రత సవారి చేసి కొందరు ప్రాణాలను మింగేస్తూనే వుంది.

భారత్‌లోకి చొచ్చుకొచ్చిన కరోనా వైరస్ ఇంకా విస్తరించకుండానే కేంద్ర ప్రభుత్వం ఓ రోజు జనతా కర్ఫ్యూ విధించింది. రవాణా సౌకర్యాలు, దుకాణాలు అన్నీ బంద్. అందరూ ఇంట్లనే ఉండాలి. జనాల స్వీయ నియంత్రణలో జనతా కర్ఫ్యూ విజయవంతమైంది. మర్నాటి నుండే రాష్ట్ర ప్రభుత్వం పూర్తి లాక్ డౌన్ విధించింది. అదో పరీక్షా కాలమవుతుందని ఎవరూ ఊహించలేదు.

లాక్ డౌన్ అంటే పొద్దంతా బజార్లు బంద్. మెడికల్ తప్ప మిగితా షాపులేవీ తెరువరాదు. కూరగాయలు, అత్యవసర వస్తువులు కొనుక్కునేందుకు రోజూ ఉదయం రెండు గంటల సమయ

మిచ్చింది. రాత్రంతా పూర్తి కర్ఫ్యూ. ఇళ్లల్లోనే జనాలుండాలి. బయటికి రారాదు. పొద్దున బయటికెళ్లినా నోటికి మాస్క్ ధరించడం తప్పనిసరి. అనవసరంగా బయటికెళ్లిన వారిని పోలీసులు అటకాయించడం. వాహనాల మీద వెల్తాంటే ఆపి జరిమానా విధించడం లేదా వాహనాన్ని పోలీస్ స్టేషన్ కు తరలించడం. బస్సులు, లారీలు, రైళ్లు, విమానాలకు విశ్రాంతి విధించిండ్రు. బడులు, గుడులు మూతి ముడుచుకున్నై. ఫంక్షన్ హాళ్లు బోసిబోయినై. ఉత్సవాలు, పండుగ పబ్బాలు ఇళ్లకే పరిమితం. స్వయం నియంత్రణ పాటించాలని ప్రభుత్వ ప్రచారం. రాత్రి కర్ఫ్యూలో చీమ చిటుక్కుమన్నా పోలీసులు లటుక్కున పట్టుకుంటుండ్రు.

రెక్కాడితే గాని డొక్క కదలని శ్రమ జీవులు, రోజు కూలీలు, వలస కూలీలు, దుకాణాల గుమస్తాలు, షాపింగ్ మాల్, సిన్మా థియేటర్ల సిబ్బందికి నెత్తి మీద గొడ్డలి దెబ్బ పడ్డట్లైంది. ఇదో రకమైన హౌజ్ అరెస్టు. జనాలు చేతులు కట్టుకొని ఇంట్లోనే గడపాలి.

సతీశ్ - మాధవి కడుపుల దప్పులు కొట్టినై. పని లేకుంటే జీతం లేదు. జీతం లేక పోతే కడుపు నిండదు. కరోనా వైరస్ మాత్రం స్వేచ్ఛగా విహరిస్తోంది. వేరే పనులేవీ చేసుకునే అవకాశం లేదు. పెద్ద హాస్పిటల్లన్నీ కరోనా పరీక్షల కేంద్రాలైనై. చాలా మంది రోగులను హైద్రాబాదు పెద్దాసుపత్రికి తరలిస్తూంటే, విధిలేక కొందరిని కాటికి పంపాల్సి వస్తుంది.

ఆయోమయంలో అల్లాడుతూ, సతీశ్ షాపింగ్ మాల్ సూపర్వైజర్ కు ఫోన్ చేసిండు. ఆయనది గూడా తన పరిస్థితే ఉన్నట్టుంది. "సతీశ్ భాయ్! రాష్ట్రంల మాల్స్ అన్నీ నోరు మూసుకుంటే మన క్లాత్ మాల్ నోరు తెరుస్తదా..? ఇంట్లనే వుండు రాజాలాగే" తోచినది చెప్పిండు. ఈ లాక్ డౌను ఎప్పుడు పూర్తవుతుందో? దుకాండ్లు ఎప్పుడు తెరుస్తరో? ఎన్ని రోజులు పని, జీతం లేకుండా వుండాలె? మాధవి గర్భవతి. పల్లవి చిన్న పిల్ల. నా అన్న వాళ్లెవ్వరూ లేరు. ముందు ముందు ఎట్లా గడుస్తదో? ఈ కరోనా మహమ్మారి ఎన్ని ప్రాణాలు మింగేస్తుందో? ఆలోచనలు ప్రశ్నాబాణాలై గుచ్చుకుంటున్నై.

"ఏందయ్యా! గట్ల బీరిపొయ్యి కూచున్నవు? దునియాల అందరితోని మనం. మాధవి భుజమ్మీద చెయ్యేసింది. పల్లవీ! నువు నాన్నతోని ఆడుకో.. కూతురును తండ్రి మీద కూచోబెట్టి లోపలి కెళ్లి పోయింది.

రోజూ కష్టం చెయ్యడమలవాటైన మనిషి ఏ పనీ లేకుండా వుంటే మెదడులో పురుగులు రెక్కలు విప్పుతై. రామ చిలుకను పంజరముల బంధించి నట్టవుతది. మూన్నాల్లు రోజులకొకసారి కూరగాయల కోసం ఉదయమే మాస్క్ తోని మార్కెట్ కెల్తున్నడు.

వరుసగా వారం రోజులు చేతులు ముడుచుకుని ఇంట్లో ఉండేసరికి పిచ్చెక్కినట్టైంది. మరో రెండ్రోజులు గడిచే సరికి జైల్లో గడుపుతున్నట్టుంది. పనిచేసిన రోజులు జీతమిచ్చినా, మాధవికి మందులు, ఇంట్లోకి కొన్ని సరుకులు, కరంటు బిల్లు కట్టే సరికి చేతులో పైసల్లేవు. పాల వాడికి డబ్బులివ్వలేదు. కూరగాయల కెళ్లినప్పుడో కో వర్కర్ కలిసిండు. అతని పరిస్థితి గూడా అధ్వాన్నంగా ఉందట. వచ్చిన కొద్దిపాటి జీతం డబ్బుల్లోంచి తల్లితండ్రులకు మందులు కొన్నడట.

"గిట్లైతే ఎట్ల మిత్రమా..సతీశ్ దీనవదనం..?"

"అంతా దైవాధీనం మిత్రమా! గీ కరోనాను బొందవెట్ట. మనసొంటోల్ల ఉసురువోసుకుంటుంది. ఏం జెయ్యాల్నె సమజైతలేదు".

" నేనైతే మన షాపింగ్ మాల్ తెరవగానే కొంత జీతం అడ్వాన్సు ఇవ్వమని అడుగుత. మనమంతా కలిసి అడుగుదాం. కొద్ది రోజులు ఓర్చుకోక తప్పదు. ఫికరు పడకు" మని తానే ధైర్యం చెప్పిండు.

బోడిగుండు మీద తాటికాయ పడ్డట్టు ప్రభుత్వం లాక్ డౌన్ పొడిగించింది. డ్యూటీల వుండంగ వేయించిన సెల్ ఫోను బాలెన్సు సున్నాకొచ్చింది. షాపింగ్ మాల్ మానేజరు హైద్రాబాదులున్నడు. సెల్ ఫోన్ అమ్మాలన్నా కొనేవారు లేరు. ఇంటి యజమాని అద్దె ఇవ్వుమన్నడు. తన పరిస్థితి అంతా చెప్పి, భార్యభర్తలు కలిసి బతిమాలి పంపించిండ్రు. పాలవాడు డబ్బులివ్వమని ఒత్తిడి చేస్తున్నడు.

ఇంట్లోని సరుకులన్నీ ఎప్పుడో నిండుకున్నై. ఎప్పుడూ ఊహించని విధంగా ఉపవాస పర్వం ప్రారంభమైంది. తెల్లరేషన్ కార్డు ఉన్న వాళ్లకు ప్రభుత్వం ఉచితంగా బియ్యమిస్తామన్నా అదింకా అమలుకు రాలేదు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఐదొందల రూపాయలు బాంకు ఖాతాలో పడ్డట్టుగా మెసేజ్ వచ్చింది. అప్పటికే ఓ రోజు ఉపవాసంతో గడిచింది. మరో రోజు ఎవరో అన్నదానం చేస్తుంటే అక్కడికెళ్లి కడుపు నింపుకున్నరు. తెల్లారి మళ్లీ ఉపవాసం. నాల్గో రోజు మెసేజ్ చూసి వెళ్లి బాంకు లైన్లో నుంచున్నడు. ఉదయం నుంచుంటే సాయంత్రం డబ్బులు చేతికొచ్చినై.

వెంటనే మాధవికి మందులు, ఓ కిలో బియ్యం, కొన్ని సరుకులు కొన్నడు. మర్నాడు రేషన్ బియ్యమిస్తున్నరు.

**సెల్ ఫోన్లో పది రూపాయల బాలెన్సు వేయించుకోంగనే మాల్ మేనేజర్ కళ్లల్లో మెరిసిండు. ఆయనను ఫోన్లో సంప్రదించిండు. "గీ లాక్ డౌన్ పొడగింపు మాకు దిన దిన గండమైంది సార్. తినేతందుకేమీ లేదు. ఉపవాసముంటున్నం. దయచేసి ఓ నెల జీతం ఇప్పించండి సార్" దీనంగా బతిమాలిండు. "వారెవ్వా సతీశూ! మన షాపింగ్ మాలేమన్నా ధర్మ సత్రమా? మాల్ బంద్ అయింది. ముందొచ్చిన లాభం గూబల కొచ్చిందంటా.**

కార్డులో పల్లవి పేరు చేర్చలేదు. ఆ రోజంతా కాళ్ల నొప్పులు భరించి లైన్లో నుంచుండి ఉచిత బియ్యం తీసుకున్నాక ఉచ్ఛ్వాస, నిశ్వాసలు సరియైనవి. అంతకు ముందే పక్కింట్లో చేబదులు తెచ్చిన రెండు శేర్ల బియ్యం తిరిగి ఇచ్చేసిండ్రు.

సెల్ ఫోన్లో పది రూపాయల బాలెన్సు వేయించుకోంగనే మాల్ మేనేజర్ కళ్లల్లో మెరిసిండు. ఆయనను ఫోన్లో సంప్రదించిండు. "గీ లాక్ డౌన్ పొడిగింపు మాకు దిన దిన గండమైంది సార్. తినేతందుకేమీ లేదు. ఉపవాస ముంటున్నం. దయచేసి ఓ నెల జీతం ఇప్పించండి సార్" దీనంగా బతిమాలిండు.

"వారెవ్వా సతీశూ! మన షాపింగ్ మాలేమన్నా ధర్మ సత్రమా? మాల్ బంద్ అయింది. ముందొచ్చిన లాభం గూబల కొచ్చిందంటా. పని చేయనప్పుడు పైసలెట్లయిస్తరు? చదువుకున్నోనివి, ఆ మాత్రం తెల్వదా? గుర్రుమన్నడు.

"దుకాణం బందున్నా గవర్నమెంటు మాకు జీతాలివ్వమంది గదా మెమెట్లా బతకాలె సార్..?"

"అదంతా మన యాజమాన్యానికెరుక. యాజమాన్యం మాత్రంఎట్లిస్తుంది..? అదేదో గవర్నమెంటే ఇవ్వొచ్చు గదా!"

"మానేజర్లకు జీతమిచ్చిండ్రట కదా సారూ..?"

"మీరు, మానేజరు ఒకటేనా..? గుర్రం, గాడిద రెండూ ఒకటేనా..? పెట్టెయ్ ఫోన్..కట్...

తలకొట్టేసినట్టైంది. బియ్యం కొద్దిగా వున్నా కూరగాయలకు పైసల్లేవ్. తెలిసిన వాళ్ల దగ్గర చేబదుల్లు చేస్తున్నడు.కారం తోని గడపాల్సి వస్తుంది. సాయంత్రం చాయగూడా బందయింది. డ్యూటీల వున్నప్పుడు మాల్ మానేజర్ చాయ తెప్పించేవాడు.

కాల చక్రంతో పోటీ పడుతూ కరోనా వైరస్ వేగం పెంచింది. రోగులు, మృతులు పెరుగుతున్నరు. ఎంతో మంది క్వారంటైన్లో ఉంటున్నరు. వలస కార్మికుల పరిస్థితి హృదయ విదారకంగా వుంది. పనిలేదు, తిండిలేదు. తమ రాష్ట్రాలకు పంపించుమని ప్రభుత్వాన్ని బతిమాలుతున్నరు. ఉద్యమాలు చేసి దెబ్బలు తింటున్నరు. వందల మంది మరొక దారి లేక కాలినడకన మూటా ముల్లె, భార్యా పిల్లలతో బయలుదేరిండ్రు. వాళ్ల బాధలు వర్ణనాతీతం.

మందులు సరిగా వాడని కారణంగా మాధవిని బలహీనత ఆవహించింది. ఓ రోజు గడప కాలుకు తట్టుకుని పడిపోయింది. వెంటనే హాస్పిటల్ కు తీసుకెళ్లిండు. మాధవి అవస్త పడుతూనే వుంది. నొప్పి భరించలేకపోతుందట. ప్రభుత్వాసుపత్రిలో అలస్యమనేది సర్వ సామాన్యము.

మాధవి కేకల్ని భరించలేక పోతున్నడు. డాక్టర్ వచ్చి చూసి ఆమెకు అబార్షనైందన్నది. నర్సుకేవో సూచనలిచ్చి వెళ్లిపోయింది.

సతీశ్ గర్భకూహరంలోంచి తీసుకొచ్చిన దుఃఖం కట్టలు తెంచుకుంది. కూతురు నెత్తుకొని వెక్కివెక్కి ఏడ్చిండు. భార్య బాధ అంతా ఇంతా కాదు. ఈసారి కొడుకు పుడితే ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించుకుందామనుకున్న. "మన మీద దేవుడు పగబట్టిండు" గోడు గోడుమంది.

"మాధవీ! మనం మానవ మాత్రులం. ఎప్పుడేది జరగాలెనో అదే జరుగుతుంది. నువ్వు ఏడ్వకు.. పల్లవి గుండె పల్గుతది. కాలకూట విషాన్ని గొంతులో అదిమిపెట్టిన పరమ శివుడిలా దుఃఖాన్ని అదిమిపెట్టిండు. భార్యను సముదాయించిండు.

మందులకు, దవాఖాన ఖర్చులకు వెయ్యి రూపాయలు అప్పు చేయక తప్పలేదు. అప్పుడే రాష్ట్ర ప్రభుత్వం బాంకు అకౌంట్ల డబ్బులు వేసింది. ఓ రోజంతా బాంకు లైన్లో నుంచుండి డ్రా చేసిండు. ముందు పాలవాడికి పైసలిచ్చిండు. వెయ్యి అప్పుల నుండి ఐదొందలు తీర్చేసిండు. ప్రభుత్వం వేసిన పదిహేను వందల రూపాయలు అడుగంటినై.

మాధవి వారం రోజుల్లో మామూలు మనిషైంది. పేపర్ చదవాలంటే పక్కింటోల్లను అడగాల్సి వస్తుంది.

ఇంకొక్క రోజైతే రెండవ లాక్ డౌను ముగుస్తుందనుకుంటే కరోనా ధాటికి తట్టుకోలేక సర్కారు మూడో లాక్డౌను విధించింది. ఇంకెన్నిసార్లు పొడిగిస్తారో తెలీదు. అది శ్రమ జీవుల్ని పగబట్టిన పాములా వెంటాడుతుంది. దరిలేని బావిలో పడి కాళ్లూ చేతులు కొట్టుకుంటున్నట్టుంది సతీశ్ కు. ఇంట్ల సరుకులై పోయినై. పస్తుల పర్వం మళ్లీ షురువైంది. ఓ రోజు భారంగా గడిచింది. బాలింత లాంటి మాధవికేమవుతుందోనని సతీశ్ భయం.

"నాకేమీ కాదు. నువ్వేమీ ఫికర్ పడకు". ఆమెనే ధైర్యం చెప్పింది.

ఓ సేవా సంస్థ పుణ్యాత్ములు గరీబుల ఇంటింటికి రెండు కిలోల బియ్యం, చింతపండు, మిరపకాయలు ఉచితంగా పంచి పెట్టిండ్రు. కష్టాల బాటలున్నప్పుడు కాలం నత్తనడకన నడుస్తుంది. అతి జాగ్రత్తగా వాడుకుంటే అది నాలుగైదు రోజుల ఆకలి మంటల్ని చల్లార్చినై.

మళ్లీ సుడిగుండముల చిక్కుకున్నట్లైంది. ఇహ ఎవరినడగాలి..? ఎట్లా ఎల్లదియ్యాలె..? మాధవి కంటతడి పెట్టింది. అయినా ఉపవాసం తప్పలేదు. "అమ్మా! ఆకలైతుందే!" అంటూ పల్లవి దీనంగా చూస్తుంటే తల్లిదండ్రుల కడుపులు తరుక్కుపోయినై. ఎవరో పుణ్యాత్ముడు పిల్లలకు బిస్కెట్లు పంచిండు. అదే ఆసరా అయింది చిన్నారి పల్లవికి. "మాధవీ! మనం బిచ్చగాళ్ల లెక్క ఐపోయినం." ఎదురుగా నేల మీద కూచున్న భార్య ముందు విచారం వెలిబుచ్చిండు. ఏం జవాబివ్వాలో తోచలేదు మాధవికి.

"సతీశ్! వెంకటేశ్వర్ల గురించి వాసవి క్లబ్ వాళ్లు మనసొంటోళ్లకు ఏవో పంచుతున్నరట. పదా!" సతీశ్ తోటి సేల్స్ మాన్ వచ్చి తీసెకెళ్లిండు.

మాధవి మనసులో ఆశాదీపం మిణుకు మిణుకుమంది. ఆరిపోకుండా ఆదెన్ని రోజులుంటుందో తెలియదు. శ్రమ జీవి స్వేద బిందువులకు ఖరీదు కట్టే షరాబులెవరో అంతకంటే తెలియదు.

కవిత

# సృజన రూపశిలలు

**చొప్పదండి సుధాకర్**

ఎదిగినపిల్లల్లా
ఇంటినిండా తిరిగొచ్చిన కవితలు
ఎంత అందంగా ఉన్నా , ఎన్ని ప్రతికల పరిమళాలైనా
ఒంపుసొంపుల సోయగాలన్నా ఎవరికి ముద్దూ?
ఎవరిప్రాధాన్యతలు వారివి.. వాదానికి వాదం కుదరొద్దూ..?
తిరిగొచ్చిన కవితలు తిరిగి తిరిగి పంపిస్తున్నపుడు
మదిలో ఒక కలత లాంటి నలత..
అవునూ - రాయాలనిపించడం వొక మానసిక రుగ్మతే
ఇంకా ఎవరూ మందుకనుక్కోలేని మహమ్మారి
మనిషేఒక అగణిత బాక్టీరియా అవశేషం కదా
సరే నిమ్మరసం అయినట్టు మార్కెట్ వ్యూహాలు
మర్మంగానే ఉంటాయి
మళ్ళీ కవిత్వం దగ్గరకే వద్దాం ఏదో.. ఏదేదో
రాయాలని నాడి చాలక నాట్య విన్యాసం
దేశాన్ని ఉద్ధరించకున్నా ఒక భృకుటి ముడేస్తే
అక్షర అవతారం సుసంపన్నమయినట్టే..!
రాస్తూ ఉంటాం కథలూ, కవితాలూ నానా
మేధోరూపశిలలు
గుడ్డివాడి బాణంలా ఏదో ఒకటి తగులుతుంది
వందలు వేలు మిగిలి దిగులుపడతాయి
నాకే నేను చాలా సార్లు నచ్చలేను. నా కవితలు
అందరికీ ఎలా నచ్చుతాయి ..?
అయినా ఆలోచనలు వదలవు-అక్షరాలు నిద్రపోనివ్వవు
రాయాలి - తిరిగి రావాలి-ఆశ కాలాన్ని గెలవాలి
చిత్తం నిరంతరం శుద్ధి కావాలి....
అవునూ - చిత్తశుద్ధి ఇంకా ఇంకా బలపడాలి



# నవ్వుకుంట బతకాలె!

**కె.ఎల్. సత్యవతి**

తెల్లారి...పొద్దు మీకి..దీన్ని..
చేత్లకి తీస్కుని...ముద్దు చెయ్యంది...
నాకు దినం గడవది...యాభై ఏండ్ల సంది
యాది మరవలే..దీని దోస్తానా యిడవలె!

ఆడల టొంగులు దిని...పుచ్చుమొగం లెక్క
అయిన గనీ..నా కండ్లకి చందమావలెక్కన
కొత్తది నా బొంగరం!..బిగించి..యిడిసితె
గిర్రుమండని తిరుగుతనే వుండది..ఆగకుంట!

గెలుపు గుర్రమెక్కి...మరుస్తది...అలసట!
వీడితెగినా..మల్ల ఆడి గెలవాలె..ఎవ్వరికీ
తలకాయ వంచక..బతకాలె! గిది
నా బొంగరం నేర్పిన పాఠం..సక్కని దారి

చూపిన దీపెం! పెయ్యి బరువు కాకుంట
శ్రమ పడతెనే వుంట! నా కష్టంలనే..
సుఖాన్ని పోసుకుంట..! మనం బతకాలె
చేతనైన కాడికి మందిని బతికించాలె!
దేవుడిచ్చిన గీ జీవితాన్ని ప్రేమించాలె!
నవ్వుకుంటనే... దినాలను ఎల్లదీయాలె!

దృశ్య సాహిత్యం

# మూన్ లైట్

చిత్రం : **మూన్ లైట్**, దర్శకుడు : **బేరీ జెన్కిన్స్**, భాష : **ఇంగ్లీష్**

బేరీ జెన్కిన్స్ దర్శకత్వం వహించిన చిత్రం "మూన్‌లైట్". చిరోన్ అనే ఒక నల్లజాతి యువకుడు, అమెరికాలో ఎదుర్కొన్న అనుభవాల సమాహారంగా ఈ చిత్రం తెరకెక్కింది. చిరోన్ జీవితంలోని మూడు దశల్లో ఎదుర్కొన్న చేదు అనుభవాలు, సవాళ్లను అధిగమించిన విధానాన్ని




దర్శకుడు ఇందులో వివరించాడు. ముఖ్యంగా చిరోన్ తన శారీరక లోపాన్ని(లైంగికత), సమాజం ముందు ఎలా సమర్థించుకున్నాడు, విమర్శలను ఎలా స్వీకరించాడు అనేది ఇందులో కీలకమైన కథాంశం. ఈ చిత్రం 2017లో ఉత్తమ చిత్రంగా ఆస్కార్ అవార్డు గెలుచుకోవడంతో పాటు, కీలక పాత్రలో నటించిన మహెర్షల అలీ ఉత్తమ సహాయ నటుడు అవార్డును అందుకున్నాడు. చిరోన్ (హిబ్బెర్ట్) బాల్యంలో ఉన్నప్పుడు ఇతరులతో సంభాషించడం తెలియని వ్యక్తి మరియు అందరి దూషణలకు గురైన వాడు. తన తల్లితో పాటు దగ్గరివారంతా, చిరోన్ చాలా అమాయకమైన వ్యక్తిగా భావించి, నిత్యం బెదిరింపులకు గురిచేసేవారు. ఇలాంటి పరిస్థితుల్లో చిరోన్‌ను, జూన్ (మహెర్షల అలీ) అనే స్థానిక డ్రగ్ డీలర్ చేరదీస్తాడు. మనం తరచూ చూసే నల్ల జాతి డ్రగ్ డీలర్లతో పోలిస్తే, జూన్ వ్యక్తిత్వం పూర్తిగా విభిన్నం. జూన్, చిరోన్ పట్ల తండ్రి లాంటి సానుభూతిని చూపి, శారీరక లోపం గురించి సిగ్గు పడాల్సిన అవసరం లేదంటూ చిరోన్ కు తరచూ ధైర్యం చెప్పేవాడు. రెండో దశలో, టీనేజర్ గా మారిన చిరోన్ (అష్టోన్ సాండర్స్) ఎప్పుడూ ముక్కోపిగా, ఒంటరితనంతో ఉండేవాడు. అయితే వీటన్నిటి నుండీ, కెవిన్ (ఝరెల్ జారోమ్) తో ఉన్న స్నేహ బంధం, చిరాన్ కు కాస్త ఉపశమనం కలిగించేది. చివరదైన మూడో దశలో చిరోన్ మార్పు చెందిన తీరు అందరినీ ఆకట్టుకుంటుంది. తన చుట్టూ ఉన్న వాతావరణాన్ని ఎదుర్కోవడానికి శారీరకంగా, మానసికంగా అత్యంత ధృడంగా తయారైన తీరుతో, సరికొత్త చిరోన్ ను ప్రపంచానికి పరిచయం చేస్తాడు దర్శకుడు.

చిరోన్ జీవితంలోని స్వచ్ఛమైన అనుభూతులతో, దర్శకుడు బేరీ జెన్కిన్స్, ఈ చిత్రంలోని ప్రతి సన్నివేశాన్ని అద్భుతంగా తీర్చిదిద్దాడు. చిరోన్‌కు జీవిత పాఠాలు నేర్పిస్తూ, తండ్రి లాగ వ్యవహరించిన మహెర్షల అలీ వచ్చే సన్నివేశాలు సినిమాకే హైలెట్‌గా నిలిచాయి.

# దంగల్

చిత్రం : **దంగల్**, దర్శకుడు : **నితీష్ తివారీ**, భాష : **హిందీ**

ప్రముఖ ఇండియన్ రెజ్లర్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత మహావీర్‌సింగ్ ఫోగట్ జీవిత కథ ఆధారంగా 'దంగల్' చిత్రాన్ని తెరకెక్కించారు. మహిళలు రెజ్లింగ్ క్రీడ వైపు రావడాన్ని అదోలా చూసే రోజుల్లో మహవీర్ సింగ్ ఫోగట్ తన ఇద్దరు కూతుళ్ల గీతా ఫోగట్, బబితా ఫోగట్‌లను దేశం గర్వించదగ్గ మహిళా రెజ్లర్లుగా ఎలా తీర్చిదిద్దారు అనే కథాంశంగా ఈ సినిమా తెరకెక్కింది.

మహావీర్ సింగ్ ఫోగట్ (అమీర్ ఖాన్) హరియానాలోని భివానీ జిల్లాలోని ఓ మారుమూల గ్రామానికి చెందిన రెజ్లర్. రెజ్లింగ్‌లో భారత దేశానికి బంగారు పతకాన్ని అందించాలన్నది ఆయన కల. తన కల నెరవేరక పోవడంతో తనకు పుట్టబోయే కుమారుల ద్వారా అయినా అది నిజం చేయాలని భావిస్తారు. అయితే ఆయన భార్య శోభా కౌర్ (సాక్షి తన్వార్) నాలుగు సార్లు ఆడపిల్లలనే ప్రసవిస్తుంది. తన కల నిజం కాదని డీలా పడిపోయిన ఫోగట్... అనుకోకుండా ఓ రోజు స్కూల్‌లో జరిగిన గొడవలో తన కూతుళ్లు గీతా ఫోగట్ (ఫాతిమా), బబిత కుమారీ (సాన్యా మల్హోత్ర) బలప్రదర్శన చూసి ఆశ్చర్యపోతారు. వారిని రెజ్లర్లుగా తీర్చిదిద్ది తన కలను నిజం చేసుకోవాలనుకుంటాడు. ఇందుకోసం వారికి తానే స్వయంగా




కఠోర శిక్షణ ఇచ్చి తన కూతురి ద్వారా దేశానికి పతకం అందిస్తాడు. అమీర్ ఖాన్ అద్భుతమైన పెర్ఫార్మెన్స్ ప్రేక్షకుడిని కదిలిస్తుంది. దేశం గర్వించేలా తన కూతుళ్లను తీర్చి దిద్దిన మహావీర్ సింగ్ ఫోగట్ కథ ఆకట్టుకొంటుంది. క్రీడలు, మహిళలు, సమాజానికి సంబంధించిన ఒక మంచి సందేశం కూడా సినిమాలో ఉంది. అమీర్ ఖాన్ అద్భుతమైన పెర్ఫార్మెన్స్ ప్రేక్షకుడిని కదిలిస్తుంది. దేశం గర్వించేలా తన తన కూతుళ్లను తీర్చి దిద్దిన మహావీర్ సింగ్ ఫోగట్ కథ ఆకట్టుకొంటుంది. దేశానికి బంగారు పతకం అందించాలనే పాత్రలో అద్భుతమైన భావోద్వేగాలు పండించారు ఈ చిత్రంలో దంగల్ మూవీ కథను, అందులోని భావోద్వేగాలను ప్రేక్షకుడికి కనెక్ట్ అయ్యేలా చేయడంలో సక్సెస్ అయ్యాడు. స్క్రీన్ ప్లే అక్కడక్కడా కాస్త స్లోగా ఉన్నా ప్రేక్షకుడి ఆకట్టుకుంటుంది.ఈ సినిమా కేవలం రెజ్లింగ్‌కు సంబంధించింది మాత్రమే కాదు. మన చుట్టూ ఉన్న సమాజం, మహిళా సాధికారిత, క్రీడల్లో అమ్మాయిలను ప్రోత్సహించడం వంటి విషయాల గురించి చెప్పే మంచి సందేశాత్మక చిత్రం.

వ్యాసం

# తెలంగాణ కవిత్వం తొలి ఆనవాళ్ళు

తొలినాటి కవిత్వం వికసించిన నేపథ్యాన్ని వివరిస్తున్న సంగిశెట్టి శ్రీనివాస్....



సంగిశెట్టి శ్రీనివాస్

హైదరాబాద్లో ఆధునిక కాలంలో సామాజిక మార్పులకు, పారిశ్రామికీకరణకు, సంస్కరణలకు దారులు వేసింది సాలార్జంగ్ పేరిట అందరికీ తెలిసిన నవాబ్ మీర్ తురాబ్ అలీఖాన్ (1829-1883). అఫ్జల్ ఉద్దేలా మొదలు మహబూబ్ అలీఖాన్ వరకు ముగ్గురు అసఫ్ జాహీ రాజుల వద్ద ప్రధానిగా పనిచేసిన సాలార్జంగ్ మొత్తం 1853 నుంచి 1883 వరకు 30 యేండ్లు పదవిలో ఉన్నాడు. హైదరాబాద్ రాజ్య పాలనలో సాలార్జంగ్ తీసుకొచ్చిన సంస్కరణలు ప్రభుత్వానికి అధిక ఆదాయాన్ని గడించి పెట్టింది. అప్పటి వరకు మధ్యవర్తులు దోసుకుంటున్న సొమ్మును ప్రభుత్వ ఖజానాకు జమ చేయించ గలిగాడు. ప్రభుత్వం, దివానీల అధీనంలో 1853లో 26వేల ఎకరాల భూమిని 1889 నాటికి 71, 589 ఎకరాలకు పెంచాడు. వీటిని ప్రత్యక్ష ప్రభుత్వ పాలనలోకి తీసుకు వచ్చాడు. దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయం పెరిగింది. కొన్ని జాగీర్దార్లను, మరి కొన్ని చోట్ల జాగీర్దారి పద్ధతిని క్రమబద్ధం చేసిండు. ప్రభుత్వానికి వ్యవసాయ భూముల ద్వారా వచ్చే ఆదాయాన్ని 1853-1862ల మధ్య కాలంలో 163 శాతం పెంచాడు. ప్రయివేటు వ్యక్తులకు గుత్తకిచ్చిన రహదారి పన్నుల వసూలు పద్ధతిని తొలగించి ప్రభుత్వమే సరిహద్దుల్లో సుంకాన్ని వసూలు చేసే పద్ధతి అమల్లోకి తీసుకు వచ్చాడు. 1853లో మొత్తం 0.8 మిలియన్లున్న ప్రభుత్వ ఆదాయాన్ని 1883 నాటికి 35 మిలియన్లకు పెంచగలిగాడు.

వివిధ వనరుల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం పెరగడంతో ఋణ వితరణ విస్తృతంగా సాగింది. అలాగే రైల్వే ల ఏర్పాటు కోసం పెట్టుబడి కూడా అధిక మొత్తంలో పెట్టడం జరిగింది. 1874లో సికింద్రాబాద్-వాడి రైల్వేలైన్ ప్రజల సౌకర్యార్థం పనిచేయడం ఆరంభించింది. రైల్వేల అభివృద్ధికి తోడుగా నిజాం ప్రభుత్వం నిజాం స్టేట్ గ్యారంటీడ్ రైల్వేస్ సంస్థని, మరో బ్రిటీష్ కంపెనీ హైదరాబాద్ దక్కన్ మైనింగ్ కంపెనీని (1887) ఏర్పాటు చేసింది. 1886లో సింగరేణి కాలరీస్ కంపెనీ ఏర్పాటయింది. నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణం కోసం, వాటి మరమ్మత్తుల కోసం ప్రభుత్వం పి.డబ్ల్యు.డి, సివిల్ ఇంజనీరింగ్ శాఖను ఏర్పాటు చేసింది. 1869లో విద్యాశాఖ, ప్రభుత్వ నిర్వహణ న్యాయవ్యవస్థ కోసం ప్రత్యేక విభాగాలు, పోలీస్, ఫైనాన్స్, అడవులు, పబ్లిక్ వర్క్స్, కస్టమ్స్, రెవిన్యూ, పోలీస్, ఆరోగ్యం, మిలిటరీ, పొలిటికల్ అఫెయిర్స్, క్రిమినల్ కోర్టులు, ఉన్నతమైన హైకోర్టు ఏర్పాటయ్యాయి. దేశంలోనే సొంత రైల్వే, రోడ్డు వ్యవస్థ, బొగ్గు గనుల ఉత్పత్తి, విద్యుత్ ఉత్పత్తి చేసినరాజ్యం హైదరాబాద్. పారిశ్రామికంగా కూడా హైదరాబాద్ రాజ్యం ముందంజలో వుండింది. బ్రిటిష్ ప్రభుత్వం బొగ్గు గనులు, పత్తి మిల్లులున్న ప్రాంతాల్లో రైల్వే లైను నిర్మాణం చేపట్టింది. ఇదొక అభివృద్ధి శకం. ఆధునికతకు పునాది. సాలార్జంగ్ 1865లో జిలాబంది పద్ధతిని ప్రవేశపెట్టి రాజ్యాన్ని 14 జిల్లాలుగా విభజించాడు. ఆ తర్వాత ఈ 14 జిల్లాల్ని ఐదు సుభాలుగా విభజించారు. వంశపారంపర్యంగా వస్తున్న గ్రామ కాపలాదార్ల స్థానంలో 1865లో పోలీసు విధానాన్ని ప్రవేశ పెట్టారు. 1868లో హైదరాబాద్ - షోలాపూర్ రోడ్డు, భూమిశిస్తులో మార్పులు, వాణిజ్య పన్నులు, ఆబ్కారీ పన్నులు దేశ్ పతి అనే స్థానిక పన్నులు, నజరానాలు కూడా ప్రభుత్వానికి ఆదాయాల్ని చేకూర్చాయి.

ఇవన్నీ హైదరాబాద్ రాజ్యంలో ఆధునికత ప్రవేశం కావడానికి, పారిశ్రామికంగా ఇతర రాష్ట్రాలతో పోటీ పడడానికి ఆస్కారం కలిగింది.

1886లో ఏర్పాటైన సింగరేణి కాలరీస్ కంపెనీ ఇప్పటికీ లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తుంది. సర్ సిల్క్, అజాంజాహీ మిల్స్, రాంగోపాల్ మిల్స్, డిబీఆర్ మిల్స్, ఆల్విన్, ఏసీసి సిమెంట్, రామగుండం, బెల్లంపల్లి మైన్స్, హైదరాబాద్ స్టీల్ కంపెనీ, బీడి కంపెనీ, ఎలక్ట్రిసిటీ, మున్సిపాలిటీ, రోడ్డు, రవాణా ఇలా అనేక రంగాల్లో హైదరాబాద్ పారిశ్రామికంగా ముందుండింది. దీంతో చాలామంది శ్రామికులకు ఉపాధి లభించింది. 1869లో సివిల్ ఇంజనీరింగ్ కాలేజి, 1890లో వరంగల్ లో ఇండస్ట్రియల్ స్కూల్, 1928లో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (బి.ఇ), 1940లో కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అండ్ ఆర్కిటెక్చర్ ఏర్పాటు కావడం హైదరాబాద్ ఘన చరిత్రను చెప్పకనే చెబుతుంది. మద్రాసు యూనివర్సిటీకి అనుబంధంగా 1880లోనే చాదర్‌ఘాట్ హైస్కూలు ఏర్పాటు కావడమనేది ఒక మైలురాయి. వందేండ్ల క్రితమే హైదరాబాద్‌లోని హుసేన్ సాగర్ తీరంలోనే విద్యుదుత్పత్తి చేసేవారంటే హైదరాబాద్ గొప్పతనం తెలుస్తుంది. కరెంటు వచ్చిన మూడ్నాలుగేళ్లలోపే ఇప్పటి ఓల్డ్ సిటీ మొత్తం విద్యుత్ కాంతులతో మెరిసిపొయ్యింది.

విద్యారంగంలో కూడా హైదరాబాద్ ముందుండింది. 1854లోనే ఇక్కడ కింగ్ ఎడ్వర్డ్ మెమోరియల్ హాస్పిటల్ (తర్వాతి కాలంలో గాంధీ ఆసుపత్రి) స్థాపితమయింది. సెయింట్ ఆన్స్ స్కూల్ (1861), మహబూబ్ కాలేజి, ఆంగ్లో వర్నాక్యులర్ (కీస్ హైస్కూలు), ఆదయ్య స్మారక పాఠశాల (విలియం బార్టన్ పాఠశాల-1916), సెయింట్ మేరీస్ హైస్కూలు (1885), సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ (1850), పరోపకారిణీ బాలికా పాఠశాల (1916) మొదలైన పాఠశాలలు ఇంగ్లీషు మీడియంలో విద్యాబోధన చేస్తూ దేశంలోనే ఆంగ్ల విద్యకు కేంద్రంగా నిలిచింది.

నగరంలోని స్టేట్ సెంట్రల్ లైబ్రరీ, జూబిలీ హాల్, పబ్లిక్ గార్డెన్ (1864),

**మొత్తం ప్రపంచంలోనే మొట్ట మొదటి మహిళా అనస్తీషియన్ హైదరాబాదీ. రూపాబాయి ఫరూంజీ అనే పార్సీ మహిళ ఉస్మానియా మెడికల్ కాలేజిలో చదువుకుంది. ఈమె 1889-1917 సంవత్సరాల మధ్యకాలంలో హైదరాబాద్ లోని బ్రిటిష్ రెసిడెన్సీ హాస్పిటల్ (ప్రస్తుత సుల్తాన్ బజార్ ప్రసూతి వైద్యశాల), జజ్జీఖానాల్లో ఈమె పనిచేసింది. విదేశాల్లో సైతం విద్యనభ్యసించి వచ్చిన ఈమెకు కూడా చరిత్రలో తగిన స్థానం దక్కలేదు.**

అసెంబ్లీ, ఉస్మానియా వర్సిటీ, జజ్జీఖానా, ఫలక్‌నామా ప్యాలెస్, హైకోర్టు, రాజ్ భవన్, నిజామియా అబ్జర్వేటరీ (1901), హైదరాబాద్ మ్యూజియంలు ఆనాడు నిర్మించినవే. కిషన్ బాగ్ లో మందిరము (1822), లాడ్ బజార్, మలక్ పేట్ రేస్ కోర్స్ (1879), మాల్వాలా ప్యాలెస్ (1849), మోజాం జాహీ మార్కెట్ (1935), మీర్ ఆలం ట్యాంక్ (చెరువు-1804-1808), ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్, పురానీ హవేలి ఇలా ఎన్నో కట్టడాలు నిజాం పాలన విశిష్టత. జ్యూడిషియరీ, ఎగ్జిక్యూటివ్ రెండింటిని విడదీసిన ఘనత దేశంలోనే మొదటిసారిగా నిజాంలకు దక్కుతుంది.

సంస్థానాల్లోనూ చేసిన పోరాటాలను మనం ఇక్కడ గుర్తు చేసుకోవాలి. హైదరాబాద్ చరిత్రలో విడదీయలేని భాగమయిన వీటిని ఏనాడు సీమాంధ్ర పాలకులు తమవిగా భావించలేదు. మీదు మిక్కిలి ఉస్మానియా దవాఖానా, కోరంటి దవాఖానాలకు నిధులివ్వక పేదలకు వైద్యాన్ని దూరం చేసారు. డాక్టర్లకు సదుపాయాలు కల్పించకుండా సతాయించారు.

మొత్తం ఏషియా ఖండంలోనే మొట్టమొదటి నోబెల్ బహుమతి 'హైదరాబాదీ'కి దక్కిన విషయం అంతగా ప్రాచుర్యంలోకి రాలేదు. మలేరియాకు కారణాల్ని కనుక్కొన్నందుకు రోనాల్డ్ రాసుకు మెడిసిన్లో 1902లో నోబెల్ బహుమతి దక్కింది. ట్రిగానమెట్రికల్ సర్వే ఆఫ్ ఇండియాను స్థాపించిన ఎవరెస్టు 1818లో హైదరాబాద్‌లో సర్వేయర్‌గా పనిచేశారు. అలాగే రెండో ప్రపంచ యుద్ధకాలంలో ఇంగ్లండ్ ప్రధానిగా పనిచేసిన విన్‌స్టన్ చర్చిల్ కూడా హైదరాబాద్ లో పనిచేశాడు. బ్రిటీష్ ఆర్మీలో భాగంగా ఈయన 1880లో సికింద్రాబాద్ లో పనిచేశాడు. కవి రిచర్డ్ టేలర్, బ్రిటీష్ రెసిడెంట్లు రస్సెల్, హాలండ్, ఫ్రేజర్, సిదెన హామ్ ఇలా ఎంతోమంది హైదరాబాదు ను అక్కున జేర్చుకున్నరు.

మొత్తం ప్రపంచంలోనే మొట్ట మొదటి మహిళా అనస్తీషియన్ హైదరాబాదీ. రూపాబాయి ఫరూంజీ అనే పార్సీ మహిళ ఉస్మానియా మెడికల్ కాలేజిలో చదువుకుంది. ఈమె 1889-1917 సంవత్సరాల మధ్యకాలంలో హైదరాబాద్ లోని బ్రిటిష్ రెసిడెన్సీ హాస్పిటల్ (ప్రస్తుత సుల్తాన్ బజార్ ప్రసూతి వైద్యశాల), జజ్జీఖానాల్లో ఈమె పనిచేసింది. విదేశాల్లో సైతం విద్యనభ్యసించి వచ్చిన ఈమెకు కూడా చరిత్రలో తగిన స్థానం దక్కలేదు. హైదరాబాద్ క్లోరోఫామ్ కమిటీ సభ్యురాలిగా ఆమె అందించిన సేవలు కూడా మరవలేనివి.

1857 నాటికే హైదరాబాద్ లో టెలిగ్రాఫిక్ సౌకర్యాలున్నాయి. నగరంతోపాటు వివిధ జిల్లాలను కలుపుతూ రెగ్యులర్‌గా ఉత్తరాల బట్వాడా చేసేందుకు గాను 1872లో ఆధునిక పద్ధతిలో పోస్టాఫీసు పద్ధతి ఆరంభమయింది. తర్వాతి కాలంలో ప్రత్యేకంగా పరిశ్రమలకోసం సనత్ నగర్ పారిశ్రామిక వాడనే ఏర్పాటు చేయడ

మయింది. ఉర్దూ లో సనత్ అంటే పరిశ్రమ.

1885లో కాంగ్రెస్ పార్టీ ఏర్పాటైన సమయంలో హైదరాబాద్/ సికింద్రాబాద్లో కూడా ఆ సంస్థ కార్యకలాపాలు, కాంగ్రెస్ జండా ఆవిష్కరణ జరిగింది. అప్పటి నుంచీ ప్రభుత్వాలకు మహాజర్ల ద్వారా, వినతి పత్రాలిస్తూ ప్రజలు తమ కోర్కెలను, డిమాండ్లను విన్న వించేవారు. ఈ కొద్దిపాటి చైతన్యమే అద్భుతాలు సృష్టించింది. ఈ చైతన్యంలో భాగంగానే గ్రంథాలయాలు ప్రారంభమయ్యాయి. మొదట 1872లోనే ముదిగొండ శంకరారాధ్యుల గ్రంథాలయం సికింద్రాబాద్లో ఏర్పాటయింది. అసఫియా లైబ్రరీ 1892లో, షాలిబండలోని భారత గుణవర్ధక లైబ్రరీ (1895), బొల్లారం ఆల్బర్ట్ రీడింగ్ రూమ్ (1896) జంటనగరాలకు విజ్ఞానాన్ని పంచాయి. 1901లో స్థాపించబడ్డ శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయం తెలంగాణలో గ్రంథాలయోద్యమానికి, ఆధునికతకు దారులు వేసింది. రాజరాజ నరేంద్రాంధ్ర గ్రంథాలయం (హన్మకొండ-1904), సంస్కృత కళాభివర్ధిని గ్రంథాలయం (సికింద్రాబాద్-1913), బాలసరస్వతీ లైబ్రరీ (గౌలిగూడ-1923)లు జంట నగరాల్లో సాంస్కృతిక, సాహిత్య, సామాజిక చైతన్యాన్ని పెంపొందించాయి.

హితబోధిని (1913), గోలకొండ (1926), సుజాత(1927), నీలగిరి (1922), తెనుగు (1922), దక్కన్ కేసరి (1934) పత్రికలు పునర్వికాసోద్యమానికి చేయూత నిచ్చాయి. ఇంగ్లీషు, ఉర్దూ పత్రికలు ప్రజల అభ్యున్నతికోసం నిర్వహించిన పాత్ర చిరస్మరణీయమైంది. హైదరాబాద్ టెలిగ్రాఫ్ (1886), దక్కన్ స్టాండర్డ్ (1889), దక్కన్ టైమ్స్, హైదరాబాద్ రికార్డ్ (1891) లాంటి పత్రికలు హైదరాబాద్ ప్రజల చైతన్యానికి చేసిన దోహదం ప్రశంసనీయమైనది. థియోసాఫికల్ సొసైటీ, బ్రహ్మసమాజ్, ఆర్యసమాజ్, హిందూ సోషల్ క్లబ్, హుమానిటేరియన్ లీగ్, సోషల్ సర్వీస్ లీగ్ లాంటి సంస్థలు, బారిష్టర్ రుద్ర, ముల్లా అబ్దుల్ ఖయూం, పండిత తారానాథ్, బాజీ కృష్ణారావు, వామన నాయక్, మాడపాటి హనుమంతరావు, భాగ్యరెడ్డి వర్మ, షోయెబుల్లాఖాన్లు చేసిన కృషి హైదరాబాద్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి.

ఈ కాలంలో విద్యాలయాలు, వైద్యాలయాలు, ఆంగ్ల, ఉర్దూ పత్రికలు విరివిగా నెలకొల్పబడ్డాయి. ఈ మార్గమే హైదరాబాద్ లోని రెసిడెన్సీ ప్రాంతంలో శ్రీకృష్ణదేవ రాయాంధ్ర భాషానిలయం ఏర్పాటుకు దారి తీసింది. ఈ భాషా నిలయ స్థాపనతోతెలంగాణలో ప్రశ్నించే తత్వానికి ప్రాణం వచ్చిందని చెప్పొచ్చు. అప్పటి వరకూ వ్యక్తులుగా అక్కడక్కడా ప్రభుత్వానికి వినతి పత్రాలు ఇస్తూ ఉన్న వారికి ఈ నిలయం ఒక వేదికగా అంది వచ్చింది. తెలుగులో రాయగలిగి, మాట్లాడగలిగి, అంతో ఇంతో పలుకుబడి ఉన్న వారందరికీ నిలయం ఒక కూడలి ప్రదేశమయింది. వార్షిక ఉత్సవాలు, రోజువారి సమావేశాలు, సభలు, సన్మానాలు అన్నీ కలగలిపి తమ వారి బాగోగుల కోసం పోరాడేలా పురికొల్పింది. రాజ నాయని వెంకటరంగారావు, కొమర్రాజు లక్ష్మణరావు, పాల్వంచ సంస్థానాధీశులు, రావిచెట్టు రంగారావు, ఆదిరాజు వీరభద్రరావు ఇలా ఎంతో మంది దీని స్థాపనలో పాలుపంచు కున్నారు. తెలంగాణలో ఆధునికతకు చైతన్యానికి దారులేసింది ఈ భాషానిలయమే అంటే అతిశయోక్తి కాదు.

**1886లో ఏర్పాటైన చేసిన సింగరేణి కాలరీస్ కంపెనీ ఇప్పటికీ లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తుంది. సర్ సిల్క్ అజాంజాహీ మిల్స్, రాంగోపాల్ మిల్స్, డిబీఆర్ మిల్స్, ఆల్విన్, ఏసీసి సిమెంట్, రామగుండం, బెల్లంపల్లి మైన్స్, హైదరాబాద్ స్టీల్ కంపెనీ, బీడి కంపెనీ, ఎలక్ట్రిసిటీ, మున్సిపాలిటీ, రోడ్లు, రవాణా ఇలా అనేక రంగాల్లో పారిశ్రామికంగా ముందుండింది. 869లో సివిల్ ఇంజనీరింగ్ కాలేజి, 1890లో వరంగల్ లో ఇండస్ట్రియల్ స్కూల్, 1928లో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (ఐ.ఇ), 1940లో కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అండ్ ఆర్కిటెక్చర్ ఏర్పాటు కావడం హైదరాబాద్ ఘన చరిత్రను చెప్పకనే చెబుతుంది.**

ఆధునిక సమాజంలో ఉత్పత్తి, శ్రమశక్తి, పారిశ్రామిక ప్రగతి, ఉద్యమాలు, పాలనా సంస్కరణలు, రవాణ సాధనాలు, విద్య, వైద్యం, కమ్యూనికేషన్స్, ముద్రణా రంగాల్లో అభివృద్ధి మనిషి జీవితంలో మెరుగైన మార్పులు తీసుకొచ్చాయి. ముద్రణా రంగంలో మార్పు వేలమంది విద్యావంతులకు రచనలు ఏకకాలంలో చేరువయ్యేందుకు పత్రికలు పుస్తకాలు తోడ్పడ్డాయి. ఇప్పుడు ముద్రణా రంగాన్ని అధిగమించి కంప్యూటర్, ఇంటర్నెట్ రంగం, బ్లాగులు, ట్విట్టర్లు, ఫేస్ బుక్, వెబ్ పత్రికలు క్షణాల్లో ప్రపంచ వ్యాప్తంగా సాహిత్యాన్ని, సమాచారాన్ని చేరవేస్తున్నాయి. మానవ జీవితాల్లో, ఆలోచనా సరళిలో, సమాజ సంబంధాల్లో కూడా ఈ మార్పు ప్రతిఫలించింది. ఆ ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. తెలుగు సమాజాన్ని ఈ ఆధునికత అలుముకున్న దగ్గరనుంచీ సృజనకారుల రచనల్లో భిన్న ధోరణులు, చెప్పే వస్తువులో వైవిధ్యం, విషయంలో విస్తృతి కనిపిస్తాయి. 'ఆధునికత అంటే అశాస్త్రీయతపై, సాంప్రదాయాలపై తిరుగుబాటు'. మరో విధంగా చెప్పాలంటే 'మనువాదానికి లోను గాకుండా ఆంగ్ల సాహిత్యంతో ప్రభావితమైంది' ఆధునిక సాహిత్యంగా చెప్పొచ్చు. ఫ్రెంచ్ విప్లవం, పారిశ్రామిక ప్రగతితో ప్రారంభమైన 'స్వేచ్ఛ, సమానత్వం, సౌభాతృత్వం' భావన ఆధునికతకు మూలం. ఈ ఆధునికతను ఆవాహన చేసుకోవడంతోనే తెలుగులో

కథానిక/కథా రచన ఆరంభమయ్యిందని చెప్పొచ్చు. అందుకే 'జీవితంలో ఎదురయ్యే సంక్లిష్ట సంఘటనలను, ఆటుపోట్లకు గురయ్యే సంబంధాలను, పాత్రలు, సన్నివేశాలు కల్పించి రాసిందే ఆధునిక కథ'. తాతాచారి, దక్కన్ కథలు, కాశీమజిలీ కథలు కూడా కథాసాహిత్యంగా పరిగణించినప్పటికీ ఆధునిక 'కథ/కథానిక'వెలువడడానికి దారితీసిన పరిస్థితుల్ని అంచనా వేసి, అది చూపిన ప్రభావాన్ని లెక్కలోకి తీసుకొని 'ఆధునికత'ను లెక్కగట్టాలి. ఈ వ్యాసంలో కాలం మాత్రమే ప్రాతిపదికగాకాకుండా దానికి తోడు రచనల్లోని వస్తువు ఆధునికమైనప్పుడే పరిగణనలోకి తీసుకోవడమైంది. అయితే వ్యాసానికి సమగ్రత చేకూర్చేందుకు ఈ కాలంలో రచనలు చేసిన వారి పేర్లు కూడా ప్రస్తావించడమైంది. కాలాన్ని మాత్రమే లెక్కలోకి తీసుకొని రచనల్ని పరిశీలనలోకి తీసుకున్నట్లయితే రచయితల బిబ్లియోగ్రఫీ తయారవుతుంది. అలా గాకుండా ఆధునిక సాహిత్యాన్ని చర్చించాలను

**1901 లో శ్రీకృష్ణదేవ రాయాంధ్ర భాషానిలయం స్థాపన నాటి నుంచి ప్రారంభమైన ఈ సాహిత్య సాధన 1930లో ప్రథమాంధ్ర మహాసభల నాటి వరకు కొనసాగిన తీరుని ఈ షత్రంలో విశ్లేషించడమైంది. కవిత్వంలో రావిచెట్టు రంగారావుపై రాసిన ఎలిజీ, షబ్నవీస్ వెంకటరామ నరసింహారావు ఆయన భార్యపై రాసిన ఎలిజీ, హితబోధిని, ఆంధ్రాభ్యుదయము, నీలగిరి, తెనుగు, గోలకొండ, సుజాత పత్రికల్లో వచ్చిన సాహిత్యమూ ఇందు కోసం పరిశీలించడమైంది.**

కోవడంతో వస్తువు ప్రధానంగా తీసుకొని విశ్లేషించడమైంది. ఈ సమస్య కేవలం కవిత్వం/పాటకు మాత్రమే ఏర్పడుతుంది. ఎందుకంటే కథ, నవల రెండూ దాదాపు పూర్తిగా ఆధునిక ప్రక్రియలు. ఈ ప్రక్రియల్లో రాసిన సాహిత్యమంతా ఆధునికమైనదిగానే పరిగణించడమైంది. అక్కడక్కడా కథ, నవలల్లో వస్తువు చరిత్రకు సంబందింఁచినదైనప్పటికీ అవి జాతీయ భావనను పాదుకొల్పడానికి పనికివస్తాయి కాబట్టి వాటిని ఆధునికమైనవిగానే భావించడమైంది. కథకు, నవలకు, కవిత్వానికి స్వల్ప బేధాలతో కింది అంశాల ప్రాతిపదికన ఆధునికతను లెక్కకట్టవచ్చు. అవి

1. ఆధిపత్య ధిక్కారం (సకల)
2. ఆంగ్ల విద్యా ప్రభావం
3. పత్రికా ప్రచురణ / ముద్రణా కమ్యూనికేషన్/ ఇంటర్నెట్ విస్తృతి
4. పాలక పక్షం గాకుండా ప్రజా పక్షం / (పాలకులకు వ్యతిరేకంగ)
5. జెండర్ సమానత్వం - అభ్యున్నతి స్త్రీవిద్య
6. తెలుగు డయస్పోరా (వలస - చలన జీవితం) మొబిలిటీ
7. జాతీయత
8. స్వేచ్ఛ, సమానత్వం, సౌభాతృత్వం
9. హేతువాదం

స్థూలంగా 1930కి ముందు తెలంగాణ నుంచి వెలువడిన సాహిత్యాన్ని పై అంశాల ప్రాతిపదికన ఈ వ్యాసంలో రికార్డు చేయడమైంది. 1930వరకు అనే ప్రాతిపదిక తీసుకోవడంలో ప్రధాన ఉద్దేశ్యం తొలి ఆంధ్రమహాసభలు జరిగిన సంవత్సరం కావడం. ఈ ఆంధ్ర మహా సభలు తెలంగాణ ప్రజల్లో అస్పృశ్యతా నివారణకు, సంఘ సంస్కరణకు, సాహిత్యోద్ధరణ, రాజకీయ చైతన్యం, గ్రంథాలయోద్యమానికి పునాదిగా నిలిచింది. ఇది కేవలం వ్యాసం కావడంతో విపులంగా కాకుండా లోతుల్లోకి వెళ్లకుండా పైపైనే స్పృశించడం జరిగింది. ఆధునిక సాహిత్యం కవిత్వం, పాట, ద్విపద, పద్యం, కథ, నవల, నాటకం, రూపకం, యక్షగానం, శతకం, జానపద గేయ కథా కావ్యాలు, దండకాలు ఇలా అనేక ప్రక్రియల్లో వెలువడింది. కొన్నిప్రక్రియలు పాతవైనప్పటికీ ఆధునిక విషయాలు రికార్డు చేసినవి కూడా ఉన్నాయి. శతకాలు, పద్యాలు, దండకాలు, తత్వాలల్లో ఆధునిక భావజాలంతో కూడిన అంశాలున్నాయి. వీటన్నింటిని సమన్వయం చేసుకొని చూసినప్పుడే సమగ్రత ఏర్పడుతుంది. శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయం ఏర్పాటు సమయంలో తెలంగాణలో తొలి కవి సమ్మేళనం జరిగింది. అంతకు ముందు గద్వాల, వనపర్తి, కొల్లాపురం సంస్థానాలల్లో ఈ గోష్టులు, సమ్మేళనాలు జరిగినప్పటికీ ఆధునిక భావజాలంతో, ఇతివృత్తంతో కవి సమ్మేళనం 1901 సెప్టెంబరు ఒకటిన జరిగిందని చెప్పొచ్చు. కొమర్రాజు లక్ష్మణరావు, భండారు అచ్చమాంబ, ఆదిరాజు వీరభద్రరావు, రావిచెట్టు రంగారావు, ఆదిపూడి సోమనాథరావు, మైలవరం నరసింహశాస్త్రి, సురవరంప్రతాపరెడ్డి, బూర్గుల రామకృష్ణారావు, శేషాద్రి వెంకటరమణకవులు, ఒద్దిరాజు సోదరులు, రూప్టాన్‌పేట రత్నమాంబ దేశాయి, సోమరాజు రామానుజరావు, ఆయన సోదరి ఇందుమతిదేవి, ఇ. రాజయ్య, కోదాటి రామకృష్ణారావు, మాడపాటి రామచంద్రుడు ఇంకా అనేక మంది తెలంగాణలో ఆధునిక సాహిత్యానికి పాదులు తీసింద్రు. అన్ని ప్రక్రియల్లోనూ ఇది కొనసాగింది. ఇంచుమించు 1901లో శ్రీకృష్ణదేవ రాయాంధ్ర భాషానిలయం స్థాపన నాటి నుంచి ప్రారంభమైన ఈ సాహిత్య సాధన 1930లో ప్రథమాంధ్ర మహాసభల నాటి వరకు కొనసాగిన తీరుని ఈ పత్రంలో విశ్లేషించడమైంది. కవిత్వంలో రావిచెట్టు రంగారావుపై రాసిన ఎలిజీ, షబ్నవీస్ వెంకటరామనరసింహారావు ఆయన భార్యపై రాసిన ఎలిజీ, హితబోధిని, ఆంధ్రాభ్యుదయము, నీలగిరి, తెనుగు, గోలకొండ, సుజాత పత్రికల్లో వచ్చిన

సాహిత్యమూ ఇందు కోసం పరిశీలించడమైంది. 1926 తర్వాత గోలకొండ పత్రిక, 1934 నాటి గోలకొండ కవుల సంచిక, భాషానిలయ వార్షిక సంచికలు, ఆంధ్రప్రాంతం నుంచి దిన పత్రికలూ, భారతి, ఆంధ్రభారతి లాంటి మాస పత్రికలూ సమాచార సేకరణలో తోడ్పడ్డాయి. సంస్థానాల్లోని పండితులు చేసిన ఆధునిక రచన, పత్రికల్లో చోటుచేసుకున్న సాహిత్యం ఇక్కడ చర్చించడమైంది. కె.శ్రీనివాస్ డాక్టరేట్ పరిశోధన గ్రంథం, సుంకిరెడ్డి నారాయణరెడ్డి ముంగిలి, మత్తడి, బాల శ్రీనివాసమూర్తి తెలంగాణ తెలుగు మాగాణం, విశ్వేశ్వర సంస్కృతాంధ్ర డిగ్రీ మరియు పిజి కళాశాల వెలువరించిన తెలంగాణా ఆధునిక సాహిత్యం , ఓగేటి అచ్యుతరామశాస్త్రి హైదరాబాదు నగర తెలుగు భాషా సాహిత్య వికాస చరిత్ర, తెలుగు అకాడెమీ నాలుగు శతాబ్దాల హైదరాబాద్ నగరం, షబ్నవీస్, దస్రమ్, హైదరాబాద్ సిర్ఫ్ హమారా మొదలైన పుస్తకాలు కూడా ఈ రచనకు తోడ్పడ్డాయి. ఇంతవరకూ తెలంగాణ నుంచి తొలి కవితగా మత్తడిలో బూర్గుల రామకృష్ణారావు కవితగా రికార్డయింది. అది 1917లో వెలువడింది. దాన్ని తోసి పుచ్చుతూ 1901కి ముందే ఆధునిక కవిత వెలువడిందని ఇందులో వివరించడమైంది. ఈ సాహిత్యాన్నంతటినీ ప్రక్రియల వారిగా విశ్లేషించుకున్నట్లయితేనే పూర్తి అవగాహన ఏర్పడుతుంది. అందుకే భాగంగా తొలి విడతగా కవిత్వం గురించి ఇక్కడ పరిశీలిద్దాం!

**కవిత్వం..**

తెలంగాణాలో ఆధునిక కవిత్వం భాషానిలయ స్థాపన సమయంలో మైలవరపు నరసింహాశాస్త్రి చదివిన కవిత్వంతో ప్రారంభమయిందని చెప్పొచ్చు. అంతకుముందు రూప్ఖాన్ పేట రత్నమాంబ దేశాయి, రంగరాజు కేశవరావు, గోవర్ధన వెంకటనృసింహాచార్యులు, దొంతరమల్లేశం, కంసాలి సుబ్బకవి తదితరులు ఉర్దూమిశ్రిత తెలుగులో రాసింద్రు. అయితే ఇవి కొంత సనాతన దృక్కోణంతో ఉన్నాయి. అలాగే వివిధ సంస్థానాల్లోని కవులు అక్కడక్కడా ఆధునికత ధ్వనించే కవితలు రాసినప్పటికీ అవి ఎక్కువగా సనాతన అభిప్రాయాల్నే ప్రతిఫలింపజేశాయి. దున్న ఇద్దాసు భక్తి పూర్వకమైన తిరుగుబాటు తత్వాలను బోధించినా అవి ప్రధానంగా ఆధ్యాత్మిక సాహిత్యం. ఆధునికమైన గ్రంథాల యోద్యమము, పత్రికోద్యమము, గ్రంథ మాలోద్యమము, సంస్కరణోద్యమం, స్త్రీవిద్య, కవుల, సంస్కర్తల, నాయకుల, ప్రముఖుల ప్రశంస, మద్యపాన నిరోధము, అస్పృశ్యతా నివారణము, భావ కవిత్వము, రైతుల బాధలు, జాతీయత, నిజామాంధ్ర మాత, అసఫ్ జాహీ రాజుల ప్రశంస, భాగ్యనగర ఖ్యాతి, మూసి వరదలు, వయోజన విద్య ఇలా అనేక అంశాలపై కవిత్వం ఈ కాలములో వెలువడింది. పద్యాలు, గీతాలు, పాటలు, కీర్తనలు, ద్విపద, దండకాలు ఇలా అనేక రూపాల్లో కవిత్వం వెలువడింది.

ఈ కాలంలో కవిత్వం రాసిన దాదాపు అందరూ గోలకొండ కవుల సంచికలో నమోదయ్యారు. అయితే సాధ్యమైనంత మేరకు ఇంతవరకు ఎక్కడా చోటు చేసుకోని కవితల్ని మాత్రమే ఈ పత్రం కోసం ఉదాహరణగా తీసుకోవడమైంది. దున్న ఇద్దాసు, రూప్ఖాన్ పేట రత్నమాంబ దేశాయి, మైలవరం నరసింహాశాస్త్రి, కేశవపట్నం నరసయ్య, షబ్నవీసు వెంకటరామనరసింహారావు, మంగళ్ళెల్లి బుచ్చి వెంకటాచార్యులు, కందాళ లక్ష్మణాచార్యులు, సరికొండ లక్ష్మీనరసింహరాజు, వేదాంతం వెంకట నరసింహాచార్యులు, దరూరి సీతారామానుజాచార్యులు, జొన్న ఎల్లారెడ్డి, శ్రీరామకవచం కృష్ణయ్య, ఆత్మకూరు అంజనీదాసు, దేవరకొండ సయ్యద్ సోదరులు, పెరంబుదూరు, మరింగంటి, పెంటమరాజు వంశీయులు, ఆదిరాజు వీరభద్రరావు, మాడపాటి హనుమంతరావు,ఆదిపూడి సోదరులు,ఇ. రాజయ్య, కందిరాజు వెంకటకిషన్‌రావు, వనం వేంకట నరసింహారావు, కోదాటి రామకృష్ణారావు, పాడిచేటి సీతారామారావు, లక్ష్మీకాంత రాఘవకవులు, శేషాద్రి రమణకవులు, ముసిపట్ల పట్టాభి రామారావు (అష్టావధాని), అల్లూరి రాజేశ్వరరావు, వేంకట రాజన్న అవధాని, అనుముల విశ్వనాథం, ఒద్దిరాజు సోదరులు, బెల్లంకొండ సోదరులు, లక్ష్మీకాంత రాఘవకవులు, కె. అన్నమరాజశర్మ, పెమమరాజు రాజగోపాలము, శ్యామరాజు, కామరాజు సోదరులు, సురవరం ప్రతాపరెడ్డి, బూర్గుల రామకృష్ణారావు, గవ్వా సోదరులు, భవానీ సింగ్, గంగుల శాయిరెడ్డి, వేలూరి రంగధామనాయుడు, గుండోబా కవి, కోటయామాత్యుడు, దొంతర మల్లేశము, పంతము ఆంజనేయ కవి, వారణాసి రామయ్య, అన్నగారి వెంకట కృష్ణారాయుడు, తిరుమల పంచాంగం వేంకటాచార్యులు, గొట్టుపర్తి సుబ్బారావు, కొండా యల్లయ్య, పేరక రంగాచార్యులు, ఏలె ఎల్లయ్య కవి, పి.వి. వరదాచార్యులు, శ్రీమతి లక్ష్మీబాయి, రామసింహకవి, సిద్ధప్ప వరకవి, చెర్విరాల భాగయ్య, పదుల సంఖ్యలో కవయిత్రులు ఈ కాలంలో కవిత్వాన్ని ఆధునిక రీతిలో సృజించింద్రు. స్థలాభావం వల్ల వారిలో కొందరిని మాత్రం ఇక్కడ విశ్లేషించుకుందాం. వందకు వందశాతం గాకున్నా ఆధునిక ముద్ర ఉన్న కవిత్వాన్ని ఆధ్యాత్మిక ధోరణిలో సృజించిన వారిలో ఆద్యుడు దున్న ఇద్దాను అని చెప్పొచ్చు. నల్లగొండ-మహబూబ్ నగర్ జిల్లా సరిహద్దుల్లోని ప్రాంతాల్లో తన తత్వాలు, కీర్తనలతోటి జనసామాన్యంలో మార్పులు తీసుకొచ్చిన వెలుగు రేఖ ఇద్దాసు. నీతిబోధనలు చేసిండు. 1811లో పుట్టి 1919లో నిర్యాణం చెందిన ఈయన కీర్తనలు ఎక్కువగా 1870 నాటికే జనం నోటిపై నాట్యం చేసేవి. ఇప్పటికీ పాలమూరు జిల్లాలో ఈ తత్వాల్ని అలవోకగా పాడే వారు ఎందరో ఉన్నారు.

పుస్తక పరిచయం

# ప్రకృతి కవి జయరాజ్ 'అవని'




ఆయన పాటల కవి. గద్దర్, గోరేటి, అందెశ్రీ వరుసలోనే జనాలను ఉర్రూత లూగించే కవి గాయకుడు.ప్రజా కవి గా ప్రసిద్ధుడైన వ్యక్తి. ఈ వరకు సాహితీ లోకంలో జయరాజ్‌కి ఉన్న ముద్ర ఇది. ఆయన ఉద్యమ గీతాల్లో ప్రకృతి కూడా దర్శనం, ఇవ్వడం కద్దు. కాని "అవని"ని మన ముందుకు తెచ్చిన జయరాజ్ లో మనకు ఓ విభిన్న కవి కనిపిస్తాడు. ఒక సుకుమారుడైన ప్రకృతి ప్రేమికుడుగా ఆయన్ని మనం గుర్తిస్తాం. నిజానికి ప్రపంచ సాహిత్యంలో ప్రకృతికి ఎపుడైనా ఓ ఆరాధనీయమైన స్థానమే ఉంది. 'Return To Nature' అనేది కాల్పనిక కవిత్వంలో ఓ ప్రధానమైన నినాదం. దర్శించి వర్ణించాలని సంస్కృత లాక్షణికుల వ్యాఖ్యానం. 'Words worth' తన 'Immortality Ode'లో ఒకటి నుండి నాలుగు వరకు ఉన్న పద్యాల్లో తనకు ప్రకృతి దార్శనికత వల్ల వచ్చిన మార్పు ను గురించి చెబుతాడు. 'The World Is Too much with Us' అనే పద్యంలో మనిషి జీవితం, ప్రకృతి అస్తిత్వం మౌలికం గా ఒకటే అంటాడు. 'Coleridge First of mid Night' భావనలోనూ అభివ్యక్తి లోనూ వర్డ్స్ వర్త్ ను పోలినదే. 'Coleridge' మనిషి పొందే ప్రాకృతిక దృశ్యాను భూతులన్నీ మన అనుభవాలనంటి పుట్టినవే అని భావించాడు. 'shelley' ప్రకృతిని పునస్నాత 'A refreshing Principle'గా ఒక వినాశన శక్తి ('De-structive Force')గా ఒక సౌందర్య ప్రతినిధి ('Beautifying Agent')గా భావించాడు. జయరాజ్ కూడా ప్రకృతిని తన అనుభవం నుంచే చూశాడు. మనిషి అనంత అనుభవాన్ని కొన్ని అక్షర సమూహాంలో ఒదిగించడం సాధ్యం కాని పని. అందునా వచనంలో పొదుగడం మరింత కష్టం. తెలుగులో కృష్ణ శాస్త్రి మొదలు కాల్పనిక కవులంతా ప్రకృతిని కవిత్వంలో పొదిగారు. మానవీకరించారు.



కాని జయరాజ్ ఎలాంటి కవితా నిర్మాణాన్ని ప్రకృతి వర్ణనకు ప్రాతిపాదిక చేయలేదు. వచనంలో రాశాడు. అది శుద్ధ వచనం కూడా కాదు. కవితా వచనం.

"నేలమ్మ"తో ఇది మొదలవుతుంది.

"ఎత్తైన కొండలు.... పరువపు విరులు.. ఎగిరిపోతున్న మేఘాలు.. చల్లని పిల్ల గాలులు... పచ్చని అడవులు... నెలవంకలు... ఇంద్రధనుస్సులు... నిత్య సూర్య చంద్రోదయాలు... సముద్రాలు... సంధ్యా రాగాలు... ఇట్లా స్వభావ రమ్యంగా ప్రకృతిని మన ముందు పెడతాడు. ఏ అలంకారాలు ఆర్భాటాలు ఉండవు. మార్మికతను ఆశ్రయించడు. తాను చూసింది చూసినట్టు, అనుభవించింది అనుభవించినట్టు ప్రకృతి లోని సౌందర్య శకలాలు గుది గుచ్చి మన ముందు పెడతాడు. ఆయన దారిలో అట్లా వెడితే మనం పరిసరాలను మరచిపోతాం. చివరకు కవిని కూడా మరచిపోతాం. ఆయన సృష్టించిన ప్రకృతిలో మునిగి పోతాం. అట్లా.. చిలుకల గుంపులు, నెలవంకలు, తేనెటీగలు, కిరణాలు, కోకిల, తూనీగ, పిచ్చుక గూళ్ళు, సముద్రపు అలలు, మాతృ ప్రేమ, లేడి పిల్లలు, వలస పక్షులు,లాంటి సాధారణ ప్రాకృతికాంశాలు, సుతి మెత్తగా నిసర్గంగా ఉన్న వచనం తో గుండెను తాకుతాయి. ఇవే కాక గొంగళి, ఆరుద్ర, తాబేలు, సాలీడు, రింగన పురుగు ,నత్త గుల్లలు, లాంటి ఎవరూ పట్టించుకోనివి కూడా సుందరంగా కనిపిస్తాయి. మత్తు, ఇప్పపువ్వు, ఉప్పు, గొల్ల భామ, (ఒక రకమైన పక్షి) లాంటివి కూడా అతని మనసు కాంతిని దాటి పోలేదు.

ఉదాహరణకు కొంగలు అనే ఖండికను ఆయన ఎట్లా చిత్రించాడో అయన మాటల్లోనే చూడండి.

"వినీలాకాశంలో ఎగిరిపోతున్న ఆ కొంగలు, ఆకాశానికి గవ్వల దండ వేసినట్టుంటాయి. పొద్దున్నే గూడు విడిచి నీటి ప్రవాహం వద్దకు వెళ్లి ఒంటి కాలి పై నిలబడి చేపలకోసం తపస్సు చేస్తాయి. కాలం కరుణించి నాలుగు చిక్కితే జాగ్రత గా ఇంటికి తీసుకొని వెళ్లి పిల్లలకు పంచుకుంటాయి. నిత్యం బురదగుంటలో తిరిగే ఈ కొంగ బావకు ఏనాడు చిన్న బురద అంటదు. ఎప్పుడూ మల్లె పూవు వంటి తెలుపు తో నిగ నిగ లాడుతుంటాయి".. ఇట్లా మెల్లె మెల్లెగా ఆయన ప్రకృతిలోకి మనల్ని తీసుకెళ్ళే ఈ కవి ని ఎలా అభినందించడం?

ఈయన సరళ మనోహరమైన వచనానికి బసవేశ్వర రావు కవర్ డిజైన్, అట్లాగే భావానికి తగిన చిత్రాలు పాఠక బాటసారిని మరింత సేద తీరుస్తాయి.

కథ

# తొలి ప్రేమ

**చిలిపితనంతో ప్రేమలేఖ రాయబోయి**
**భంగపడ్డ యువకుని స్థితి తెలుపుతున్న పిన్నం శెట్టి కథ...**



పిన్నం శెట్టి కిషన్

ఇంకో గంటయితే బడి వదిలిపెడ్తరనంగ దంచి కొట్టుడు వెట్టింది వాన. సూత్తుండగనే రోడ్డంత కాలువయి పారవట్టింది. ఇంటెనక పెరట్ల నీళ్లు నిలిచి కుంటయింది. మా పాత, కొత్త ఇండ్ల మధ్యన బురదనీళ్ళు కాళ్లకు అంటకుండ నడవడానికి వేసిన శావాస్ బండలు కొంత మునిగి కొంత తేలి, బావురు కప్పల్లా కనవడవట్టినయి. నిలిచిన నీళ్లు కురిసే వాన చినుకులకు చిట్లి ముత్యాలై ఎగురుతున్నయి. “మేఘమా! మేఘమా! కురవకే ఈ క్షణం..” పాట గున్గునాయించుకుంటూ, ముందు దర్వాజాలకెళ్ళి పోలీస్ స్టేషన్ దిక్కు కనిపించినంత కాడికి చూస్తున్న, గడిగడికీ. దోస్తుల్ని కలువ బయిటికి పోవడానికి తయారుగున్న మా అన్న, నన్ను ఓ కంట కనిపెడ్తున్నడు. వదలని వర్షంలా నా పాట వినీ వినీ విసుగుచెందిండేమో, “ఎవరి కోసంరా! పాడుతున్నవ్?” అన్నడు. పానం జల్లుమంది. దెబ్బకు నోట్ల గచ్చకాయ పడ్డట్లయింది. ఈయనకెట్ల తెలిసిందబ్బాని, గునుగుకుంట, “అదేం లేదన్నా”ని పైకి అన్న. నా దేహ భాష పట్టిచ్చిందా? పాడే పాటా? లేక ప్రేమలో ఉన్న సంగతి ఉత్తగనే తెలిసిపోతుందా బయటికి!?

నా గానం ఆలకించాయేమో మేఘాలు తెరిపిచ్చినయి. వాన తగ్గినా, తొవ్వెంబడినీళ్లు దాటిగా పారుతున్నయి. అన్న బయటకు పోయిండు. నేనే రాజుని.

దర్వాజల నిలబడి చూస్తున్న. ఇద్దరిద్దరు, నల్గురునల్గురు కలిసి జంటలుగా, లేనోళ్ళు ఒంటరిగా వస్తున్నరు, పెద్దబడీలకేల్లి విద్యార్థులు. వాళ్ళ వెనకాల తాత్పరంగా ముచ్చట్లు వెట్టుకుంట నడుస్తున్నరు స్కూల్ ఫైనల్ హీరో హీరోయిన్లు. పదో తరగతికి రాంగనే వయిసోళ్లమైపోయినం అనే టెంపరితనం నెత్తి కెక్కుతుంది. పోయిన యాడాది, నేను సుత గట్ల ఫోజులు కొట్టినోన్నే.

పోలీస్ స్టేషన్ ముందర, రోడ్డు పక్కన పొరపాటుగా పెరిగాయో లేక వాటి పరిమళాల్ని పీల్చయినా పీడనను మరువక పోతారని, కావాలనే ఎదిగాయో ఆకాశమల్లె చెట్లు. నీటి చినుకుల భారాన్ని మోయలేక, కొమ్మను వీడి నేల రాలుతున్న ఆకాశమల్లెలు... పారే నీటికి తడవకుండా ఓణీలంగలను పాదాల వరకు సుతారంగా ఎత్తిపట్టుకుని, సుమనోహరంగా నడిచివస్తున్న పువ్వులోలె అమ్మాయిలు... వాళ్ళ తలలపై మల్లెలు రాలి పడుతుంటే, నలనల్లని కురుల్లో మెరిసే తెలతెల్లని ముత్యాల మల్లెలు. పువ్వులో లేక పువ్వుకాడల వంటి మునివేళ్లో, ఎక్కడ కంది పోతాయోనని నెత్తిపై పడ్డ పువ్వుల్ని సుతిమెత్తగా తీసి, కిందకు జారిడుస్తుండ్రు. నీటి పారకంలో పడి పువ్వులపడవలై వాళ్ళ పాదాల్ని పరికిస్తూ, కాలి గజ్జెల సవ్వడులు వింటూ, పరవశిస్తూ ప్రవహిస్తున్నయి. ఆ గుంపు మా ఇల్లు దాటి పోయేవరకూ తలుపు వెనక నిలవడి, దాటినంక తలుపులు బిడాయించి, వాళ్ళను అనుసరిస్తూ, అనుసరిస్తున్నట్లు తెలియనంత దూరంలో నడుసుడువెట్టిన, తను ఎవరి తాలూకో తెలుసుకోడానికి.

ఆమె నాకంటే ఒక సంవత్సరం జూనియర్. బడి అయిపోయి బయిటికి వచ్చేవరకూ ఎందుకు కనిపించలేదో!? కళ్ళుండీ చూడలేని తనం! మనసుకు పసిగట్టే వరం! ప్రేమ.. ఎవరికీ చెప్పలేని, చెప్పకుండా ఉండలేని, చెప్పినా అర్థంకాని, చేసుకోలేని, హృదయ సలపరం.

బద్ది పోచమ్మ గుడి దాటిండ్రు. పోచమ్మ ఊరేగింపు ఎదురువడ్డది. జమడిక వాయించుకుంట బైండ్లోళ్లు నడుస్తుంటే వెనుక బలిమేకకు తిలకం నుదుట దిద్ది, మేడలో వేప ఆకుల హారం వేసి, అలంకరించుకుని తోలుకస్తున్నరు. నెత్తిన బోనాలు ఎత్తుకుని ఆడోళ్ళు. వెనుక మొగోళ్ళు. వాళ్ళని తప్పించు కుంటూ, వీళ్ళు తప్పిపోకుండా చూస్తూ నడుస్తున్నా. వాళ్ళ వాళ్ళ ఇండ్లల్లకి తోటోళ్లు ఒక్కరొక్కరుగా వెళ్లిపోతుండ్రు. మిగిలింది, ముందు తను, నేను

కథ

వెనుక. మధ్యన, నన్ను గమనించనంత ఎడం. గుండార్సు శివప్రసాద్ ఇంటి సందు మలగకుండా, కోరుట్ల శ్రీనివాస్ ఇంటి ముందు నుండి సక్కగ నడుస్తుంది, పుస్తకాల్ని ఎదనెత్తుకుని.. హత్తుకుని. నమిలకొండ నటరాజ్, ప్రతాప సంతోష్ ఇండ్లు  దాటి, ఎడం వైపు భీమేశ్వరాలయపు వీధి మలుపు తిరగక, మునుముందుకు పెద్దగుడి కేయి పోవట్టింది. కళ్ళు కాపలా కాస్తుంటే తనను, సంకేతాలు అందక, దారి కానరాని కాళ్లు నీళ్లలో అడుగేసినయి. అడుసులోని అడుగు తీసి, అడుగు వేసి, చూసే లోపు, మటుమాయం.

'తప్పిచ్చుకుందిరా తాబేటి బుర్రా!' అనుకుంట, తూము దాకా ఒక్క జంగలో ఎగిరివచ్చినంత పనిజేసిన. తూము నీళ్లకు బొల్లు తోముతున్న అవ్వ, పని ఆపి చూసింది "ఎందన్నట్టు?" 'ఏంలేదన్నట్టు!', ముందుకు కదిలిన. మూడు తొవ్వలు. ఎటువైపు చూసినా బోసిపోయిన దారి.

> **పోలీస్ స్టేషన్ ముందర, రోడ్డు పక్కన పొరపాటుగా పెరిగాయో లేక వాటి పరిమళాల్ని పీల్చయినా పీడనను మరువక పోతారని, కావాలనే ఎదిగాయో ఆకాశమల్లె చెట్లు. నీటి చినుకుల భారాన్ని మోయలేక, కొమ్మను వీడి నేల రాలుతున్న ఆకాశమల్లెలు... పారే నీటికి తడవకుండా ఓణీలంగలను పాదాల వరకు సుతారంగా ఎత్తిపట్టుకుని, సుమనోహరంగా నడిచివస్తున్న పువ్వులోలె అమ్మాయిలు...**



ఎదురుగా అప్పాల చంద్రశేఖర్ ఇల్లు. కుడిఎడమల రామశాస్త్రి రాములు, మధు నాగేందర్ ల ఇండ్లు. ఇంకా అప్పాల ప్రసాద్, దేవరాజు నరహరి, బ్రమ్మన్నగారి రమేష్  ఇండ్లు. అందరూ దోస్తులే. అక్కడ ఉండే చాన్సే లేదు. మరి ఏమయినట్లు!? బహుశా, నేను వెంబడిస్తున్నది తెలిసిందా? కావచ్చు. "స్త్రీల వీపులకు సైతం కళ్ళుంటా" యంటాడు చలం.

ఎవరింట్లోనో దాక్కుని నన్ను గోల్ తిప్పింది పట్టు'వదిలి'న విక్రమార్కుడు, బిక్కమొహం వేసుకుని వెనుదిరిగాడు. అలసట మరవడానికి కథ చెప్పే భుజం మీది శవం లేదు. కానీ, కథ చెప్పుకునే మిత్రుడొకడు దొరికిండు, ఎడ్ల మహేష్ రూపాన. మిత్రుడొక్కడుండిన పదివేల సైన్యంబు. వాస్తవంబు. వివరంగ నా ప్రేమని వివరించిన. వారంలో వివరాల్తో వచ్చిండు. "నువ్వురా స్నేహితుడివంటే" అని, కౌగిలించుకున్న సినిమాటిగ్గా. "అంతొద్దుగానీ ఉడిపిహొటల్ల మసాలా దోశ తినిపించి, పస్టుషోకి సినిమాకు గొంచవో" అన్నడు. అననయితే అన్నడు గానీ, వాడే పెట్టిండు.

మా ఇంటిముందు నుండి స్కూలుకు పోయేప్పుడు, తిరిగి వచ్చేప్పుడు, తనకు తెలియకుండా చూడ్డం, ఓ దినచర్య అయిపొయింది. ఎన్ని రోజులిలా!? ధైర్యం చేసి, ఎదుటపడి, మాట్లడేంత దమ్మ లేదు. ఏదో ఒకటి చేయాలి! ఏం చేయాలో తెలియదు. వ్యక్తావ్యక్త.. అనులోమ విలోమ.. ఆలోచనలు.  అదృష్టంకొద్ది, కొత్త సంవత్సరం రాబోతుంది. మనకు రాసే తెలివుంది. శుభాకాంక్షలో, ప్రేమకాంక్షలో, రాసి మెప్పించక పోతునా! పోతనా! గంటంబు చేబూని, కాయితంబు గైకొని, ప్రారంభించితిన్.. తిని. తిననయితే తింటిని గాని పలుమార్లు.. రాయసంగ రాయడమే రాక.. రాసింది నాకే రోతగా తోచి.. ఛీ! అనుకుని.. ఛి! ఛీ! అనిపించుకోకూడదని.. చించి పడేసి.. లేసి.. బజార్ల పడ్డ గ్రీటింగ్ కార్డ్స్ కోసం. తిరిగి తిరిగి.. చూసి చూసి.. తిరిగి చూసి.. దొరికిచ్చుకున్నానో కవితలాంటి కార్డును, కన్నె హృదయాన్ని గెలుచుకునే ఆయుధంబును. మిగిలిందిక, చేరవేసే ప్రహసనంబు. ప్రత్యక్షంగా ఇచ్చేదా! అంత తెగింపా! మరి మహియే శరణ్యామా! వాడీరాయబారపు భారాన్ని ఒప్పుకోక కోప్పడవచ్చు. చివరకు, తిలక్ అక్షరమైన పోస్టుమేనే మేఘమై మెరిసిండు మదిలోన.

ఇగచూస్కో! పోస్ట్ చేసింది మొదలు,

ఎదురు చూపులు మొదలు. "ఉత్తరాలు ఏమైనా వచ్చాయా?"ని, పోస్టుమేన్ రాములుకు తప్పని రోజువారీ వేధింపులు.

ఓ చల్లని సాయంకాలం, వేడి ముఖం వేసుకుని మహిషాసురుడై వచ్చిండు, మహి. వచ్చుడువచ్చుడే, తిట్ల దండకం అందుకుండు.

"తెలివి లేదుర?"

'ఉందా! లేదా! ఏమో!', లోలోపల అనుమానపు సుడులు.

"పోస్టు చేసేప్పుడు చూసుకోవద్దుర?"

'ఎర్రని డబ్బుల, తెల్లని కవరు, చూసే వేసిన్నే!', మౌనంతో భాషిస్తూ గుర్తుకుతెచ్చుకుంటున్న.

"నువ్వే పంపినవని నీ 'లవ్'కు తెల్సిపోయింది." (లవర్ అనకుండా లవ్ అంటడు వాడు. నిజమే కదా!)

'అయ్యో.. అట్లేట్ల! అయ్యవ్వ పెట్టిన పేరు పెట్టకుండా, ఆకాశరామన్నను కదా అడ్డంగా పొడుగ్గా వాడుకుంది. మరెలా సాధ్యం!? ఈ అసాధ్యురాలు, ఆ డిటెక్టివ్ యుగంధర్ చెల్లెలా? కాకూడదే! తనకు ప్రియురాళ్లు ఉంటారే తప్ప చెల్లెలు ఉన్నట్టు లేదే!', మనసు మాట్లాడుకుంటుంది.

"నేను తిడుతుంటే, ఎదో ఆలోచిస్తున్నవేంది బే! కవిలా".

నాకు రేషం పొడుచుకువచ్చింది, రాంపూర్ కత్తిలా. సినిమాటిక్గా, "అరేయ్! నన్ను ఎన్నయినా అను. నాలోని కవిని మాత్రం తిట్టకురా"అన్న. రోషాన్ని రేషన్ షాపోడికి ఇచ్చి, లోగొంతుకతో, "ఎట్ల దొరికిపోయిన్నో చెప్పరా"ని బతిమిలాడిన.

"కాబోయే మీ వదిన పేరు, అడ్రస్, తనకు పంపిన కార్డుపై ట్రేస్ అయింది. అది పట్టుకుని చూపించి, తిట్టింది. ప్రేమలు, గీమలు ఇష్టం లేదంది".

'గీమలకు నిఘంటువు వెతకాలి'.

"అవున్రా! వదిన అడ్రస్ రాసేప్పుడు కవర్ కింద ఒత్తుకోసం ఈమెకు పంపిన కార్డు పెట్టి ఉంటా". మంచి మరిదన్న మార్కులు కొట్టేద్దామంటే కథ 'నిలువు'తిరిగింది.

మబ్బుల బస్సుకు హైద్రాబాద్ పోవాలే. O.U లొ చదువాలె. (మా ఊరి యువతకు ఉండే ఓ కామన్ ఫాషన్). తన హృద యాన్ని గెలుచుకోవాలే. మన తడాఖా ఏందో చూపాలే. బస్. మనుసు స్థిరం చేసుకున్న.

హత్యాత్మహత్యలు లేవు. యాసిడ్ దాడులు, రివేంజులు లేవుగాక లేవు. ఉన్నదల్లా, కడుపులో బడబాగ్నులు దాచుకున్న సముద్రంలా నేను. మునిగిన టైటానిక్ లా నా తొలిప్రేమనౌక. మా ముగ్గురికి తప్ప మూడోకంటికి తెలియకుండా మునిగింది, ముగిసింది.

# కరెంటు పోతెనే

- కోటం చంద్రశేఖర్



తెల్లార్తె సేనుకి
జెప్పినా ఇనడు
చెప్పులు మారాయిస్తున్నా
వేపపుల్ల ఇర్సుకొని
ఉరుకుడే ఉరుకుడు-
నా పాలబుగ్గల కాడ్నించి పొలమే ఆయన బడి
నా బుద్దెరిగిన కాడ్నించి పొలమే ఆయన గుడి
తోవలోని
ముండ్లేరడు సేండ్ల రాళ్ళేరడు
వొరాల పొంటి గడ్డంలా మొల్చిన
గడ్డిని పీకడు కోస్తడు
నాయ్న నాయ్న
సలైనా వానైనా అక్కడే
వొంటిమీద సోయి లేదుగానీ
పంటమీద పుర్గు పారనీయడు
సెక్కబీర్వాలో కాసులెన్నో ఎరుగడుగానీ
సెట్టు మీద కాయల లెక్కచెప్పగలడు
జ్వరమొచ్చినా
సూదెరుగడు గోలెరుగడు
కష్టాలకి కలతపడడు
భూతల్లి కడుపున తీసి మడిలో నీళ్ళుపోసి
పొద్దుమూక్తది సీకటైతది
అమ్మకండ్లల్ల సంద్రాలు పారినా
కరెంటు పోతెనే కడపలో కాళ్ళు
రైతు రాజసం పనేనంటూ
కాటికెళ్ళేదాకా కాడిమోస్తానంటూ

కవిత



# కళ్ళు ఆకాశాలై.. సముద్రాలై...

రామా చంద్రమౌళి

కళ్ళు మూసుకుంటావో
కళ్ళు తెరిచే.. ఎక్కడో నిన్ను నువ్వు పోగొట్టుకుంటావో
ఒక నిశ్శబ్దం ఆవరించగానే 'ఆట' మొదలౌతుంది
సినిమా హాల్ కావచ్చు.. సముద్రతీర ఆత్మహత్యాస్థలి కావచ్చు
ఒంటరి రైల్వే స్టేషన్‌లో కన్నీళ్ళను మోసుకువెళ్తున్న రైలును
అనార్ద్ర చూపుల్తో చూస్తున్నపుడు కావచ్చు
సరిగ్గా ఆ క్షణాల్లోనే పిడికెడు గుండెలో
ఒక సూక్ష్మరోదసి విస్ఫోటిస్తున్నట్టు తెలుస్తూంటుంది స్థితప్రజ్ఞతో,
తత్వమో, వైరాగ్యమో.. ఒట్టి నిరలంకారంతో
లోపల ఎడారిలా విస్తరిస్తూ
ఏమిటిదంతా.. అన్న ప్రశ్న ఒట్టి శూన్యాకాశమై నిలబడ్తుంది
అంతా హాస్పిటల్ ఔటర్‌యార్డ్‌లో 'మార్చురీ' వాసన,
'విషం' అంటే ..మనిషికి అవసరమైన దానికన్న
ఎక్కువగా ఉన్న ప్రతిదీ విషమే అన్న 'ఎరుక' జ్వలిస్తూండగా
ఎక్కడా దొరకని 'శాంతి' కోసం అన్వేషణ
దొరకదు శాంతి ఎన్ని... ఎంతగా వెచ్చించినా
పిడికెడు మట్టి, పిడికెడు గాలి, రవ్వంత నిప్పు
మొలకెత్తడానికి దోసెడు కన్నీటి తడి కావాలి
నిశ్శబ్దంగా ఆకాశంలోకి..
అమ్మ కళ్ళలోకివలె శూన్యంగా చూస్తున్నపుడు
హృదయంలోనే ఒక స్థూల అంతరిక్షం
ఉందని తెలుస్తూంటుంది
కళ్ళు ఆకాశాలై, మహాసముద్రాలై, వర్షారణ్యాలై..
రూపాంతరతే జీవితమా.?
మట్టి కాలి ఇటుకై.. ఇటుక మళ్ళీ మట్టినే మోస్తూ
ఎదుట విద్యుత్ తీగలపై వరుసగా
కూర్చుని పక్షుల సభ కనబడ్తూండగా
ఫటేల్మని దెబ్బ తగలగానే విచ్ఛిన్నమయ్యే
గాజుగోళీల గుంపులా జీవితమంతా కకావికలు -
జీవితంతోనైనా, మృత్యువుతోనైనా
యుద్ధాలెప్పుడూ ముగియవు.. కొనసాగుతూనే ఉంటాయి
అంతిమంగా.. మళ్ళీ ఒక నిర్భేద్య నిశ్శబ్దం మిగుల్తుంది
సరిగ్గా అప్పుడే ఇక 'ఆట' ముగుస్తుంది
ముగింపు ఎప్పుడూ మరో ఆరంభానికి ఆది బిందువు



నాటి కథ

# దొరా

నాటి తెలంగాణ గ్రామ పరిస్థితుల్ని తన కథాకథనంతో దృశ్యమానం చేసిన నాటి రచన ఆవుల పిచ్చయ్య కథ...



ఆవుల పిచ్చయ్య

గ్రామంలోకి పట్వారీ దగ్గరకు మురాసిలా తీసుకవచ్చాడు. తహశీలు కచ్చేరి జవాను. అప్పుడు 11 గంటలయింది. పట్వారీ నిద్రపోతోన్నాడు. ఇంటి ముందు నిలబడి, "మహరాజ్ మహరాజ్," అని కేకలు వేసాడు జవాను. నిద్రలో వున్న పట్వారీ ఉలికిపడి లేచి కండ్లు తుడుచుకుంటూ బయటికి వచ్చాడు. 'మహరాజ్ ఎల్లుండి తహశీలుదారుగారు దొరా వస్తున్నారు. సరియైన ఇంతెజాం చెయ్యాలని, మురాసిలా చేతికి యిచ్చి వేరే గ్రామం వెళ్ళినాడు జవాను.

పట్వారికి ఆ మాట వినేసరికి కడుపులో గుండు పడ్డట్లు అయింది. ఆ రాత్రి నిద్ర పట్టలేదు. పహని నె. 4 తఖాలు మొదలగు తన దస్తరం మొత్తం తిర్గేసి మళ్ళేసి రాత్రంతా చూడటం మొదలు పెట్టినాడు. తెల్లవారింది. ఇంటిముందు అరుగు మీద కూర్చున్నాడు పట్వారి. తర్వాత మస్కూరిని పిలిపించి తహశీలుదారుగారు వస్తూ వున్నారు. రేపు జాంపొద్దు ఎక్కేవరకు అంతా ఇంతేజాం కావాలి. లేకుంటే నీ వొళ్ళు బద్దలవు తుంది సుమా, అని బెదురుపెట్టి పనివాండ్లను మొత్తం పట్టకరాపో అని మస్కూరిని తోలించినాడు.

ఇంతలో పోలీసు పటేలు, మాలి పటేలు, పట్వారి ముగ్గురు కల్సుకున్నారు. వారు ముగ్గురు రహస్యం మాట్లాడుకొని ఒక నిర్ణయానికి వచ్చి కార్యక్రమం మొదలు పెట్టినారు. హరిజనులు, చాకలివారు, మంగలివారు, కుమ్మరివారు, వడ్రంగులు, మొత్తం గుంపులు చావడి దగ్గరికి చేరారు. చావడిలో పటేలు, పట్వారీలు ముగ్గురు త్రిమూర్తుల్లాగా కూర్చొని మొదలు హరిజనులను పిలిచి, "అరేయి అధికారి రేపు దొరా వస్తున్నాడు. జాగ్రత్తతో పని చెయ్యాలి సుమా? పొండి మన గ్రామానికి రోడ్డుకు 5 మైళ్ళ దూరం వుంటుంది. త్రోవ తప్పిపోతాడు అధికారి కాబట్టి రోడ్డు నుంచి మన గ్రామం వరకు సున్నం వేసిన రాళ్ళు గుర్తులు పెట్టాలి" కొందరిని రాళ్ళకు పంపినాడు. మరికొందరిని హరిజనులను పిలిచి "మన జమీందారుగారు అధికారికి దావత్ ఇస్తాడోయేమో మీరు పోయి మన చెర్లో తుమ్మచెట్టు నరికి పొయ్యిలోకి కట్టెలు తెండి. అవి పచ్చిగా వుంటే ఏ రైతు చెలకలలో ఎండిన చెట్లు వుంటే అవి కొట్టుకొని తెండి" అని పంపినాడు.

మరికొందరు హరిజనులను పిలిచి చావడికి చుట్టు మండడి కట్టాలి. ప్రతి రైతు దగ్గర చొప్ప వసూలు చేసి తొందరగా ప్రయత్నం చెయ్యండి అని వెళ్లగొట్టినాడు. తర్వాత చాకలివారిని పిలిచినాడు. "అరేయి మీరు కొందరుపోయి ఆ హరిజనులు బాటకు పెడుతున్న రాళ్ళకు సున్నం వెయ్యండి. మరికొందరు మంచాలు తీసుకురండి. చావడిలోపల పర్దాలు కట్టటానికి కొన్ని దుప్పట్లు తెండి," అని పంపినాడు. తర్వాత మంగలివారిని పిలిచి "మీ దగ్గర వున్న కత్తులు మొండి పడితే తొందరగా సాన పట్టించుక రాండి. క్షవురాలు చెయ్యాల్సి వుంటుంది. తొందరగా చేసుకరాండి," అని పంపినాడు. తర్వాత కుమ్మరివారిని పిలిచి, "అరేయి మీరు కొందరు పోయి కుండలు తీసుకురండి. కొందరు ఇప్పుడే పొయ్యిల పెట్టి ఒక పెద్ద కుండెడు నీళ్ళు బాగా కాచి చల్లార్చండి. అవి చల్లారిన తర్వాత చావట్లో పెట్టండి. అధికారి యీ నీళ్ళు త్రాగరు" అని పంపినాడు. పట్వారి మస్కూరిని పిలిచి, "ఏమోయి మొన్న గొర్రెపిల్ల ముత్తిగాడు తెచ్చిండు గదా? మరి యీసారి వంతు ఎవరిదో తెల్సుకో. ఒక గొర్రెపిల్లను తీసుకొని, కొన్ని కోడిపిల్లలని గూడా సంపాదించి, యీసారి పాలు పెరుగు ఎవరు తెస్తారో తొందరగా ఇంతేజాం చేసి రా పో అని పంపినాడు పోలీసు పటేలు, కోమట్లను పిలిచి "మీ దగ్గర సరియైన సామానులు వుంచండి. లేకుంటే బస్తికి పోయి సామాను తీసుకురండి. నేను చిట్టీలు వ్రాస్తే మాత్రం కాళి చేయవద్దు సుమా? తర్వాత మీ యిష్టము," అని బెదిరించి వెళ్ళగొట్టినాడు మాలీ పటేలు.

ఈ తహశీలుదారు దేనికి దొరా వస్తున్నాడురా అని ఆలోచిస్తే పంటలు

పండక పొడైనందుకు లెవీ కుష్ ఖరీదు మాఫీ కావాలని దరఖాస్తులు పెట్టుకున్న రైతుల పొలములు చూడటానికి దౌరా వస్తున్నాడని తెలిసింది. అప్పటికే రైతులు ఆకలిమంటకు తాళలేక కొన్ని పొలాలు పండినంతవరకు కోసి కొన్ని జీతగాండ్లకు యిచ్చి తక్కినవి వారు వాడుకొన్నారు. ఆ గింజలు కూడా అయిపోయినవి. తహశీలుదారు దౌర వచ్చేవరకు రైతుల యిండ్లలో గింజలు లేవు. కూలినాలి మాత్రం చేసుకుంటున్నారు. దొంగలు పడ్డ ఆరునెలలకు కుక్కలు మొరిగినట్టుగా వుంది. ఇది చూస్తే. అని మూలుగుకుంటూ పోయే ఒక రంగయ్యనే రైతును చూచాను నేను. అతనిని దగ్గరికి పిలిచి 'ఏమిటియ్యాల....' అని అడిగితే తెల్సిన దౌర హడావిడి అంతా పూసగుచ్చినట్టు చెప్పసాగాడు. ఇంతలో మస్కూరి వచ్చి ఆ రైతును తీసుకువెళ్ళినాడు. 'మళ్ళీ కలుస్తానండీ' అని రంగయ్య వెళ్ళిపోయాడు..

నేను గ్రామం బయటికి వెళ్ళి నిలబడ్డాను. అటువైపు చూచేసరికి దూరం నుంచి ఒక పెద్ద పెండ్లివారు గుంపులు గుంపులుగా వచ్చినట్టు వస్తూ వున్నారు. ముందు వున్న ఆ హరిజనుల గుంపు, వారి వెనుక గల్లుగల్లున మ్రోగే కంచుగంటల జమీందారిగారి బండి. ఇరుప్రక్కల జవానులతో వెనుకముందు పెట్టి బేగారీలతో నడుమ వస్తూ వున్న బండి లోపల ఎవరున్నారా అని చూచేసరికి బాటా కంపెనీ బూట్లు, దాని మీద తొడిగిన సన్నకాళ్ళలాగు, దానిపై ట్వీడ్ శేరువాని, లోపల నుంచి వ్రేలాడుతున్న ఎర్రని రేష్మిలాగు నాడ, సన్ననిగాలిలో అటుయిటు కొట్టుకొనుచున్న నెత్తిమీది శేరిగోలా టోపి, సూర్యుని కిరణాలకు ధగధగ

ఇంతలో పోలీసు పటేలు, మాలి పటేలు, పట్వారి ముగ్గురు కల్సుకున్నారు. వారు ముగ్గురు రహస్యం మాట్లాడుకొని ఒక నిర్ణయానికి వచ్చి కార్యక్రమం మొదలు పెట్టినారు. హరిజనులు, చాకలివారు, మంగలివారు, కుమ్మరివారు, వడ్రంగులు, మొత్తం గుంపులు చావడి దగ్గరికి చేరారు. చావడిలో పటేలు, పట్వారీలు ముగ్గురు త్రిమూర్తుల్లాగా కూర్చొని మొదలు హరిజనులను పిలిచి, "అరేయి అధికారి రేపు దౌరా వస్తున్నాడు. జాగ్రత్తతో పని చెయ్యాలి సుమా? పొండి మన గ్రామానికి రోడ్డుకు 5 మైళ్ళ దూరం వుంటుంది.



మెరయుచున్న నాలుగు వ్రేళ్ళ వుంగరాలతో నిండిన చెయ్యి, మెత్తని దూది పరుపు మీద బండి నిండా పండుకున్న విగ్రహం. అందులో విసనకర్ర క్రిందికి మీదికి జానెడు మూరెడు ఎగురుచున్నది. అది చూచేసరికి నాకాశ్చర్యం కలిగినది. బాగా చూచేవరకు తహశీలుదారుగారు విసనకర్రతో విసురుకుంటు నిద్రపోయి విసనకర్ర బొర్ర మీద పెట్టుకున్నాడు. అప్పుడు గ్రహించాను. తహశీలుదారు వీరేనని. ఒకేసారి నాకు మాయలోకం జ్ఞప్తికి వచ్చింది. నేను వెనుదిరిగి యింటికి వెళ్ళాను.

చలిజ్వరము వచ్చి మూడు రోజుల వరకు ఇంట్లో నుండి బయటకు వెళ్ళలేదు. నాల్గవ రోజు అరుగుమీద కూర్చున్నాను. ఇంతలో 'తప్పకుండా ఇవ్వాలి' అని బాధపెడుతున్నడు జవాను రంగయ్యను. ఆ యిద్దరు కలిసి వస్తూ వున్నారు. రంగయ్యను కలిసాను. బిక్కమొగము పెట్టుకొని వచ్చాడు పాపం. "ఏమయ్యా అలా వున్నావు" అని అడిగాను. 'తహశీలుదారుగారి దౌరా పూర్తి అయింది. నాకు దయ్యం పట్టింది' అని వెంట వున్న జవానును చూశాడు రంగయ్య. 'నీవు అలా చిన్నపోయినావు ఎందుకని' అడిగాను. 'నేను తహశీలుదారుగారి దర్శనం చేసుకునేసరికి వెంటనే జ్వరం పట్టింది. నేటికి నాలుగురోజులయింది. ఇవాళ కొంచెము నెమ్మది అయింది. నీ కొరకే ఎదురు చూస్తున్నాను. కూర్చోపోదువుగాని" అని రంగయ్యను కూర్చోపెట్టి వెంబడి వున్న జవానును గూడా ఒక బీడిముక్క యిచ్చి కూర్చొ పెట్టినాను.

దౌర తనక్కలో ఏమి జరిగిందని రంగయ్య రైతును ప్రశ్నించాను. "ఏం చెప్పాలండి. తహశీలుదారు వచ్చి మొదటి రోజు పూర్తిగా విశ్రాంతి తీసుకున్నాడు. రెండవరోజు జమీందారిగారి యింట్లో దావతుకు పోయినాడు. ఆ రోజు అంతా జమీందారుగారితో మాట్లాడుకుంటూ రాగాల పెట్టె (గ్రామఫోన్) వినుకుంటూ వున్నాడు. అధికారికి మా బాధలు చేసుకొనుటకు లోనికి వెళ్ళనియ్యలేదు. మూడవరోజు ప్రయాణమై వెళ్ళిపోతుంటె వెంబడి, గ్రామంలో వున్న త్రిమూర్తులు (పోలీసు పటేలు, మాలి పటేలు, పట్వారి) తోడయ్యారు. మొదట నా పొలము తనక్కికి తీసుకువెళ్ళారు. బావి మొదట వున్న నాలుగు ఎకరాలలో 8 వంతున వున్న మడి మాత్రం పచ్చపచ్చగ వుంది. తక్కినవన్ని రోగాలు తగల ఉండి పోయినవి. బండి వచ్చి నా బావి మొదట నిలబడింది. మొదటి పొలం మాత్రం బండిలో వున్న తహశీలుదారు చూచాడు. ఎండిపోయిన పొలం చూడటానికి బండిలో వున్నాడు. కాబట్టి బండికి వున్న ఇరుపక్కల తడకలు అడ్డంగా వున్నాయి. ఆ కొద్ది భాగము చూచి అరే బాగానే వుంది అని వ్రాసుకున్నాడు. బండి నుంచి క్రిందికి దిగలేదు. పొలమంతా చూడలేదు. తర్వాత చెరువు క్రింద వున్న జమీందారుగారి పొలాలు చూడటానికి చెరువు చివర నుంచి బండిని తీసుకు వెళ్ళారు త్రిమూర్తులు. చెరువు చివరకు వున్న నీళ్ళు అందకుండా వున్న కొద్ది పొలాన్ని మాత్రం బండిలో వున్న తహశీలుదారు చూచి అరెరె ఎండిపోయింది, అని వ్రాసుకున్నాడు. తర్వాత వెళ్ళుతానని తహశీలుదారు జమీందారి చేతులో చెయ్యి కల్పుకొని వెళ్ళిపోయినాడు. నిజంగా చూచినట్టు అయితే జమీందారు పొలాలు అన్నీ బాగానే వుండి తుంగమడి చూచి వారికి మాఫి యిచ్చారు. పొలాలు మొత్తం చూడకనే వసూలు కొరకు నాకు వెంబడి యీ జవానును యిచ్చారు" అని విచారంతో చెప్పసాగాడు.

**ముందు వున్న ఆ హరిజనుల గుంపు, వారి వెనుక గల్లుగల్లున మ్రోగే కంచుగంటల జమీందారి గారి బండి. ఇరుప్రక్కల జవానులతో వెనుకముందు పెట్టి బేగారీలతో నడుమ వస్తూ వున్న బండి లోపల ఎవరున్నారా అని చూచేసరికి బాటా కంపెనీ బూట్లు, దాని మీద తొడిగిన సన్నకాళ్ళలాగు, దానిపై ట్వీడ్ శేరువాని, లోపల నుంచి వ్రేలాడుతున్న ఎర్రని రేష్మిలాగు నాడ, సన్ననిగాలిలో అటుయిటు కొట్టుకొనుచున్న నెత్తిమీది శేరిగోలా టోపి, సూర్యుని కిరణాలకు ధగధగ మెరయు చున్న నాలుగు వ్రేళ్ళ వుంగరాలతో నిండిన చెయ్యి, మెత్తని దూది పరుపు మీద బండి నిండా పండుకున్న విగ్రహం.**

'మరి నీవు చెప్పుకోలేకపోయావా' అని నేను ప్రశ్నించగా, "వెంబడి వున్నవారు చెప్పనివ్వలేదు. అంతా మేము చెపుతాములే అని అన్నారు. నాకు అంతటితోనే సంతోషమయింది.

"అదికాదు నేను గూడా వెంబడి వస్తామనుకుంటే చూచేవరకు నాకు జ్వరము పట్టింది. నీకు దయ్యం పట్టింది."

"దౌర అంటే నాకేం తెల్సు!" "అందుకే బీదలది వదల తీస్తున్నారు పులుసు." "కాదండి మరి వీరు యీ మాదిరి చేస్తుంటే ప్రభుత్వము చూడదా?" గుడ్డికన్ను మూసినా ఒకటే, తెరిచినా ఒక్కటే." "ప్రభుత్వం గూడా అంతే."

"ఇంత మాత్రానికి యీ దౌర హడావుడి ఎందుకండి?"

"నీవే చూస్తున్నావు కదా ఒకవైపు మా పంటలు పాడయిపోయినవి లెవీగల్ల ఇవ్వలేము మా పంటలు వచ్చి చూడండని దరఖాస్తులు పెట్టుకుంటే జమీందారి యింట్లో విందులు ఆ రాగాలు భోగాలు చేసుకొనటమేగాని, వారికేమి కడుపుమంట.

జమీందారి లెవీ మాత్రం మాఫీ అయింది. అధికారి పొట్ట నిండింది. పైగా నీ పొట్టేగా మాడింది. "అవునండి బాగా చెప్పారు. పేరు గంగానమ్మ. త్రాగబోతే నీళ్ళులేవు. చక్కగా పండిన జమీనుదారి పొలానికి లెవీ మాఫీ. వారికి దరఖాస్తు పెడితే లెవీ కొరకు ఈ జవానును వసూలు చెయ్యమని తగిలించారు. గడ్డం కాలి పరుగెత్తుతుంటె చుట్టకు నిప్పు ఇమ్మని వెంటబడినట్టున్నది."

పుస్తక సమీక్ష

## Essential Items: Stories from a Land in Lockdown




కరోనా, లాక్‌డౌన్.. గత ఆరు నెలలుగా మానవుల రోజు వారి జీవితంలో భాగంగా మారాయి. అయితే లాక్ డౌన్ కాలంలో మానవ జీవితానికి సంబంధించిన అనేక ఆసక్తికరమైన అంశాలు వెలుగుచూశాయి.

లాక్‌డౌన్‌లో జరిగిన వివిధ సంఘటనలను 'Essential Items: Stories from a Land in Lockdown' పుస్తకంలో, పది కథలుగా వివరించారు రచయిత ఉదయన్ ముఖర్జీ. వలస కార్మికులు, ఉద్యోగులు, యువకులు... ఇలా రకరకాల మనుషుల జీవితంలో లాక్‌డౌన్‌లో జరిగిన సంఘటనలు, సంఘర్షణలు, సంభాషణలను రచయిత ఈ పుస్తకంలో చక్కగా వివరించారు. ఈ పది కథల ద్వారా మనుషుల మధ్య బంధాలను, జీవితంలోని ఎత్తుపల్లాలను, సమాజంలోని వివిధ వర్గాల మధ్య ఉన్న సంబంధాలను రచయిత ఈ పుస్తకంలో పొందుపరిచారు.

## Courage, Conviction, Controversy and Cricket




భారతదేశంలో క్రికెట్ ఆటకు ఉన్న ఆదరణ అంతా ఇంతా కాదు. టెస్టులు, వన్డేలు, టీ 20లు. ఫార్మాట్ ఏదైనా మ్యాచ్ వస్తుందంటే చాలు, అభిమానులు టీవీలకు అతుక్కుపోతుంటారు. Courage, Conviction, Controversy and Cricket పుస్తకంలో రచయిత వేదం జైశంకర్ క్రికెట్ ఆటకు సంబంధించిన అనేక కోణాలను విశ్లేషించారు. మైదానంలో ఆట సమయంలో జరిగిన అరుదైన, ఆసక్తికరమైన సంఘటనలతో పాటు, తెరవెనుక జరిగే సంగతులను ఈ పుస్తకంలో వివరించారు. మ్యాచ్ ఫిక్సింగ్, మన్కడింగ్, అండర్ ఆర్మ్ బౌలింగ్ వంటి వివాదాస్పద అంశాలను సైతం రచయిత ఇందులో వివరించారు. దేశాన్ని గెలిపించేందుకు పలువురు ఆటగాళ్ళు చూపిన అసమాన ప్రతిభను, ఆటగాళ్ళు, కోచ్‌ల మధ్య సఖ్యత, వివాదాలను రచయిత జైశంకర్, ఈ పుస్తకం ద్వారా క్రీడాభిమానులతో పంచుకున్నారు.

## Full Spectrum: India's Wars, 1972-2020




భారత వైమానిక దళం వైస్ మార్షల్ అర్జున్ సుబ్రహ్మణ్యం రచించిన Full Spectrum: India's Wars, 1972-2020 పుస్తకంలో నాగ, మిజో తిరుగుబాటుల నుండి శ్రీలంక, కార్గిల్ మరియు డోక్లాంలో భారత సైన్యం ప్రయత్నాల వరకు అనేక ఆసక్తి కరమైన అంశాలను వివరించారు. 1972 నుండి 2020 వరకు భారత సైన్యంలో వచ్చిన పురోగతి, సంఘర్షణ, సాధించిన విజయాలను రచయిత ఇందులో పొందుపరిచారు. అర్జున్ సుబ్రహ్మణ్యం గతంలో రచించిన India's Wars: A Military History, 1947-1971 పుస్తకానికి కొనసాగింపు Full Spectrum: India's Wars, 1972-2020. ఈ పుస్తకంలో రచయిత భారత సైన్యం పటిష్టమైన విధానాన్ని, సవాళ్లను ఎదుర్కొన్న సంఘటనలను ఎంతో ఆసక్తికరంగా వివరిస్తూ, పాఠకుడు తన రచనలతో ప్రయాణించేలా చేసాడు.

## The Case for Degrowth




గతంలో ఎన్నో వ్యాధులు ప్రపంచాన్ని ఇబ్బందులకు గురిచేసినా, ప్రస్తుత కరోనా మహమ్మారి వేగంగా, అత్యంత తీవ్రంగా ప్రపంచాన్ని ప్రభావితం చేసింది. వివిధ అంశాలు, వివిధ రంగాలతో పరస్పరం అనుసంధానమైన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ యొక్క బలహీనతలను కరోనా వైరస్ బహిర్గతం చేసింది. అయితే ప్రస్తుతం ఉన్న వ్యవస్థలు, తిరిగి సాధారణ జనజీవనానికి సరిపడా ఉత్పత్తిని, పురోగతిని సాధించగలవా..అనే ప్రశ్న అందరి మెదళ్లనూ తొలుస్తుంది. ఒకవేళ సరిపడా పురోగతి సాధించకపోతే, అల్ప స్థాయి వృద్ధితో, జీవనం సాగించడం ఎలా అనే అంశాల ప్రాతిపదికన The Case for Degrowth పుస్తక రచన సాగింది. వ్యవస్థల్లో వృద్ధి తిరోగమనంలో ఉన్నా, తక్కువ స్థాయి ప్రమాణాలతో ప్రజలు జీవనం సాగిస్తూనే.. సమానత్వం, సంతోషం, సహనం వంటి లక్షణాలతో సమాజం ఉండాలని రచయితలు ఈ పుస్తకంలో వివరించారు. ప్రస్తుతం సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ఉన్న లోటుపాట్లను సైతం రచయితలు ఇందులో పొందుపరిచారు.

సమాజం

# పొట్లపల్లి రామారావు కథల్లో నాటి తెలంగాణ

పొట్లపల్లి రామారావు కథల్లో తెలంగాణ గ్రామాల స్థితి వివరించే వ్యాసం...



డా॥ కాంచనపల్లి గో.రా.

వరంగల్లు జిల్లాలో ధర్మ సాగరం మండలంలో తాటికాయల గ్రామంలో భూస్వామ్య కుటుంబంలో పొట్లపల్లి శ్రీనివాస్ రావు దంపతులకు 1917 నవంబర్ 20న జన్మించిండ్రు. పొట్లపల్లి పదవతరగతే చదివినప్పటికీ, ఉర్దూ హిందీ ఆంగ్ల భాషలో మంచి పట్టు సంపాదించిండు.ఈయన వట్టికోట, కాళోజి సమకాలీనుడు.

పొట్లపల్లి రామారావు కవి, నాటక కర్త. ఆయన బాల్యం నుండి ప్రకృతి ప్రేమికుడు. తన పాలేర్లతో భేద భావం లేకుండా ప్రవర్తించిన సమతా వాది. జనసామాన్యంలో ఒకడిగా జీవించడం ఆయన కిష్టమైన పని. స్వాతంత్ర్య సమర యోధుడుగా జైలుకు వెళ్ళినవాడు.

కాళోజీ రామేశ్వరరావు సహకారం వల్ల ఆయన లో రచనా కళ వికసించింది. ఆయన ఆత్మ నివేదన, చుక్కలు మెరుపులు, అక్షర దీప్తి, నాలో నేను వంటి కవితా సంపుటాలను జైలు కథలు, ఆచార్యుల కథలు, వంటి కథలు ప్రచురించిండ్రు. నీలవేణి అనే అసంపూర్తి నవలను రచించిండ్రు.

పొట్లపల్లి రామారావు కథల్లో ప్రధానంగా నాటి గ్రామీణ వాతావరణం కళ్ళముందు కదలాడుతది. గ్రామీణ సమాజంలో గ్రామస్థాయి పాలకుల ఆడంబరాలు, అమానుషాలు, డొల్లతనం, అదే విధంగా పేదవాని ఆకలి, దైన్యం బానిసత్వం, సజీవంగా చిత్రించిండ్రు.

ఈయన రాసిన మా గ్రామం గాని, ఊరికి పోదాం గాని, నిజానికి కథలు అనకూడదు. మనముందు సాక్షాత్కారించిన వీడియో చిత్రాలు అనాలి. ఇందులో ప్రతి ఒక్కరూ, వాళ్ళ వాళ్ళ గ్రామాలతో 'identity' పొందుతరు. ఆయన గ్రామంలో ప్రవేశించగానే వాగు కనిపిస్తుందట. వాగు గురించి ఇట్లా రాస్తరు.

"ఇది మా ఊరి వాగు. ఇది మా గ్రామానికి జీవనది. దీని కాలవల మూలాన మా పొలాలు పండి మా క్షుత్తు ను బాపుతాయి. నిత్యం మా గ్రామ స్త్రీలు తోడుకొని వచ్చే దీని చల్లని నీరు మా దాహాన్ని తొలగిస్తాయి. దీని నీరాల మునుకులాడి మా నిత్య శ్రమను తొలగించుకుంటాము. ఇది మా పిల్లల క్రీడాస్థలము. వయసు మళ్ళిన మా పెద్దల విశ్రాంతి స్థలము .ఇది మా ఊరు వచ్చే వారిని మందహాస వదనంతో ఎదుర్కొని మంచి నీరు అందిస్తుంది''. ఇట్లా సాగిపోతుంది ఆయన స్వభావ రమ్యమైన చిత్రీకరణ. గ్రామం నుంచి వచ్చిన ప్రతి వ్యక్తికి వాళ్ళ ఊరు గుర్తుకొస్తది. ఏలవాడు (కాపలాదారు) కరణం, కోమటి నాగయ్య, మొదలైన గ్రామానికి వెన్నెముక లాంటి పాత్రలన్నీ ఇందు లో కనిపిస్తవి .ఆనాటి గ్రామీణ వ్యవస్థ మరోసారి స్మరణకు వస్తది.

అటువంటి ఊరిలోనే ఉన్న నాటి బళ్లను చిత్రించిన పొట్లపల్లి స్వేచ్ఛ అనే కథ ఇందులో ఉంది.

పంతులు అంగవైకల్యం కలవాడైనా అతనిచ్చే శిక్షలు భయంకరం. కర్ర ఏ విద్యార్థి ముందుకు విసిరితే ఆ విద్యార్థి శిక్షార్హుడని పంతులు నిర్ణయం అన్నమాట. ఆ విద్యార్థి శిక్ష కోసం ఆ కర్ర తీసుకొని పంతులు దగ్గరకు రావాలె. ఇక వాడి చేతిలో నిప్పులవాన కురుస్తుంది.

ఊరి దొర కొడుకైనా దీనికి అతీతుడు కాదు.

"ఎక్కడికి బోయినవురా ఎనుబోతు?'' అని అడిగేవాడు పంతులు.

"ఏంది పంతులూ, ఎనుబోతు అంటవ్,'' అని దొర కొడుకు పంతులు దిక్కు గుడ్లుదీసి చూసేవాడు.

"నీవు ఇటు రా,''

కదలక పోయేవాడు, తన స్థానం నుంచి పంతులు కోపంగా వాని చెవి పట్టేవాడు,

"చెవి విడువు పంతులూ'',

వాడు ఎదురు మాట్లాడు తుంటే ముఖం చూసేవాడు పంతులు.

అప్పుడపుడు దొర వచ్చి పంతులుకు బాసటగా నిలిచేవాడు. పంతులు వాని

కథ

బుగ్గలు పిండి ఎడా పెడా తగిలించేవాడు.

పంతులుకు గుడ్డు చేపలు ఇలాంటివి చాలా ఇష్టం. అవి వండుకున్న రోజు పంతులుకే కాదు, విద్యార్థులకూ సెలవే, పంతులు నిమిషానికో తడవ పొయ్యి దగ్గరకు పొయ్యి వస్తుండేవాడు.

ఇంకా పిల్లలు పంతులును ప్రసన్నుని చేసుకోవడానికి పడే తాపత్రయం ఇంతా అంతా కాదు. ఒక్కోసారి పిల్లలు పంతులు నేడిపించేవారు కూడా. ఆయన గుర్రం తోకకు కమ్మ కట్టి, అది పారి పోవడం, పంతులు దాన్ని వెతకడానికి పడే శ్రమ, తరువాత ఆ పిల్లలు ఎంత అమాయకంగా నటించినా, పంతులు గుర్తించడం, వాళ్ళు దెబ్బలు తినడం, ఇవన్నీ ఆనాటి ఖానిగి బడి పరిస్థితులు.

ఇంకా ఈయన కథల్లో విద్యాధికారులకు బెదరని పంతుళ్ళు కూడా కనబడుతరు.స్థాన బలం వీళ్ళను అట్ల ప్రేరేపిస్తది.

ఆ కాలంలోని గ్రామాలలో వెట్టి భయంకరంగా ఉండేది. "న్యాయం" అనే కథలో పై అధికారుల పేరు చెప్పి ఒక జవాను ఏ విధంగా దోచుకున్నడో చెపుతడు. గ్రామీణ వ్యవస్థలో అధికారులు ఏమడిగినా ప్రజలు ఇవ్వాల్సిందే. కోమటివాళ్ళు భోజన దినుసును, వ్యవసాయ దారులు కోళ్ళు ఇట్లా ఏమడిగినా ఇవ్వవలిసిందే. కోమటివాళ్ళు అవసరమైనపుడు అబద్దాలతో నాటి జవానులను లేక అధికారులను మోసగించే వైనం కూడా ఉంది.

అధికారులకు ప్రజలు వంతు కోళ్ళు ఇచ్చేవారు. అందులో మాదిగ, కరణం ప్రధానమైన పాత్ర. కరణం గుర్తుకు తెచ్చుకొని చెబితే మాదిగ వెళ్ళేవాడు. చివరికి బిచ్చగాళ్ళ దగ్గరనుండి కూడా మామూలు గుంజడం జరిగేది.

రచయిత ఈ బిచ్చగాళ్ళను క్రిమినల్ ట్రైబ్స్ అయి ఉండేవారని చెబుతాడు. ఈ లోకువ అధికారులకు చాల విధాలుగా ఉపయోగపడేది. ఎన్నడో పూర్వం వాళ్ళ తాత లో ముత్తాతలో బందిపోట్లు అయినందుకు, చాపలు అమ్ముకొని, వ్యవసాయం చేసుకొని జీవించే వాళ్ళ సంతతులు కూడా 'criminal tribes' గానే ఉండి పోయారు. ఇక ఇటువంటి కష్ట జీవులనుండి సొంత లాభం కోసం 'crime' చేసే ఉద్యోగులు, న్యాయ మూర్తులుగా చలామణి అవుతారు. కొందరిలో ఉండే నిస్సహాయత అజ్ఞానం, లోకువతనం, మరొకరికి వాళ్ళ మీద అధికారానికి దారి తీస్తుంది.

"న్యాయం" కథలో ఎదురు చూసే అధికారి ఎంతకు రాడు. మధ్య జవానే అధికారి పేరు చెప్పి అన్నీ వసూలు చేస్తాడు. చివరికి అధికారి మోటారుపై వచ్చి ప్రజలతో పాటు ఎదిరి చూస్తున్న కరణంతో సంతకం తీసుకుంటాడు. అధికారి మోటారుపై వెళ్లి పోగానే తాను కాగితం పై చదివిన విషయం కరణం అందరికీ చెబుతాడు.

"దొరగారి బిడ్డ పెళ్లి"

ఈ మాటతో ప్రజలంతా నివ్వెర పోతారు.

అంటే దొరగారి బిడ్డ పెళ్లికి తామెన్ని కోళ్ళు, గొర్రెలు ఇచ్చుకోవాలో. ఒక భయం ఆవరిస్తుంది వారిని.

ఆ కాలం జైలు గురించి రెండు కథలున్నాయి. విముక్తి - జైలు.

బయటి ప్రపంచానికి దూరంగా ఉంటూ జైలు లోనే కడతేరే ఆ ఖైదీలు అడిగితే చాలు, మొత్తం ఏకరువు పెట్టేవారు. పార్టీ దారు జయానికి, తమ అపజయానికి కారణమైన లంచాలు, సిఫారసులు పోగా హైకోర్ట్ సూత్రాలతో సహా సమన్వయం చేసి చెప్పేవాళ్ళు. ఏదో విధంగా నిర్బంధం నుండి బయట పడాలని ఆతురతతో కనబడ్డ వాడికల్లా తమ దుఃఖం వెళ్ళబోసుకునేవారు. అదే లేకపోతే చాలామంది పిచ్చివాళ్ళై పోయేవారు. తన పూర్వీకులు ఇచ్చిన కొంత నేలను దురాక్రమణ చేసుకున్న యజమాని తన పూర్వపు బాకీ కోసం తనపై నేరం మోపి తనను జైలు పాలు చేసిన అమాయకమైన రాంసింగ్ అనే ఖైదీ ఈ బాధితులకు ప్రతినిధి. జైళ్ళ స్వరూపం రచయిత అతని నోటనే ఇట్లా వ్యక్తం చేస్తాడు.

"శిక్ష వద్దనను. కాని నన్ను శిక్షించిన వాని నేరానికి మీ బోటి వాళ్ళని శిక్షించాలని న్యాయ సూత్రాలు కల్పించిన వాని నేరానికి, అసలు నా బోటి వాళ్ళ మీద నేరాలు మోపేవాళ్ళకి దండన ఉన్నప్పుడు నన్ను దండించండి. కాని శాసనపు పురులనుండి తప్పించుకొని నా బోటి ధనహీనులు, యుక్తి హీనులు, ఏ కొందరినో ఈ చీకటి గదుల్లో త్రోసి న్యాయ పాలన సాగిస్తున్నామని చాటుకొన్నవి మీ ప్రభుత్వాలు, అది కేవలం బూటకం. "జైలు" అనే మరో కథ లో సమాజం అనే మరో జైలు కన్నా ప్రభుత్వాలు కల్పించిన ఆ జైలే నయం అనే భావం స్ఫురింపజేస్తాడు.

సోములు అనే వ్యక్తి దరిద్రం తోనూ, కుటుంబం పిల్లలతో, భార్యతో చాలా బాధలు పడి, పెద్దమనుషులతో ఇబ్బంది పడి,చివరికి నేరం మోపబడి, జైలుకెడతడు. జైలు కెళ్లినందుకు కొంత బాధ పడ్డా, తరువాత బయట సమాజం కన్నా, జైలే బాగుందని అర్థం చేసుకుంటాడు.

శిక్షా కాలం అయిపోయి బయటకు వెళ్ళాక మళ్ళీ కావాలనే నేరం చేసి జైలుకు వెడతాడు.

> **"ఇది మా ఊరి వాగు. ఇది మా గ్రామానికి జీవనది. దీని కాలవల మూలాన మా పొలాలు పండి మా క్షుత్తును బాపుతాయి. నిత్యం మా గ్రామ స్త్రీలు తోడుకొని వచ్చే దీని చల్లని నీరు మా దాహన్ని తొలగిస్తాయి. దీని నీరాల మునుకులాడి మా నిత్య శ్రమను తొలగించుకుంటాము. ఇది మా పిల్లల క్రీడాస్థలము. వయసు మళ్ళిన మా పెద్దల విశ్రాంతి స్థలము .ఇది మా ఊరు వచ్చే వారిని మందహాస వదనంతో ఎదుర్కొని మంచి నీరు అందిస్తుంది".**

అంటే నాటి పెత్తందారి గ్రామ సమాజం జైలుకన్నా దుర్భరంగా ఉన్న వైనం చిత్రిస్తారు ఈ కథలో. ఈ కథ జైలును కొత్త కోణం లో చూపిస్తుంది.

"కుక్క పిల్ల", "గజేంద్ర మోక్షం" రెండు కథలు మానవేతర ప్రాణులకు సంబంధించినవి.

తనను ఎంత దండించినా యజమాని పై విశ్వాసం చూపించిన కుక్క కథ ఇది. ఇంగ్లీషు లో ఇట్లాంటి విశ్వాసానికి సంబంధించే 'Edgar Allan Poe' రాసిన 'The Black Cat' అనే కథ ఉంది. నల్ల పెంపుడు పిల్లి చాలా విశ్వాసంతో తన యజమానురాలిని హత్య చేసిన ఆమె భర్తను పట్టిస్తుంది. 'Gorge Orwell' 'Shooting an Elephant' కథ కూడా జంతు సంబంధమయింది. ఈ కథ బ్రిటిష్ రాజరిక వ్యవస్థను ఏనుగుకు ప్రతీక చేస్తూ వచ్చింది. పొట్లపల్లి కథలో తన పై విశ్వాసం చూపిస్తున్న కుక్కను యజమాని ఈసడించుకొంటాడు. జమీందారు కుక్కను కావాలనుకునేసరికి, డబ్బులిచ్చి కొందామనుకునేసరికి కుక్క మీద ప్రేమ పుట్టుకొస్తుంది. ఆ వరకే యజమాని భార్య కొట్టడం వల్ల కుక్క చనిపోతుంది.

ఇక పొట్లపల్లి రామారావు "గజేంద్ర మోక్షం కథ", కూయని కోడి పుంజు గురించి, పిల్లి నోట్లో నుంచి తప్పించుకొని అది గట్టిగా కూస్తుంది. ప్రాణ రక్షణార్థం చేసే ప్రయత్నం, ప్రాణం రక్షణ పొందగానే చేసే వ్యక్తీకరణ ఒక రకంగా మానవీయ స్పందనకు ప్రతీక. సమస్త జీవుల అంతర్వేదన ఒకటే అని తెలిపే కథ ఇది.

"ఒంటరి చావు", "సమాధి స్థలం" లాంటి కథల్లో ఆర్థిక అసమానత పేదరికం వల్ల మనిషి పొందే దైన్యం చిత్రించారు.

అధికారం రాగానే మనుషులు ఎట్లా మారిపోతారో చెప్పే కథ "కల". స్థిర వ్యక్తిత్వం దృష్టితో రాసిన కథ "కంకర రాయి". మనిషి ధూమపానానికి బందీయై చావును కూడా లెక్క చేయని వైనం చిత్రించిన కథ" జైల్లో సిగరెట్టు ముక్క".

పొట్ల పల్లి వారు చిత్రించిన ఈ కథల్లో వ్యక్తులు సంఘటనలు ఆ కాలానికి చెందినవే. అయినా ఇప్పటికి కూడా చదువుకునే ప్రాసంగికత వాటికుంది. పొట్ల పల్లి రామారావు కథా సంపుటానికి ముందు మాటలో చెప్పినట్టు, ఆయన కాలానికన్నా ముందున్న రచయిత.

ఈయన ముల్లా కథలు, ఆచార్యుల వారి కథల్లో కూడా హాస్యం తో పాటు లోతైన జీవితం కూడా చూస్తాం.

**ఆ కాలంలోని గ్రామాలలో వెట్టి భయంకరంగా ఉండేది. "న్యాయం" అనే కథలో పై అధికారుల పేరు చెప్పి ఒక జవాను ఏ విధంగా దోచుకున్నడో చెపుతడు. గ్రామీణ వ్యవస్థలో అధికారులు ఏమడిగినా ప్రజలు ఇవ్వాల్సిందే. కోమటివాళ్ళు భోజన దినుసును, వ్యవసాయ దారులు కోళ్ళు, ఇట్లా ఏమడిగినా ఇవ్వవలిసిందే. కోమటివాళ్ళు అవసరమైనపుడు అబద్ధాలతో నాటి జవానులను లేక అధికారులను మోసగించే వైనం కూడా ఉంది.**



## అది ఏదైనా సరే!

శ్వాస ఆడితే చాలు
పూల పరిమళాలను ఆస్వాదించవచ్చు
కనులలో రెప్పలు విప్పారితే చాలు
ప్రకృతి అందాలను తిలకించవచ్చు!

వెచ్చని స్పర్శ నీదైతే చాలు
కరచాలనంతో స్నేహాన్ని పంచవచ్చు
కరిగే మనసుంటే చాలు
ఎదుటి వాళ్ళ కన్నీటిని మాయం చేయవచ్చు!

ఎదలో ద్వేషం మొలకెత్తిందా
నీ నీడే శత్రువై వెంటాడుతది
హద్దు మీరి చొరబాటుకు యత్నిస్తే
మృత్యువు సంభాషణ వినవలసి వస్తది!

ఇద్దరి మధ్య పచ్చ గడ్డేసి
ఏది మంటలు రాజేసిందో
దాని నెత్తిన పెట్రోలు పోసి తగులబెట్టాలి
అది ఏ మతమైనా సరే!!

**-కోట్ల వెంకటేశ్వర రెడ్డి**



# ఎన్కటి రాకపోకలు

**- వకుళవాసు**

ఎన్కట సుట్టపోల్లు సుట్టపు సూపుకు ఇంటికొస్తాంర్రని
ఊరోళ్ళతోనో పక్కూరోళ్ళతోనో చెప్పంపెటోళ్ళు

ఇగ గా వార్త తెలిసిన దగ్గర్నుండి వాళ్ళకోసం
ఎప్పుడొస్తరా అని కండ్లు కాయలుగాసినట్టు ఎదురుజూసెటోళ్ళం

సక్కగ రోడ్లులేని బాటపొంట బడి ఎండ్లబండ్లల్ల నో
ఎర్రబస్సెక్కో పోగబండెక్కో వాళ్ళు నానాతంటాలువడి
ఇల్లుజేరంగనే ఇగ

మా అమ్మోళ్ళు ముసలోల్లు మీదబడి ఒకటే ఏడుపేడ్శేటోళ్ళు
ఎందుకేడుస్తాంర్రో అస్సలు సమజుగాగపోయేది

గాళ్ళకు కాళ్ళకు నీళ్ళిచ్చి కుర్చిపీటలమీద కూర్సోబెట్టి
కుశలప్రశ్నలన్ని అడిగెటోళ్ళు

చిన్నోళ్ళం వాల్ల కాళ్ళకు దండాలుపెట్టెటోళ్ళం
వాళ్ళు పావురంగ దగ్గరికి తీస్కోని

ఓ ఐదు పైసలో పది పైసలో ఇస్తరేమో నని ఆశపడేటోళ్ళం
గాకాలంల ఎవ్వరొచ్చిన వట్టిచేతుల్తోటి రాకపోయేటోళ్ళు

ఏపండో ఫలహారమో తెచ్చేటోళ్ళు వాళ్ళేంతెజ్జింర్రో అని
అక్కజెల్లెండ్లం నక్కి నక్కి జూసెటోళ్ళం

వచ్చినోళ్ళకోసం మేం సాదుకునే కోడినే దొరకబట్టి
కోసెటోళ్ళు మాఇంట్ల పెద్దోళ్ళు
గప్పుడైతే నాగుండెల మెలిపెట్టినట్లైయ్యేది

నాకండ్లల్ల నీళ్ళుదిరిగేది ఎందుకంటె గాకోళ్ళను పెంచుడు
అవ్వి గుడ్లేడ పెడ్తానయో అని ఇంటిసుట్టు ఎత్కుడు

కోళ్ళగూడును సాపుజేసుడు గుడ్లు పొదిగి పిల్లల్ని జేస్తే
సంబురపడుడు గియ్యన్ని నాపనులాయె
గందుకే దుఖమొచ్చేది కోడ్ని దొర్కబట్టి కోస్తాంటె

కని అమ్మ కమ్మగ వండినంక గింతంత అంటుబోసి
రెండు తున్కలేస్తె సప్పరిచ్చుకుంట తినేటోళ్ళం

ఇగ సుట్టపోళ్ళు ఎన్నిరోజులుంటె అన్నిరోజులు బడెగ్గొట్టుడే నాయె
ఎన్నో ముచ్చట్లు సెప్పుకునేటోళ్ళు ఓరాత్రిదాక

బయట పక్కలేసుకొని ఎన్నెట్ల సుక్కల్ని లెక్కబెట్టుకుంట
మేమాడుకునేటోళ్ళం వచ్చినోళ్ళ పోరగాండ్లతోని

ఇగ గావాళ్ళు పోయేరోజు వస్తాందంటెనే అందరి
ముఖాలల్ల రంది బట్టుకునేది

వాళ్ళకోసం ఏతెల్లారగట్లనో అమ్మోళ్ళు లేచి
సద్దిగట్టుడుకు వంటలు జేసెటోళ్ళు

వాళ్ళు పోయేటప్పుడు మల్లఅర్ధగంటషేపు ఏడ్సెటోళ్ళు
పంపలేక పంపలేక నడుళ్ళేదాక అందరంబోయెటోళ్ళం

వాళ్ళుగూడ పోలేక పోలేక దుడ్డెనొదిలి
గడ్డికిపోయే ఆవులోలె పోయెటోళ్ళు

గా పాశాలు గిప్పుడేడున్నయ్ ఎవలన్న వస్తాంర్రంటెనే
ఎందుకొస్తాంర్రు ఎప్పుడుబోతరని అడుగుడేనాయె

అసలు సుట్టపోళ్ళ ఇండ్లపొంటి వచ్చిపోయేటందుకు
జర్రంతగూడ కాలంలేని ఎండిన గుండెల బత్కులాయె

కాలమెంత మారిపోయింది మల్ల గాఎన్కటి
రోజులొస్తే ఎంతబాగుండు కద...

# పల్లెతనం

**క్షీణిస్తున్న పల్లెని గురించి, పట్టణంలో వృద్ధి చెందిన దురాక్రమణలు పల్లెటూర్లకు కూడా వ్యాపించిన వైనాన్ని చెప్పిన కథ...**



కటుకోజ్వల
మనోహరాచారి

సరిగ్గా ముప్పై ఏళ్లకు...

పల్లెకు పోవాలనే కోరిక కలగడం.. నా భార్యాపిల్లలు నన్ను అనుసరించడం.. అంతా అప్పటికప్పుడు జరిగిపోయింది.

ఇన్నాళ్లకు మా ఊరికి బయలుదేరడం ఉన్నపళంగా తీసుకున్న నిర్ణయమే అయినా.. నాలో ఎప్పటినుండో పల్లె వాతావరణాన్ని ఆస్వాదించాలనే కోరిక క్రమక్రమంగా బలపడడమూ కారణం కావచ్చు. అయితే పుట్టిన గడ్డకు సుదీర్ఘకాలంగా దూరమయ్యాననే భావనకంటే, ఈ నగర జీవనానికి నాల్రోజులు దూరంగా వెళ్లి గడపాలనే ఆలోచనవల్ల కావచ్చు... మా ఈ ప్రయాణం

రణగొణ ధ్వనులు, కాలుష్యపూరిత వాతావరణం మధ్య, ఏళ్ల తరబడిగా ఉరకలు పరుగుల ఉద్యోగ జీవితం ఉల్లాసాన్ని దూరం చేస్తున్నట్లుగా అనిపిస్తుంటే.. ఈ యాంత్రిక జీవితం నుండి కొంతకాలం విముక్తిని కావాలనిపించింది. పచ్చని ప్రకృతిలో స్వాంతన పొందాలన్న కోరికను భార్యాపిల్లలు కూడా సమ్మతించడంతో ఏకంగా నెలరోజులపాటు ఉద్యోగానికి సెలవు పెట్టి పల్లెబాట పట్టాము.

బెంగుళూరు నుండి విమానంలో హైదరాబాదుకు, అక్కన్నుండి టాక్సీలో మా ఊరు బయలుదేరాం. కారు కరీంనగర్ శివార్లుదాటి తమ పల్లెవైపు పరుగులు తీస్తుంది. రోడ్డు సౌకర్యం మెరుగుపడినట్లుంది. పెద్దగా గతుకుల్లేవు. ప్రతి ఊరికి పల్లెవెలుగులు పరుగులు పెట్టడం మొదలెట్టాక పల్లెలన్నీ తారురోడ్లకు నోచుకున్నాయి.

జిల్లా కేంద్రానికి నలభై ఐదు కిలోమీటర్ల దూరంలో, చుట్టూ గుట్టలు, వాగులు వనాల మధ్య ఉంటుంది మా ఊరు. ఇప్పుడు మా ఊరుకూ తారురోడ్డు వేయబడింది. ఇదో నిర్మాణాత్మకమైన మార్పు. తను ముప్పై సంవత్సరాల క్రితం కాలు బయట పెట్టాడు. ఇప్పటికీ ఊరు అట్లాగే ఉంటుందని అనుకోలేం కానీ, పట్టణాలతో పోల్చితే పల్లె పల్లే! పట్టణాల్లో పొందలేనివి చాలా పల్లెల్లో దొరుకుతాయి.

వేసవి సెలవుల్లో పిల్లల్ని కనీసం వారం పది రోజులన్నా ఎక్కడకైనా తిప్పాలి. భార్యామణిని ఉన్నచోటే ఉంచితే బోర్ ఫీలవుతుంది. ఊటీలు, కొడైకెనాళ్లు, దైవక్షేత్రాలు సరేసరి! ఈసారి కొత్తగా... ఇంకేదో కొత్తగా ప్రయత్నించాలని పించింది.

ఏకంగా మనూరు వెళ్తే..?

షాక్ తగిలినట్టు ఉలిక్కిపడ్డారు నా భార్యాపిల్లలు.

మా ఆవిడ ప్రవంతికి కొంతసేపు ఏం చెప్పాలో తెలియలేదు కానీ... ఆలోచిస్తుంటే ఆవిడకూ నచ్చినట్లనిపించింది. "మీరేమంటారూ...?" అంది. పిల్లల్లోనా కూతురు చైతన్యకి పదమూడేళ్లు. ఎనిమిదో తరగతి చదువుతుంది కొడుకు విష్ణుకు పది. తనిప్పుడు ఆరోతరగతి. నగరంలో సిమెంటు రోడ్లు, మల్టీ ఫ్లెక్సులు, మెట్రో వాహనాలు, అపార్టుమెంట్లు, లిఫ్టులు... పుట్టినప్పట్నుండి వాటిలోనే మునిగితేలిన మాపిల్లలు, కొత్తగా పల్లె వాతావరణం గురించి వర్ణించగానే అదో వింతలోకంలోకి వెళ్తున్నట్లుగా భావించారు.

బియ్యం ఏ చెట్టుకు కాస్తుందో తెలియగానే.. ఏకంగా బియ్యపు చెట్లతో ఆడుకోవాలన్నంత కుతూహలానికి లోనయ్యారు. గుట్టలు, చెరువులు, నీటిచెలిమెలు, మామిడితోటలు, పశువుల పాకలు.. ఇవన్నీ వింటుంటేనే ఆకర్షితులయ్యారు. తాము ఇప్పటి వరకూ చూసిన లోకానికి కొత్తగా అనిపించ గానే "వెళ్దాం.. వెళ్దాం.." అని తొందర పెట్టారు. ఫలితంగా తాజ్ మహల్లు, ఎర్ర కోటలు, గోవాబీచ్లు, హౌరా బ్రిడ్జ్ లు వంటివి సందర్శించాల్సిన మా వేసవిట్రిప్ మా ఊరివైపు మళ్ళింది. నెలరోజులు సెలవు పెట్టుకొని మరీ బయలుదేరదీశాన్నేను.

ఐదేళ్ల క్రితం మా నాన్నగారు పోయినప్పుడు దంపతులిద్దరమూ మాఊరు వచ్చినా ఉన్నది నాల్రోజులే! చదువుల దృష్ట్యా పిల్లలిద్దర్నీ అక్కడే

అత్తవారింట్లో ఉంచి రావడంవల్ల ఐదోరోజు అన్ని కర్మలూ పూర్తిచేసుకొని, మళ్లీ హైదరాబాద్ బస్, అక్కన్నుండి బెంగుళూరు విమానం ఎక్కేశాం అమ్మతో సహా! మేమిద్దరం మాకిద్దరు అన్నట్లుగా సంసారం సాగిపోతున్నా ఆ మహానగరంలో ఏదో వెలితి. ప్రశాంతత కరువవుతున్న భావన. లక్షల్లో జీతం, కారు, అపార్టుమెంటు, అనుకూలవతి భార్య, ఆణిముత్యాల్లాంటి పిల్లలు.. ఇంకేం కావాలి

ఇంకా ఏదో కావాలి

కారణం సరిగా తెలియదు. కానీ అప్పుడప్పుడూ అనిపిస్తుంది. ముప్పై ఏళ్ల క్రితం చదువు పేరుతో పుట్టినూరు వదలి సిటీ చేరాడు తను. ఆతర్వాత ఐదేళ్లకు ఉన్నత చదువులని అమెరికా వచ్చేశాను. మరో ఐదేళ్లకు చదువు పూర్తయినా ఇండియా రాకుండా అక్కడే ఉద్యోగంలో చేరిపోయాను. అప్పుడే బెంగుళూరు అమ్మాయితో పెళ్లి కూడా అయిపోయింది. పదేళ్ల అమెరికాలో ఉద్యోగజీవితం ఎట్లాంటి ఆనందాన్ని ఇచ్చిందోకాని.. తర్వాత నాదేశం, నా భారతమాత అని దేశాభిమానం పెరిగి ఇండియా వచ్చేశాను. తను చదివిన చదువుకు సరైన ఉద్యోగం దొరకాలంటే మళ్లీ మహానగరాలే కావాలి. అట్లా పదేళ్ల క్రితం బెంగుళూరులో సెటిలైపోయాం. నాలుగైదేళ్ల క్రితం నాన్న చనిపోయినపుడు అట్లావచ్చి ఇట్ల వెళ్లాం. ఇంటికి తాళంకొట్టి అమ్మను బెంగుళూరు తీసుకెళ్లాక స్వగ్రామం జాడలే గుర్తుకురాలేదు. సంవత్సరం క్రితం అమ్మకూడా పోయారు.

ఇప్పుడు... ఇప్పుడు మా ఊరు జ్ఞాపకం వస్తుంది. నేను ఊళ్లోనుండి కాలు బయట పెట్టేనాటికి చాలా ఏళ్ల ముందునుండే మానాన్నగారు ఆ గ్రామానికి సర్పంచుగా ఉన్నారు. నాకు మాత్రం సుదీర్ఘకాలంగా మా ఊరితో సత్సంబంధాలు కొరవడ్డాయి. అట్లాంటి మా ఊరు ఇప్పుడెట్లా ఉందో...

మేం తిరిగిన చేలూచెలకలూ, చెరువుకట్టలు, మామిడితోటలు, ఈతకొ

> **వ్యాను లోనుండి పిల్లల్తో సహా కిందకు దిగి చెరువు ఆ చివరివరకు చూశాను. గతంలో మేము ఆడుకున్న చిలుకలు వాలిన చెట్లు లేవు. చెరువుకు ఆవలివైపున విస్తృతంగా పరుచుకొన్న మామిడి తోటలూ లేవు. క్రమక్రమంగా కరిగిపోయి, భూమికి సమతలంగా అవుతూ ఒకనాడు నేనుండేదాన్ని అనే ఆన వాళ్లను గుర్తుచేస్తున్నట్లుగా మారింది కట్ట.**

లనులు, చేపలవేటలు.. ఒకటేమిటి.. పల్లె అందాలన్నీ బాల్యస్మృతుల్తో కల్సి మనసులో తిరుగాడుతుండగానే ట్యాక్సీ మా ఇంటి ముందుకొచ్చి ఆగింది.

★ ★ ★

గంట గడిచేసరికి చుట్టుపక్కల కొందరు సన్నిహితులు మాఇంటికి చేరారు.

నా చిన్నతనంలో మానాన్నగారు సర్పంచుగా చేసిన కాలంలో ఆయన అనుయాయులు, అభిమానులు ఎక్కువగానే ఉండేవారు. వాళ్లతోపాటు మా వీధిలోని వారందరికీ మా కుటుంబం మీద ఇంకా గౌరవభావం అట్లానే ఉన్నట్లుంది. అందుకే ఆడామగా తేడాలేకుండా వచ్చి పలకరిస్తున్నారు. నేనూ మర్యాదకోసం మా ఆవిడతో కల్సి వాళ్ల యోగక్షేమాలు విచారిస్తున్నాను.

"నిన్ను చూస్తుంటే మీనాయనే గుర్తుకొస్తున్నాడయ్యా.." అంది నా పక్కనే కూచున్న ఓ పెద్దావిడ నాతల నిమురుతూ.

ఈ ఆప్యాయతలు, అనుబంధాలు నాకు కొత్త. అయినా "ఊరు బాగుందా అమ్మా..?" అన్నాను ఆప్యాయంగా

"ఆ.. ఏంబాగోలే..! అయినా మీలాంటి సదువుకున్నోరంతా ఊరిడిసిపెడితే ఇంకా ఊరెట్లా బాగుంటుందయ్యా?" అంది అవ్వ అదోరకంగా.

నేను నవ్వాను. "చదువుకు, ఊరు బాగుపడడానికి పెద్ద సంబంధం లేదమ్మా.." అన్నాను.

"ఏదైనా.. మీ నాయిన సర్పంచుగా ఉన్న రోజులు రావయ్యా.." అన్నాడు ఆశాలు. ఆశాలు మాఇంటికి సమీపంలోనే ఉంటాడు. నాన్న సర్పంచుగా చేసినపుడు కుడిభుజంగా, వ్యవసాయపు పనుల్లో చేదోడుగా ఉండేవాడు. తను చనిపోయే నాటికే చాలా భూములుఅమ్మేశాడు నాన్న. ఏవో ఒకటి రెండు మిగిలాయంతే!

పరిచయం పెద్దగా లేకున్నా అందరూ కల్సివెళ్తుంటే అదోరకం ఆనందం అనిపించింది. ఆశాలు ఆరోజు రాత్రి వరకూ మాతోనే ఉండి పొద్దున్నే కలుస్తానని వెళ్లాడు.

మర్నాడు ఉదయమే వచ్చాడు.

"ఆశాలూ..! కచ్రం తీసుకొనిరా..! ఈరోజు ఊరంతా చుట్టేసొద్దాం.." అన్నాను ఆశాలు రావడంతోనే.

ఆశాలు నవ్వాడు. "కచ్రమా..??"

"అవునూ! చిన్నప్పుడు మనం పొలంకాడికి, చెరువుకట్టకు ఎడ్లబండి మీదనే వెళ్లేవాళ్లం కదా!" అన్నాన్నేను అతన్నే చూస్తూ.

ఐదునిముషాల తర్వాత వాహనం తెచ్చి ఇంటిముందు నిలిపాడు ఆశాలు.

"ఇంకా ఎడ్లబండ్ల కాలమా బాపూ... అవెప్పుడో పోయినయ్.."

మేం విస్తుబోయి చూశాం. "టాటా మేజిక్..? ఇవి మేం రోజూ చూస్తున్నవే కదా!" ఉసూరుమంటూ ఎక్కి కూచున్నారు పిల్లలు. ఎడ్లబండిలో పయనించలేకపోతున్న అసంతృప్తిని బయటకు ప్రదర్శిస్తునే "చెరువుకట్టకు పోనీ" అన్నాను ఎక్కి కూర్చుంటూ. స్రవంతి ఇంటిపట్టునే ఉండి వంటపనులు చూసుకొంటుంది.

"ఏమైనా... ఇంటి పరిసరాలన్నీ బాగా మారిపోయాయి ఆశాలూ.." అన్నాను వెళ్తుంటే. ఆశాలు తలఊపాడు డ్రైవింగ్ చేస్తూ. ఇంటిచుట్టూ విస్తరించుకొని ఉండాల్సిన నాలుగు చింతచెట్లూ, ఇంటిముందు వేపచెట్లూ అన్నీ పోయినట్లున్నాయి. స్వాగత స్తంభాల్లా

ఉండే రెండు కొబ్బరి చెట్లల్లో ఒకటే మిగిలింది మోడువారిపోయి.

వ్యాన్ వెళ్తుంటే పిల్లలు మహాసరదాగా ఉన్నారు. "చెరువులో ఈదడమా.. వావ్..." అంది థ్రిల్లింగా చైతన్య.

"చెరువంటే.. సముద్రంలా ఉంటుందా నాన్నా?" అన్నాడు విష్ణు.

"లేదు నాన్నా! సముద్రం పెద్దది. చెరువు చాలా చిన్నది"

"స్విమ్మింగ్ పూలంత ఉంటుందా..??"

"కాదు, పెద్దదిగా ఉంటుంది. అయినా తినబోతూ రుచులడగడం దేనికీ.. ఇప్పుడు డైరెక్టుగా చూడబోతున్నాంగా.."

పిల్లలు ఎక్సైటింగ్ గా చూస్తున్నారు ముందుకు.

చిన్నప్పుడు ఆశాలుతో మా స్నేహితులం అంతా కల్సి చెరువులో ఈ చివర్నుండి ఆ చివరకు ఈదాలని పోటీలు పెట్టుకునే వాళ్లం. నేనైతే అరగంటలో అవతలికి ఈదే వాన్ని"

"ఔనా..!" అంది చైతన్య ఆశ్చర్యంగా. వాళ్లలో ఉత్సాహం ఉరకలెత్తుతుంది ఎప్పుడు చెరువులో ఈద్దామా అని. నాకూ ఉత్సాహంగానే ఉంది. పదిపన్నెండేళ్ల వయసులో స్నేహితుల్తో కలిసి చెరువుకట్టమీద చిలుకలు వాలిన రావిచెట్టు, కడిమిచెట్టు ఎక్కి, నీళ్లలోకి దూకిన సంగతులు, కట్టకింద నీటిగుంతల్లో చేపలు పట్టిందీ అన్నీ.. అన్నీ గుర్తుకొచ్చి మనసు పరవశించింది.

ఆశాలు నేరుగా వాహనాన్ని చెరువుకట్ట పైకి తీసుకెళ్లాడు. చెరువువైపు చూసిన నా మొహం తెల్లగా పాలిపోయింది. అప్పటివరకూ పిల్లల మొహంలో తాండవమాడిన ఆనందం ఒక్కసారిగా ఆవిరైంది. కట్టకింద.. చెరువు స్థానంలో నా మొహంలా తెల్లగా పాలిపోయి నెర్రలిచ్చిన నేల కనిపిస్తుంది. అక్కడక్కడ రెండు మూడు బురద గుంతలున్నాయి అంతే! లోతుగా పరికిస్తే.. అసలక్కడ చెరువు ఉంటేగా! రెండువైపుల్నుండి చెరువులోకి చొచ్చుకొచ్చి ఇండ్ల నిర్మాణాలు చేశారు. ఇంకొంత భాగం ఎవరో పొలమో, చేనో వేశారు. డెబ్బై శాతం మేర ఆక్రమణకు గురైన ఆ చెరువు మిగతా భాగం పూడిక నిండి, అక్కడక్కడ గుంతలతో.. చెర్నాకోలతో కొట్టుకొన్న ముష్టివాని వీపులా తయారైంది.

నా హృదయాన్ని ఎవరో పారతో కెలికినట్లైంది.

"ఇది ఏకాలం బాపూ... ఇంకా చెరువు అట్లనే ఉండనీకి..?" అన్నాడు ఆశాలు.

వ్యాను లోనుండి పిల్లల్తో సహా కిందకు దిగి చెరువు ఆ చివరివరకు చూశాను. గతంలో మేము ఆడుకున్న చిలుకలు వాలిన చెట్లు లేవు. చెరువుకు ఆవలివైపున విస్తృతంగా పరుచుకొన్న మామిడి తోటలూ లేవు. క్రమక్రమంగా కరిగిపోయి, భూమికి సమతలంగా అవుతూ ఒకనాడు నేనుండేదాన్ని అనే ఆన వాళ్లను గుర్తుచేస్తున్నట్లుగా మారింది కట్ట.

నిరాశానిస్పృహలు నిండిన గొంతుతో "ఆశాలూ..! ఇంక చేసేదేముంది? నువ్వు ఇంటికెళ్లిపో. మేమట్లా కాలినడకన తిరిగేసొస్తాం.." అన్నాను. "తిరిగి సూడ్డానికి ఈడ ఏముంటది బాపూ!" అంటూ "సరే! ఫోన్ చేయండ్రి తీసుకెళ్ళి పోనీ కొత్తా." అంటూ బయలుదేరాడు.

నేను తలూపాను. పిల్లలిద్దరూ నిరాశకు లోనైంది తెలుస్తూనే ఉంది. "ఎండాకాలం కదా! చెరువులో నీళ్లు ఎండిపోయాయి అయినా చెరువులో లేకుంటేనేం.? మన వ్యవసాయబావి ఉంది కదా! అటెళ్దాం." అంటూ పిల్లల్ని తీసుకొని కట్టకింద పొలాలవైపు బయల్దేరాను.

నాకూ బాధగానే ఉంది. ఎంతటి ఎండాకాలమైనా నిండుగా కళకళలాడుతూ, ఎప్పుడూ ఈతలు కొట్టేవాళ్లు, చేపలుపట్టేవాళ్లతో సందడిగా ఉండేది చెరువు. ఇపుడు పూర్తిగా ఆనవాళ్లే కోల్పోయింది.

మేము కట్టదిగి, కట్టకింది రోడ్డును దాటి కిందివైపు పొలాలుండే ప్రాంతం వైపు



నడిచాము. గట్లమీంచి లోనికి అర కిలోమీటర్ నడిచెల్తే మావ్యవసాయభూమి, పెద్దబావి ఉంటాయి. విశాలంగా పరుచుకొన్న ఆ బావినీళ్లు గట్టునుండి ఒకటి రెండు అడుగులు మాత్రమే కిందికుంటాయి. హైస్కూల్ చదువుల రోజుల్లో తోటి స్నేహితుల్తో కలిసి మా బావిలో విచ్చలవిడిగా దుమికే వాళ్ళం. మేమే కాదు, ఊళ్లో చాలామంది మా బావిని ఈతకు వినియోగించేవాళ్లు.

మేం బావిగట్టు వరకూ వచ్చాం. నా కళ్లను నేనే నమ్మలేకపోయాను. అక్కడ.. బావి ఆనవాళ్లు తప్ప బావి లేదు. విస్తృతంగా పరుచుకొని, నీళ్లు గట్టు పైకి ఉబికివచ్చేలా ఉండే బావి స్థానంలో ఓ బురదగుంత ఉందంతే.

అదికాదు నేను చూస్తున్నది. దాన్నానుకొని ఉండాల్సిన మా పొలం స్థానంలో ఓ పౌల్ట్రీఫాం, పక్కనే కర్రకోత మిషనూ వెలిశాయి. డెబ్బైశాతం మా పొలాన్ని పౌల్ట్రీఫాం వాళ్లు ఆక్రమించారు. నా మనసు చెదిరిపోయింది.

అసలీ చుట్టుపట్ల పొలాలేవి? ఒకనాడు వరిపైర్లు, వ్యవసాయ బావులు, పారేవాగులతో కళకళలాడిన ఈ ప్రాంతమంతా ఇట్లా వట్టిపోయిందేమిటి? ఊళ్లోకొచ్చే రోడ్డుకిరువైపులా పచ్చని పంట పొలాలు, నీటిచెలిమెలు ఉండేవి. ఏవీ ఇప్పుడవన్నీ.? అసలు నీటి జాడే కనిపించదే! పొలాలన్నీ ప్లాట్లయిపోతే అసలు జనం ఎట్లా బతుకుతున్నారని..?

నా మనసు విచలితం అయింది.

దొరలూ, భూస్వాముల వేలాది ఎకరాల భూములు ఏండ్ల తరబడిగా నిరుపయోగంగా పడిఉన్నా పట్టించుకోని పల్లెల్లోనేడు పట్టణాలను మించిన దురాక్రమణ సంస్కృతి విస్తరించిందా? చెరువునూ, మాపొలాన్ని చూస్తుంటే అదే అని పిస్తుంది. ఈ ఆక్రమణదారులు ఎవరో అరా తీయాలనే ఉద్దేశంతో పిల్లల్తో కదిలి ఇంటిదారి పట్టాను.

**ఊరి శివార్లలో వస్తున్నప్పుడు కనిపించాల్సిన మామిడితోటలు, ఊరివెనక దట్టంగా విస్తరించిన చీమచింత, మోదుగు, ఇప్పవనాలేవి? ఊళ్లోకి అడుగు పెడుతున్నప్పుడు ఎదురయ్యే మత్తడి వాగేది? వస్తున్నప్పుడు మా కూతురు అడిగింది. "నాన్నా.. పెద్ద పెద్ద గుట్టలన్నావు, ఏవీ కనిపించవే..?"**

★ ★ ★

మర్నాడు... ఆశాలును తీసుకొని మా ఊరి సర్పంచును కలిశాను.

గ్రామపంచాయితీ కార్యాలయంలో దర్జాగా కూచున్న సర్పంచ్ చంద్రం ఎవరికో ఫోన్ చేశాడు. నిజానికి సర్పంచ్ చంద్రం కాదు, ఆయన భార్య. పల్లె ల్లో భార్యల పేరుమీద భర్తలు అధికారం చెలాయించడం ఇంకాపోలేదు అను కున్నాను. నిజానికి ఆడవాళ్లు తమ పదవీ బాధ్యతలు నిర్వహించలేక కాదు, వాళ్లనలా ఉంచి ఆ అధికారాన్ని భర్తలే లాగేసుకుంటారంతే! చంద్రం పెద్దగా చదువుకున్నోడుకాదు.

'చదువుకున్నోళ్లంతా మీలా బయటకెళ్లిపోతారు, చదువు లేనివాళ్లు ఊళ్లో రాజకీయాలు చేస్తుంటారు' అని మొన్న రాత్రి ఎవరో అన్నట్లు గుర్తు.

ఇరవై నిముషాలు ఎదురుచూశాక ఓ పెద్దమనిషి మరోవ్యక్తితో కల్సివచ్చాడు. ఊరివాళ్లు నాన్నగారికి తెల్సుంటారు. నాకు అంతగా పరిచయం ఉండదు. వస్తూనే ఆ పెద్దమనిషి "ఏ భూమి.? చెరువుకట్ట కిందిదా? అదెప్పుడో మీ నాయిన మాకు అమ్మేసిండు". చాలాతేలిగ్గా అన్నాడు

నేను విస్తుబోయాను. "అదేంటీ..? మానాన్న ఏవేవి అమ్మేశాడో, ఏవి మిగిల్చాడో నాకు స్పష్టంగా తెలుసు. ఆ భూమి ఎవ్వరికీ అమ్మలేదు.." గట్టిగా వాదించాను.

సర్పంచ్ ఆపాడు. "చిన్నప్పుడెప్పుడో చదువు పేరుతో బయటకుబోయి, ఇరవైముప్పై ఏండ్ల తర్వాత గిప్పుడొచ్చి నాకు గంతుంది.. గింతుంది అంటే ఎట్లా? మీ నాయిన ఏమేం అమ్ముకున్నడో నీకెట్లా తెలుసుద్దీ..?" అన్నాడు ఊరతనికి సపోర్టుగా.

"ఇది అన్యాయం. ఊళ్లో లేకుంటే మాత్రం మా నాన్నకు ఏయే ఆస్తులున్నాయో  తెలియకుండా పోతాయా? అసలు ఆ భూమి అమ్మిన తాలూకు డాక్యుమెంట్లు తెమ్మనండి..."

అతనెళ్లి అరగంట తర్వాత డాక్యుమెంట్లు పట్టుకొచ్చాడు. అంతా మోసం. మానాన్నగారు రాసిచ్చినట్లు వంద రూపాయల స్టాంపు కాగితం మీద రాసిన పత్రం అది. వాళ్లే రాసుకున్నారు. సంతకం కూడా పోర్జరే!

"ఇది కాదు.. రిజిస్టేషన్ పత్రాలు కావాలి.."

సర్పంచ్ అన్నాడు. "ఇంకా రిజిస్ట్రేషన్ ఏందయ్యా..? ఇక్కడన్నీ అంతే. ఆడికి అమ్మినట్లు మీ నాయిన సక్కగ రాసిత్తే ఇంకేం గావాలే?"

"మరి నేనెళ్లత్తానయ్యా.." విషయం తేల్చకుండానే వచ్చిన ఇద్దరూ వెళ్లిపోయారు.

"పట్నంలో బాగా సంపాదిత్తున్నవటగా! అయినా నీ భూమి నీగ్గావాలంటే... " సర్పంచ్ నాకు దగ్గరగా వంగి "పది లక్షలు ఖర్చు పెట్టుకుంటే నీది నీకిప్పిత్తా." అన్నాడు.

నాకు షాక్ తగిలినట్లనిపించింది.

భూదందా.. సెటిల్ మెంట్లు.. సిటీల్లో ఎప్పుడూ ఉండేవే! నేడు గ్రామాలకు విస్తరించాయా?? పదిలక్షలు! తన భూమి విలువ కూడా అంత చేస్తుందో లేదో! నేను ట్రాన్స్ లో ఉన్నట్లు లేచి బయటకు నడిచాను.

"ఆళ్లను ఏంజేయలేం బాపూ..." అంటున్నాడు ఆశాలు నావెనుకే నడుస్తూ.

అవును. ఏం చేయలేం! అవసరమైతే డాక్యుమెంట్లు సృష్టిస్తారు. ఊరిని నిత్య జలకళతో రక్షించే చెరువునే కబ్జా చేసినోళ్లకి ముప్పై ఏళ్ల తర్వాత వచ్చి ఆస్తుల గురించి ఆరాతీస్తే తనను పట్టించుకునే వారుంటారా?

లీగల్‌గా పోరాడడానికి లోతుగా వెళ్లినా.. తను ఏ ఆనందాన్ని అనుభవించ

డానికి పల్లెటూరుకొచ్చాడో ఆ ఆనందం దొరకదు సరికదా.. ఉన్న నెలరోజులూ మానసికంగా, శారీరకంగా ఈ సమస్య మీదే ఇబ్బంది పడాల్సి వస్తుంది. అప్పటికి సమస్య తీరదుకూడా.

నేను అలా ఊరి మధ్యనుండి నడుస్తూ వెళ్తున్నాను. వెంటే నన్ను గమనిస్తూ ఆశాలు.

అదేంటి..? పల్లెలిట్లా అయ్యాయా..??

తానేదో ఆనందం.. ఆహ్లాదం అని వచ్చాడుకదా! ఏవవి? ఎక్కడున్నాయ్..? ఒకనాడు ఊళ్లో సమస్యలెదురైతే ఊరిమధ్య నాలుగురోడ్ల కూడలిలో రావిచెట్టు కింద పంచాయితీ పెట్టేవారు. ఏదా రావిచెట్టు? నాలుగు వైపులా వట వృక్షాల్లా పరుచుకున్న వేపచెట్లేవి?

అసలు మా ఊరి మట్టివాసనేది?

ఊరి శివార్లలో వస్తున్నప్పుడు కనిపించాల్సిన మామిడితోటలు, ఊరివెనక దట్టంగా విస్తరించిన చీమచింత, మోదుగు, ఇప్పవనాలేవి? ఊళ్లోకి అడుగు పెడుతున్నప్పుడు ఎదురయ్యే మత్తడి వాగేది?

వస్తున్నప్పుడు మా కూతురు అడిగింది. "నాన్నా.. పెద్ద పెద్ద గుట్టలన్నావు, ఏవీ కనిపించవే..?" నా కళ్లే నన్ను మోసం చేస్తున్నట్లు అసలు మాఊరి చుట్టూ ఉండాల్సిన గుట్టలన్నీ మాయమైపోయాయి. గుట్టలకున్న రాళ్లను క్రషర్ మిషన్లు కరిగించివేశాయి. మట్టిని ప్రొక్లైన్లు తోడిపోశాయి. ఫలితంగా గుట్టలున్న ప్రాంతంలో కూడా అక్కడక్కడా కాంక్రీటు భవంతులు, ఇందిరమ్మ ఇండ్లూ వెలిశాయి. పంటపొలాలన్నీ చేన్లు చెలకలయ్యాయి. వ్యవసాయబావులు పోయి బోరుబావు లొచ్చాయి. రోడ్డుపక్క పంటభూములన్నీ ప్లాట్లయిపోయాయి.

అవునూ.. ఊరు ప్రధాన కూడళ్లలో ఉండాల్సిన సర్కారు బావులేవి? అసలు ఇంటింటికీ ఉండాల్సిన నూతులేవి?

కమ్మరి కొలిమి
కుమ్మరి చక్రం
సాలెల మగ్గం
జాలరి పగ్గం
గొడ్డలి, రంపం, కొడవలి,నాగలి..
సమస్త వృత్తుల సహస్ర చిహ్నలేవి ??

ఇదంతా గ్రామాలు సాధించిన అభివృద్ధి అనుకోవాలా?

ఇది నిజంగా పచ్చదనం కోల్పోయిన పండుటాకులా, ఆడతనం కోల్పోయిన అమ్మలా, పల్లెతనం కోల్పోయిన మొండి గ్రామంలా ఉందిప్పుడు.

ఇంటివైపు నడుస్తుంటే పెద్ద డిజె శబ్దాలు వినిపించాయి. పెళ్లిమేళం ఏమో! ఇక్కడా తప్పడం లేదు. సాయంవేళలో మా ఊరి తురక సోదరులు ఓచోట చేరి బ్యాండు వాయిద్యం నేర్చుకునేవాళ్లు. ఇప్పుడా బ్యాండుమేళం పోయి డిజెలొచ్చాయి. ఇంటిముందు పందిళ్లేసి పెళ్లిలు చేసే సంస్కృతి పల్లెల్లోనూ అడుగంటింది.

ఇంకా ఏం మిగిలిందని?

భారమైన మనసుతో ఇల్లు చేరాను.

"నాన్నా ! పచ్చనిచెట్లు, పంటపొలాలు, వాగులు వంకలు, బావులు చెరువులు, చింతచెట్లు, మామిడితోటలు.. సాయంకాలం వీధి నాటకాలు, భాగవతాలు... ఇంకా ఏమేమో చెప్పారు. అసలిక్కడ ఏవీలేవు." అంది కూతురు చైతన్య ఎదురొస్తూ.

"కాలం మారింది కదమ్మా.. కాలంతో పాటు పల్లెలూ అభివృద్ధి చెందుతున్నాయి" అన్నాను నిర్వేదంగా.

"ఏం అభివృద్దో.. ఏమోనండీ..! పల్లెల్లో స్వచ్ఛమైన కూరగాయలు, పాలు పెరుగు, వెన్న మీగడ దొరుకుతాయనుకున్నాను. ఇక్కడ దొరికే పాలకన్నా ప్యాకెట్ పాలే బెటరు. అసలు కూరగాయలు అమ్మేవారే కనిపించడం లేదు. ఇదేం పల్లెటూరో ఏమో!" అంది మా ఆవిడ నిష్ఠూరంగా.

"ఈడ పండే కూరగాయలు పక్క సిటీకి బోయి అమ్ముకచ్చుడేనాయె. ఈడి పాలన్నీ సిటీలో పాలకేంద్రానికి బోసుడేనాయె. ఇంకేడ దొరుకుతాయమ్మా.. "అన్నాడు వెంటే వచ్చిన ఆశాలు.

"ఇంకా ఏముందండీ ఇక్కడ.. వెళ్లిపోతేపోలా?" మా ఆవిడకు నాల్రోజులకే తిరుగు ఆలోచన్లు మొదలయ్యాయి.

ఏముందిక్కడ ? పుట్టినూరుంది ! కానీ నేను పుట్టినప్పటి ఊరులా లేదు. అప్పటి ఆనందం, కోలాహలం లేదు.

మళ్లీ అవే! పట్నంలోలా రాటుదేలిన రాజకీయాలు, మోడువారిన పరిసరాలు! అసలిక్కడ పల్లెతనమే లేదు.

"నాన్నగారు సర్పంచ్‌గా ఉన్న రోజుల్లో ఇట్టా తగలడలేదయ్యా! అప్పుడెంత హాయిగా ఉండేవాళ్లం. ఇపుడచ్చే సర్పంచ్ ఊరోళ్ళందర్నీ పీడించి దోసుకునుడే తప్ప ఊరును బాగుసేసిందేమీ లేదు. ఈసారి సర్పంచ్ రిజర్వేషన్లు జనరలైనయంట. మళ్లా ఎసుంటోడత్తడో! మీరెళ్లిపోతే మీకు పుట్టినూరన్న గురుతు కూడా లేకుండా ఇంటిని కూడా కబ్జా సేత్తరయ్యా.." అంటున్నాడు ఆశాలు.

అదీ నిజమే! నేనాలోచిస్తున్నది ఇక్కడ ఇల్లు కోసంకాదు. పల్లె కోసం! అంతరించి పోతున్న పల్లెతనం కోసం..!!

తను... తను... ఇక్కడే ఉండిపోతే!? తను చదివిన వ్యవసాయ శాస్త్రాన్ని ఈ పల్లెకే పరివర్తింపజేస్తే...?!

తొలిరోజు మా వీధిలోని ముసలమ్మ అన్న మాటలు గుర్తుకొస్తున్నాయి. "మీలాంటి సదువుకున్నోరంతా ఊరిడిసి పోతే.. ఇంకా ఊరెట్టా బాగుంటుందయ్యా.."

అవును...! విద్యావంతులు, మేధావులు చదువులు, ఉద్యోగాల పేరుతో బయటకు వెళ్లిపోతే గ్రామాల్లో మునగచెట్లే మహావృక్షాలుగా పాతుకుపోతాయి. ఎప్పుడో ఒకప్పుడు ప్రశ్నించేవాళ్లు, పరిష్కరించేవాళ్లు రావాలిగదా!

అది... నేనే అయితే !?

నాన్నగారి వారసుడిగా నాటి పల్లె వాతావరణాన్ని, అభివృద్ధితో కూడిన పల్లె వైభవాన్ని, ప్రజాసంక్షేమాన్ని మళ్లీ ఆవిష్కరిస్తే... చిత్రంగా నాన్న చిత్రపటానికి పొద్దున్నే అలంకరించిన పువ్వు రాలి సూటిగా నాతలపైన పడింది.. ఆశీర్వదిస్తున్నట్లుగా!

కవిత

# రుచి



**హనీఫ్**

నింగి నుంచి రాలిన
చినుకుల్ని నా ఆలోచన ల్లోకి
వంపు కుంటాను
పైర్లను కల కంటాను!

బెట్ట కాలో వచ్చినప్పుడు
నాకలల్ని  కన్నీళ్ళ లోకి
అనువదించు కుంటాను
దోసిల్లతో పైర్ల పాదుల్లోకి పంపుతాను

ఇందులో నాకుటుంబ మంతా
బాగా తర్ఫీదు పొందింది
పైరును బతికించుకోన్నాడు
నేనే అంతమౌతాను

అందుకే
మట్టిని రుచి చూడండి
ఉప్ప ఉప్పుగా వుంటుంది.
మా ఇద్దరి శరీర రుచి ఒక్కటే.

# తాళం వేయకుంటే?

తగువులు మేల్కొంటాయి
పరువులు బరువులు తగ్గి
వేగనిరోధక శక్తి సన్నగిల్లుతుంది

చెట్టుపైన వాలిన చిలుకలు చెదిరిపోయి
శబ్ద కాలుష్యం లో కరిగి విలుప్తమై చరిత్రలో
అతుక్కుని పోతాయి

సముద్ర ప్రశాంతతను దెబ్బతీసే తుఫాన్
బడబాగ్ని సృజియించి చీకటి మండలంలోని
జీవుల్ని దహించివేస్తాయి

చెట్టాపట్టాలేసుకున్న చేతులలో కత్తులు మొలచి
కుత్తుకలను నరుకుంటూ
రుధిర విన్యాసం జరుగుతుంది

మంగలంలో వేయించిన మక్కగింజలా
మనసు ముక్కలు ఎగిరిపడి
తలలు మోకాళ్లపై నిలబడుతాయి

గొంతుకు గండిపడి
మాటల చేప పిల్లలు
మనసు గాలానికి చిక్కి
విల విల లాడుతాయి

ముఖ కుహరం లోంచి అవిర్లు విడివడితే
మేఘాలు సభ జరిపి ఉరుముల
నజరానా ప్రకటిస్తాయి

భాష కరుకెక్కి పెట్టిన చురకలకు గాయం
కనపడని నొప్పులు లేచి నిలబడి
నిశ్శబ్దంగా నిలదీస్తాయి
మాటకు తాళం వేయకపోతే
ఆలి ఓపిక కొంగు భంగపడుతుంది
ఆత్మీయత వంటింట్లో ఆమ్లెట్టవుతుంది

ఇంటికి గడియ పెట్టకున్నా
లాకర్ గది మూయకున్నా
మాటలు కొన్ని మూతకట్టుకొని
హృదయపేటికలో
దాచుకోవాల్సిందే లేకుంటే
వెన్నెల వెలుతురు మీద
మనిషి నీడ పడకుండా
గ్రహణం గూడు కడుతుంది

తాళం వేయటం తప్పితే
దొంగల మాట అటుంచి
ఇమాన్ దార్ జీబ్ కూడా
వజీఫా పొందాల్సిందే



**కె.ఎస్. అనంతాచార్య**

సాహితీ శిఖరం

జ్ఞాన్ పీఠ్ అవార్డు-2016 గ్రహీత

# శంఖ ఘోష్



ప్రముఖ బెంగాలీ కవి శంఖ ఘోష్ జ్ఞాన్‌పీఠ్ పురస్కారానికి ఎంపికయ్యారు.సాహిత్య రంగానికి శంఖ ఘోష్ చేసిన సేవలకు గానూ 2016లో ఈ పురస్కారం వరించింది. మోడరన్ బెంగాలీ సాహిత్యంలో దిట్టగా శంఖ ఘోష్ పేరుగాంచారు. శంఖ ఘోష్ ప్రయోగాత్మక కవిత్వ రూపాలతో అరుదైన శైలిలో రచనలు చేశారు. ఆయన కవితాశిల్పంలో ఆధునికత, వర్తమాన అంశాలు అందంగా ఒదిగిపోయాయి అంటారు సాహిత్య మేధావులు. రచనల్లో అద్భుతభావ ప్రకటన ఆయన ప్రత్యేకత.

అదిమ్ లతాగుల్మోమే, మురా? బారో, సమాజిక్ నే, కబీర్ అభిప్రాయ్, ముఖ్ దేఖే జే బిగ్యాపనే, బాబరర్ ప్రార్థనా' వంటివి ఘోష్ ప్రముఖ రచనలు. ఆయన రచనలు హిందీ, మరాఠీ, అస్సామీ, పంజాబీ, మలయాళం తదితరాలతో పాటూ కొన్ని విదేశీ భాషల్లోకి అనువాదమైనాయి. అంతకు ముందుశంఖ ఘోష్ కు 2011లో భారత ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డును ప్రకటించింది.

నోబెల్ సాహితీ పురస్కారం - 2018

# ఓల్గా టొకర్జుక్



పోలండ్ రచయిత్రి ఓల్గా టొకర్జుక్‌కు 2018 లో సాహిత్య విభాగంలో నోబెల్ బహుమతి లభించింది.సమగ్ర భావావేశంతో, పరిమితులను అధిగమించే జీవన విధానాన్ని వర్ణించే చక్కటి కల్పిత కథనం రాసినందుకు ఓల్గాకు నోబెల్ పురస్కారాన్ని ప్రకటించింది.ఓల్గా టొకర్జుక్‌మొదటి నవల'ద జర్నీ ఆఫ్ ద పీపుల్ ఆఫ్ ద బుక్' 1993లో ప్రచురితమైంది.మొదటి ప్రపంచ యుద్ధం నుంచి 1980వ దశకం వరకు పోలండ్ చరిత్రను వివరించే 'ప్రైమ్‌వల్ అండ్ అదర్ టైమ్స్'తో ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది.ఆమె రాసిన 'డ్రైవ్ యువర్ ప్లౌ ఓవర్ ద బోన్స్ ఆఫ్ ది డెడ్' నవల జంతువుల్ని చంపటాన్ని చూసి సహించలేని ఒక వృద్ధ మహిళ ఆవేదనకు అద్దం పడుతుంది.స్త్రీవాది అయిన ఓల్గా మహిళా హక్కుల గురించి పోరాటాలూ చేస్తుంటారు.

సభలు సమావేశాలు

# ఆత్మ పరిశీలన గొప్ప లక్షణం

## నేను-2 ఆవిష్కరణ సభలో ఎమ్మెల్సీ కవిత



మనిషి తనను తాను పరిశీలించు కోవడం, అర్థం చేసుకోవడం గొప్ప లక్షణం అని, తనలోకి తాను చూసుకో గలిగితే ధైర్యం సాహసం కరుణ మానవత్వం మనిషికి అలవడతాయని నరాల సుధాకర్ 'నేను'అనే శీర్షికతో కవిత్వం రాస్తూ తన అంతరంగాన్ని నిరంతరం దర్శిస్తూ సమాజంలో ఆదర్శంగా ఎదుగుతాడని, శాసన మండలి సభ్యురాలు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, కల్వకుంట్ల కవిత అన్నారు. గురువారం నాడు హరిదా రచయితల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాదులోని తన కార్యాలయంలో, ఆమె నరాల సుధాకర్ రచించిన నేను 2 కవితా సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. సామాజిక సేవ, ఆధ్యాత్మికత, సాహిత్య సాంస్కృతిక సేవ, ప్రకృతి పరిశీలన, మానవ పరిణామాలు అంశాలుగా కవిత్వం రాసిన నరాల సుధాకర్ తెలంగాణ సాహిత్య రంగంలో తనకంటూ శైలిని ఏర్పరుచుకున్నాడు అని అభినందించారు. ఈ పుస్తకాన్ని తనకు అంకితం ఇవ్వడం పట్ల ఆమె సంతోషాన్ని వ్యక్తం చేశారు. కవి నరాల సుధాకర్‌ను జ్ఞాపికతో శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో తొలి ప్రతి స్వీకరించిన ప్రముఖ కవి నర్సింహారెడ్డి మాట్లాడుతూ కవిత్వం అంటే నిరంతరం పరిణితి సాధించడం అని, సుధాకర్ కవిత్వం ఆరోహణ క్రమంలో అద్భుతంగా సాగుతోందని వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన హరిదా రచయితల సంఘం అధ్యక్షుడు ఘనపురం దేవేందర్ మాట్లాడుతూ మంచి కవిత్వం రాయాలనే తపన, మంచి పనులు చేయిస్తుందని కవిగా, సమాజ సేవకుడిగా, విద్యావేత్తగా సుధాకర్ బహుముఖంగా రాణిస్తున్నారని సుధాకర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగు నవీన్ ఆచారి, ఉపాధ్యక్షుడు రాజీవ్ సాగర్, జిల్లా అధ్యక్షుడు అవంతి రావు, సాహిత్య విభాగం అధ్యక్షుడు తిరుమల శ్రీనివాసాచార్య, దశరథ్ కొత్మీర్కర్, కొయ్యడ శంకర్, తంగళ్ళపల్లి నరేష్ చారి, సురేష్, హనుమాన్లు, నరాల స్వప్న, మోహన సాయి, తదితరులు పాల్గొన్నారు. శాసన మండలి సభ్యురాలుగా విజయం సాధించినందుకు సంఘం తరఫున కవితను సన్మానించారు.

# తెలంగాణ రచయితల సంఘం జంటనగరాల శాఖ ఆధ్వర్యంలో మొట్ట మొదటి కవి సమ్మేళనం




తెలంగాణ రచయితల సంఘం జంటనగరాల శాఖ ఆధ్వర్యంలో జూం ద్వారా తేది 23-11-2020 నాడు కవి సమ్మేళనం నిర్వహించారు. ఇందులో రూప్ కుమార్ డబ్బీకార్, ఒద్దిరాజుప్రవీణ్ కుమార్, దేవనపల్లి వీణావాణి, నక్కాహరికృష్ణ తదితరులు కవితలు చదివారు. జంటనగరాల శాఖ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కందుకూరిశ్రీరాములు, బెల్లంకొండ సంపత్ కుమార్ లు సమన్వయ కర్తలుగా వ్యవహరించారు.

# తెలంగాణ జాగృతి జూం సభ



తెలంగాణ జాగృతి బుక్ క్లబ్ పి.వి. స్మరణ సంవత్సరంలో ప్రతి నెలా ఏర్పాటు చేస్తున్న జూమ్ ప్రసంగం సందర్భంగా నవంబర్ 28,2020 శనివారం రోజున కె.విద్యావతి ప్రసంగం ఏర్పాటు చేసింది. కె.విద్యావతి, మాదిరెడ్డి సులోచన 'సుషుప్తి' నవలపైన ప్రసంగించారు. బహుజన వాదం తెలుగు సాహిత్యంలో ప్రవేశించక ముందే ఆ దృక్పథంతో మాదిరెడ్డి 'సుషుప్తి' రచించారని ఆమె తెలియజేశారు. కుమ్మరి కులాన్ని గురించి రాసిన 'సుషుప్తి' నవలపైన విద్యావతి సుదీర్ఘ ప్రసంగం చేశారు. తెలంగాణ జాగృతి సాహిత్య విభాగం అధ్యక్షులు కాంచనపల్లి గో.రా. సంచాలకులుగా వ్యవహరించారు.




**కాగితపు పడవ**

ప్రొఫెసర్ పి.లక్ష్మీ నారాయణ
వెల: రూ.25




**విపంచి**

డా. రాయారావు
సూర్య ప్రకాశ్ రావు
వెల: రూ. 200




**అవలోకనం**

126 రచయిత్రుల కరోనా డైరీ
జ్వలిత
వెల: రూ.200




**బావే నా ప్రాణం**

తొగర్ల సురేష్
వెల: రూ. 30




**వరద గూడు**

వై. సత్యనారాయణ
వెల: రూ. 60
9347225379




**శిబ్బి కవిత్వం**

బండారు శంకర్
వెల: రూ. 60
9573089453




**యువ కళాకారుని ఆత్మగీతం**

అనువాదం:
చింతపట్ల సుదర్శన్
వెల: రూ. 150
9299809212




**ఆర్తి**

బైరెడ్డి కృష్ణ రెడ్డి
వెల: రూ. 300
ఫోన్: 9440072211




**కవుల తెలంగాణం**
తెలంగాణ కవుల కవిత్వ పరామర్శ

రాచపాళెం చంద్రశేఖరరెడ్డి
వెల: రూ. 100




**స్కైలాబ్ పతనం**

బూర భిక్షపతి
వెల: రూ. 20
ఫోన్: 9866612717

